www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 29-9-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 183 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: ద్వాదశి సా 4.48 తదుపరి త్రయోదశి; నక్షత్రం: మఖ పూర్తి; వర్జ్యం: సా.4.58-6.45; దుర్ముహూర్తం: సా.4.26-5.14; అమృతఘడియలు: తె.3.38-5.25; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.01 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా మృతి

ఇరాన్ జనరల్ అబ్బాస్ కూడా..

బీరుట్‌లో ఓ బంకర్‌లో సమావేశం.. గుర్తించి దాడులు చేసిన ఇజ్రాయెల్

నస్రల్లా కూతురు జైనబ్ మృతిచెందినట్లు ఐడీఎఫ్ ప్రకటన

32 ఏళ్లుగా హిజ్బుల్లా చీఫ్‌గా నస్రల్లా

బీరుట్‌పై కొనసాగుతున్న దాడులు.. 720కి చేరిన మరణాలు

రహస్య ప్రదేశానికి ఇరాన్ సుప్రీం లీడర్

అమెరికన్లకు న్యాయం: బైడెన్

టెల్‌అవీవ్/బీరుట్, సెప్టెంబరు 28: ఇరాన్ మద్దతుతో.. లెబనాన్ భూభాగం పైనుంచి ఇజ్రాయెల్‌పై భీకర క్షిపణి దాడులు చేస్తున్న హిజ్బుల్లా ఉగ్ర సంస్థకు పెద్ద దెబ్బ తగిలింది. శుక్రవారం రాత్రి దక్షిణ బీరుట్‌లోని దహియాపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వైమానిక దళం చేసిన క్షిపణి దాడుల్లో.. హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా మృతిచెందారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ జనరల్ అబ్బాస్ నిల్ఫోరుషన్ కూడా ఈ దాడిలో దుర్మరణంపాలయ్యారు. వీరిద్దరితోపాటు.. హిజ్బుల్లాకు చెందిన ఒక కమాండర్ అలీ కర్కీ, ఇద్దరు డిప్యూటీ కమాండర్లు, నస్రల్లా కుమార్తె జైనబ్ నస్రల్లా కూడా మృతిచెందినట్లు ఐడీఎఫ్ శనివారం ఉదయం ప్రకటించింది. మధ్యాహ్నానికి

మిగతా 2వ పేజీలో...



శామీర్‌పేటలో జరిగిన నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి తదితరులు

ఫ్యామిలీ కార్డులో
యజమానిగా మహిళ

సంక్షేమ పథకాల్లోని సమాచారం ఆధారంగా కుటుంబాల నిర్ధారణ

నియోజకవర్గానికి రెండు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు

3 నుంచి క్షేత్రస్థాయి పరిశీలన.. అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్!.. మంత్రివర్గ ఉపసంఘం యోచన

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డులో.. మహిళను కుటుంబ యజమానిగా గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇతర కుటుంబ సభ్యుల పేర్లు, వారి వివరాలను కార్డు వెనుక పేర్కొనాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, వ్యవసాయ, ఇతర సంక్షేమ పథకాల్లోని సమాచారం ఆధారంగా డిజిటల్ కార్డుకు కుటుంబాల నిర్ధారణ చేయాలన్నారు. శనివారం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అంశంపై సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లో అమల్లో ఉన్న కార్డులను పరిశీలించి ఉత్తమ విధానాలు స్వీకరించాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు, పాన్ కార్డు వంటి సమాచారం సేకరించాల్సిన అవసరం

మిగతా 13వ పేజీలో...

13

'కేబీఆర్' చుట్టూ ట్రాఫిక్ ఫ్రీ!

పార్క్ చుట్టూ అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు.. యూటర్నులు లేకుండా చర్యలు

826 కోట్లతో 6 జంక్షన్ల అభివృద్ధి.. జీహెచ్ఎంసీకి అనుమతులిచ్చిన ప్రభుత్వం

న్యాయవాదులు పారదర్శకంగా ఉండాలి

అట్టడుగు వర్గాలకు న్యాయం అందేలా కృషి చేయాలి

సంపన్నులతో పోలిస్తే నేటికీ న్యాయం పొందలేని పేదలు

నల్సార్ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

రాష్ట్రపతి నిలయంలో కళా మహోత్సవ్ ప్రారంభం 13

జర జాగ్రత్త రేవంత్!

ప్రభుత్వాధినేతగా రేవంత్ రెడ్డి ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం అలవరుచుకోవాలి. చెరువులు, జలాశయాల పరిరక్షణ అవసరమే. అంతమాత్రాన ఈ విషయంలో దూకుడు తగదు. ఆక్రమణల పేరిట వేలాది ఇళ్లు కూల్చడం ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుంది. హైడ్రా చర్యల వల్ల ఏ పాపం తెలియని వాళ్లు నిరాశ్రయులు అవుతున్నారు. ఫాం హౌజ్‌లను, అతిథి గృహాలను నిబంధనలను అతిక్రమించి నిర్మిస్తే కూల్చినా పర్వాలేదుగానీ.. అన్ని అనుమతులతో పేదలు, మధ్య తరగతి వారు నిర్మించుకున్న వాటిని, దశాబ్దాల క్రితం నిర్మించుకున్న వాటిని తొలగించాలనుకోవడం మంచిది కాదు.



కొత్త పలుకు

మూసీని అభివృద్ధి చేయాలనుకోవడం తప్పు కాదు. అయితే... దశాబ్దాలుగా మూసీలో ఆక్రమణలు జరిగాయి. వేలాది మంది ఇళ్లను నిర్మించుకున్నారు. నిజానికి మూసీ ప్రాజెక్టును ప్రజలు కోరుకోలేదు. ఫాం హౌస్‌ల కూల్చివేతలు జరిగినప్పుడు ప్రజల్లో సానుకూల స్పందన ఏర్పడింది. అయితే, హైడ్రా దూకుడు పెంచి సామాన్య ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను కూడా కూల్చివేయడం ప్రారంభించగానే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. చెరువులు, జలాశయాల ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లను ముందుగా నిర్ణయించకుండా, ఇతర శాఖల అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం సమర్థనీయం కాదు. ఇది అంతిమంగా ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుంది.

రేవంత్ తక్షణం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. **కూల్చివేతలకు తాత్కాలికంగా విరామం ప్రకటించాలి.** మొత్తం పరిస్థితిని సమీక్షించాలి. కూల్చివేతలపై ప్రజల్లో వ్యతిరేకత బలపడకముందే ప్రభుత్వం మేలుకోవాలి. తమది నిర్మాణాత్మక ప్రభుత్వమైతే.. రేవంత్‌ది కూల్చివేతల ప్రభుత్వమని బీఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన విమర్శ ప్రజల్లోకి వ్యాపించక ముందే జాగ్రత్తలు తీసుకోవాలి. కూల్చివేతలే అజెండా అయితే ప్రతిపక్షానికి బలమైన ఆయుధం ఇచ్చినట్టు అవుతుంది. కూల్చివేతలు మాత్రమే జరుగుతున్నాయని ప్రజల్లో అభిప్రాయం ఏర్పడితే రేవంత్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తలపెట్టిన **మూసీ ప్రాజెక్టును తాత్కాలికంగా పక్కన పెట్టడం వాంఛనీయం.**

ఎవరో చేసిన నేరాలకు మరెవరినో శిక్షించడం సమర్థనీయం కాదు! ఆక్రమణలైనా.. మరేవైనా ప్రజలతో ముడిపడి ఉన్న సందర్భాలలో ప్రభుత్వం సంయమనంతో వ్యవహరించాలి.

కూల్చివేతలపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనే ప్రయత్నం ఇప్పుడు జరగాలి. హైడ్రా చర్యలను తొలుత ఆక్షేపించని ప్రతిపక్షాలు ఇప్పుడు ఎందుకు స్వరం పెంచుతున్నాయో తెలుసుకొనే ప్రయత్నం ప్రభుత్వం చేయాలి. రేవంత్ ప్రభుత్వం అంటే కూల్చివేతల ప్రభుత్వం అనే పేరు తెచ్చుకోవద్దు. హెచ్చరికలతో కూడిన ఈ సూచనలను సీఎం రేవంత్ పట్టించుకుంటారో లేదో వేచి చూద్దాం!

ప్రభుత్వాన్ని నడపడంలో రేవంత్ కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. విపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషను సీఎంగా కూడా వాడితే ప్రజలు హర్షించరు. సీఎం అంటే హుందాతనం ఉండాలి. కేసీఆర్, కేటీఆర్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోకూడదు. తమ ప్రభుత్వ నిర్ణయాలకు ప్రజామోదం ఉందా? లేదా? అని మాత్రమే చూసుకోవాలి.

వ్యక్తులు టార్గెట్‌గా ప్రభుత్వాన్ని నడిపితే ఫలితం ప్రతికూలంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లక ముందే ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటు కాంగ్రెస్ అధిష్ఠానం మేలుకోవాలి. 4

మూసీలో మార్కింగ్ నిలిపివేత

నిరసనల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వెనక్కి 12

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు 85 కుటుంబాల తరలింపు

ఎట్టి పరిస్థితుల్లో కఠినంగా వ్యవహరించొద్దు: సర్కార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దానకిశోర్, రంగనాథ్

ఎవరినీ బలవంతంగా తరలించం

ఇష్టప్రకారమే మూసీ నిర్వాసితుల తరలింపు

పట్టాలు ఉన్నవారికి చట్టప్రకారం పరిహారం

అనధికార నిర్మాణాల బిల్డర్లపై కేసులు

పిల్లలు నష్టపోతారనే విద్యాసంస్థల్ని కూల్చలే

హైడ్రా బూచీ కాదు.. భరోసా

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం

పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మూసీ నదీ గర్భం (రివర్ బెడ్)లో నివసిస్తున్న ప్రజలను బలవంతంగా కాకుండా ఇష్టప్రకారమే తరలిస్తున్నామని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్ఎఫ్‌డీసీఎల్) ఎండీ దానకిశోర్ తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. సంవత్సరాల తరబడి ఉన్న ప్రాంతం వీడి వెళ్లలేని వారి భావోద్వేగాన్ని అర్థం చేసుకోగలమని, వారికి సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. సొంత భవనాలు నిర్మించుకున్నవారికి నిబంధనల ప్రకారం చెల్లింపులు చేస్తామని.. నదీ గర్భంలో నివాసం ఉన్న పేదలను ప్రభుత్వం కన్నబిడ్డల్లా చూసుకుంటుందని పేర్కొన్నారు. నిర్వాసితులకు ఉపాధి, వసతుల కల్పన, ఇళ్ల

మిగతా 12వ పేజీలో...

బుచ్చమ్మ ఆత్మహత్య.. రంగనాథ్‌పై ఎన్‌హెచ్ఆర్సీ కేసు

నీటి నిల్వతోనే కుంగింది



కుంగిన మేడిగడ్డ బ్యారేజీ (ఫైల్)

నిల్వ చేస్తే తప్ప బ్యారేజీలు నడిచే పరిస్థితి లేదు

సరిపడా వరద వెళ్లేలా బ్యారేజీని డిజైన్ చేయలేదు

నిల్వతో ఒత్తిడి పెరిగి పునాది నుంచి ఇసుక జారింది

ప్రవాహ వేగాన్ని అంచనా వేయలేకపోవడమూ కారణం

ఘోష్ కమిషన్ విచారణలో రామగుండం మాజీ ఈఎన్సీ

మార్పులకు వ్యాప్కోస్ ఆమోదంపై దాటవేత

కమిషన్‌నే తప్పుదోవ పట్టిస్తారా.. అంటూ ఘోష్ ఫైర్

2 విడతలుగా ప్రశ్నలు.. మళ్లీ రావాలని ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): "బ్యారేజీలు నీటి మళ్లింపు కోసమే కట్టాలి. కానీ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే తప్ప మోటార్లు అన్నీ నడిపే పరిస్థితుల్లేవు. బ్యారేజీలో నీటి నిల్వతో ఒత్తిడి పెరిగింది. దాంతో పునాది (రాఫ్ట్) కింద నుంచి ఇసుక జారింది. ఈ కారణం వల్లే మేడిగడ్డ ఏడో బ్లాకు కుంగింది. సరిపడా వరద వెళ్లేలా బ్యారేజీని డిజైన్ చేయకపోవడం ఒక కారణం. గేట్ల ఆపరేటింగ్ షెడ్యూల్‌ను పాటించకపోవడం, వరద ప్రవాహ వేగాన్ని సరిగ్గా అంచనా వేయకపోవడంతో సీసీ బ్లాకులు చెల్లాచెదురై, స్టోన్ లాంచింగ్ ఆప్రాన్లు దెబ్బతిన్నాయి" అని జస్టిస్ పినాకీ చంద్ర ఘోష్ కమిషన్ విచారణలో రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. విచారణలో భాగంగా కాళేశ్వరం కమిషన్ శనివారం ఆయనను క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ విచారించి 71 ప్రశ్నలను సంధించింది. సమాధానాలు పరిపూర్ణంగా లేవని, రికార్డులు

మిగతా 14వ పేజీలో...

నిండుతున్న శ్రీశైలం!

84.61%కి చేరిన నీటి నిల్వ

జూరాలకు 1.33 లక్షల క్యూసెక్కుల రాక

శ్రీపాద ఎల్లంపల్లికి 1.29 లక్షల ఇన్‌ఫ్లో 13

గత ఏడాది 406 మంది

రైతుల ఆత్మహత్య

కాంగ్రెస్ వచ్చిన 7 నెలల్లో 158 మంది

1995-2013 మధ్య ఉమ్మడి ఏపీలో 36,358 మంది రైతుల బలవన్మరణం

వీరిలో 60% తెలంగాణ వారే..

రైతు స్వరాజ్య వేదిక నివేదిక వెల్లడి 14



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కేంద్ర మంత్రి బండి సంజయ్, లక్ష్మణ్, రాంచందర్‌రావు

15 రోజుల్లో..

40 లక్షల సభ్యత్వాలే లక్ష్యం

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశావహులను ప్రోత్సహించండి

రాష్ట్ర నేతలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా దిశానిర్దేశం

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాబోయే 15 రోజుల్లో 40 లక్షల పార్టీ సభ్యత్వాల నమోదు సాధించడమే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ రాష్ట్ర నేతలకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తితో ఉన్న వారి నాయకత్వాన్ని ప్రోత్సహించి పార్టీ సభ్యత్వాలు సాధించాలని అన్నారు. హైడ్రా, రైతు సమస్యలపై ప్రజాపోరాటాలు చేస్తూనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగించాలని దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని హరిత ప్లాజాలో పార్టీ ముఖ్య నేతలతో శనివారం సమావేశమైన జేపీ నడ్డా.. పార్టీ సభ్యత్వ నమోదుపై

మిగతా 13వ పేజీలో...

12

హైడ్రా కొరివితో ప్రభుత్వం

తల గోక్కుంటోంది

కూల్చివేతలకు నిరసనగా త్వరలో ఛలో హైద్రాబాద్

జగన్ అబ్దుల్ కలాం కంటే తోపా? రాష్ట్రపతి హోదాలోనే కలాం తిరుమలలో డిక్లరేషన్ ఇచ్చారు

జగన్.. లడ్డూను కల్తీ చేసినట్టే ఉంది: బండి

హైడ్రా భయంతోనే బుచ్చమ్మ ఆత్మహత్య: ఈటల



లైఫ్ సపోర్ట్ తీసేయొచ్చు

పరోక్ష కారుణ్య మరణానికి కేంద్రం ముసాయిదా మార్గదర్శకాల విడుదల

జీవచ్ఛవంలా బతుకీడుస్తున్న రోగుల కోసం..

జీవనాధార వైద్య ప్రక్రియల తొలగింపు ద్వారా మరణం.. 4 షరతులు 2

వాటి ఆధారంగానే నిర్ణయం

అక్టోబరు 20 వరకు సూచనలకు అవకాశం

7 వాస్క్యులర్ కేంద్రాల ఏర్పాటుపై జీవో

18 డయాలసిస్ కేంద్రాలకు కూడా..

ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి' 13

హైడ్రోజన్ బాంబులా హైడ్రా

మూసీలో పేదల రక్తం పారించే ప్రయత్నం

బుచ్చమ్మది ఆత్మహత్య కాదు.. ప్రభుత్వ హత్య: హరీశ్‌రావు



బుచ్చమ్మ మృతదేహాన్ని సందర్శించడానికి 'గాంధీ'కి వచ్చిన హరీశ్, సబిత

మూసీ సుందరీకరణకు లక్షన్నర కోట్లా?

దాంతో మురిసే రైతులెందరు? పాలమూరు-రంగారెడ్డిపై శీతకన్ను ఎందుకు? హైడ్రా బాధితులకు అండగా ఉంటాం: కేటీఆర్ 12

హైదరాబాద్/అడ్డగుట్ట/హైదర్‌నగర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైడ్రా.. హైడ్రోజన్ బాంబులా మారిందని, ఎవరికీ కంటి మీద కునుకు లేకుండా పోయిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీలో గోదావరి నీళ్లు పారిస్తానని చెప్పి పేద, మధ్య తరగతి ప్రజల రక్తం, కన్నీళ్లు పారించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. శనివారం తెలంగాణ భవన్‌లో మూసీ సుందరీకరణ బాధితులతో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. హైడ్రా బాధితులకు న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో 24 గంటలు బీఆర్ఎస్ లీగల్ టీమ్

మిగతా 12వ పేజీలో...



ఐఫా పురస్కారాల్లో మెరిసిన తారాలోకం

చిరంజీవి, బాలకృష్ణకు ప్రత్యేక పురస్కారాలు

» ఉమెన్ ఆఫ్ ది ఇయర్ సమంత.. ఉత్తమ చిత్రంగా 'దసరా'

అబుదాబి: ప్రతిష్ఠాత్మక ఐఫా (ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్) 2024 పురస్కారాల వేడుక శనివారం అబుదాబిలో ఘనంగా జరిగింది. బాలీవుడ్‌తో పాటు దక్షిణాది చిత్ర పరిశ్రమ నుంచి పలువురు అగ్రతారలు హాజరయ్యారు. 2024కు గాను అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా పురస్కారాన్ని చిరంజీవి అందుకున్నారు. నందమూరి బాలకృష్ణ ఐఫా గోల్డెన్ లెగసీ పురస్కారాన్ని స్వీకరించారు. ఐఫా ఉమెన్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం సమంతకు దక్కింది. దసరా చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా నాని, ఉత్తమ విలన్‌గా షైన్ టామ్ చాకో అవార్డులు అందుకున్నారు. ఉత్తమ నటి పురస్కారాన్ని స్వీకరించేందుకు వేదికపైకి వచ్చిన ఐశ్వర్యారాయ్‌బచ్చన్ బాలకృష్ణ పాదాలకు నమస్కరించి పురస్కారాన్ని అందుకోవడం విశేషం.

పీఎస్ 2కు అత్యధిక పురస్కారాలు

తమిళ పరిశ్రమ నుంచి 'పొన్నియిన్ సెల్వన్ 2' చిత్రం అత్యధిక పురస్కారాలను కైవసం చేసుకుంది. ఉత్తమ నటిగా ఐశ్వర్యారాయ్ బచ్చన్, ఉత్తమ నటుడిగా విక్రమ్, ఉత్తమ దర్శకుడిగా మణిరత్నం, ఉత్తమ సంగీత దర్శకుడిగా ఏ ఆర్ రెహమాన్, ఉత్తమ సహాయ నటుడిగా జయరామ్ పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ తమిళ చిత్రంగా 'జైలర్' నిలిచింది. ఎస్. జే సూర్య (మార్క్ ఆంటోని)కు ఉత్తమ విలన్ పురస్కారం దక్కింది. కన్నడ సీమ నుంచి 'కాటేరా' చిత్రానికి గాను జగపతిబాబు ఉత్తమ విలన్, తరుణ్ సుధీర్ ఉత్తమ దర్శకుడు పురస్కారాన్ని దక్కించుకున్నారు.

విజేతలు వీరే

- **ఉత్తమ దర్శకుడు** - అనిల్ రావిపూడి (భగవంత్ కేసరి)
- **ఉత్తమ సినిమాటోగ్రఫీ** - 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'
- **ఉత్తమ సహాయ నటుడు** - బ్రహ్మానందం (రంగమార్తాండ)
- **ఉత్తమ నటి** - మృణాల్ ఠాకూర్, (హాయ్ నాన్న),
- **ఉత్తమ సహాయ నటి** - వరలక్ష్మి శరత్‌కుమార్ (వీరసింహారెడ్డి)
- **ఉత్తమ సంగీత దర్శకుడు** - హేషమ్ అబ్దుల్ వహాబ్ (హాయ్ నాన్న)
- **ఉత్తమ గీత రచయిత** - అనంత్ శ్రీరామ్ (బేబీ)
- **ఉత్తమ నేపథ్య గాయకుడు** - రాహుల్ సిప్లిగంజ్
- **ఉత్తమ నేపథ్య గాయని** - మంగ్లీ (బలగం)

వందల మంది అమెరికన్లకు న్యాయం: బైడెన్

వాషింగ్టన్: నస్రల్లా మరణంపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్పందించారు. నాలుగు దశాబ్దాల్లో వందల మంది అమెరికన్లను హిజ్బుల్లా పొట్టనబెట్టుకుందని, నస్రల్లా మరణంతో ఆ కుటుంబాలకు 'న్యాయం జరిగింది' అని వ్యాఖ్యానించారు. నస్రల్లాను హతమార్చడం సరైందేనని పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థల నుంచి తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని, అమెరికా పూర్తి మద్దతిస్తుందని అన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి శుక్రవారమే తాను తన కార్యదర్శితో అమెరికా బలగాలను మోహరించాలని ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. చర్చల ద్వారానే గాజా, లెబనాన్‌లో ఉద్రిక్తతలను తగ్గించవచ్చని అభిప్రాయపడ్డారు. కాగా.. బీరుట్‌లోని తమ ఎంబసీ ఉద్యోగులు కుటుంబాలతో సహా లెబనాన్‌ను విడిచిపెట్టాలని అమెరికా హెచ్చరించింది. తమ పౌరులెవరూ లెబనాన్ వెళ్లకూడదంటూ 'ట్రావెల్ అలెర్ట్' జారీ చేసింది.

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు

బెంగళూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్ల పేరిట అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ అంశంపై జనాధికార సంఘర్ష పరిషత్ ఉపాధ్యక్షుడు ఆదర్శ్ అయ్యర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం 42వ ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ అయింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన కోర్టు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బెంగళూరులోని తిలక్‌నగర్ పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబరు 10కి వాయిదా వేసింది. దీంతో పోలీసులు శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్(ఏ1), ఈడీ (ఏ2), బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా(ఏ3), మాజీ ఎంపీ నళిన్‌కుమార్(ఏ4), బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర(ఏ5), రాష్ట్ర బీజేపీ నేతల(ఏ6)పై ఐపీసీ 384, 120 బీ, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎలక్టోరల్ బాండ్ల ముసుగులో వివిధ కార్పొరేట్ కంపెనీల ఎండీలు, సీఈవోలను బెదిరించి రూ.8వేల కోట్లు దోపిడీ చేశారని ఆదర్శ్ అయ్యర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. "ఎఫ్ఐఆర్ నమోదైనందున కేంద్ర మంత్రి నిర్మల తన పదవికి రాజీనామా చేస్తారా" అని ప్రశ్నించారు.

ఢిల్లీలో తండ్రి, నలుగురు కూతుళ్ల ఆత్మహత్య!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: దేశ రాజధాని ఢిల్లీలోని వసంత్‌కుంజ్‌లో ఘోరం జరిగింది. ఓ కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో లోపలి నుంచి తలుపులు బిగించుకొని 48 ఏళ్ల ఇంటి పెద్ద, ఆయన నలుగురు కూతుళ్లు బలవన్మరణానికి పాల్పడ్డారు. నలుగురి కూతుళ్ల 15-25 ఏళ్ల మధ్య వయస్కులు. నలుగురూ మానసిక వికలాంగులే! ఈ అమ్మాయిల తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. శుక్రవారం వాళ్ల ఫ్లాట్‌లోంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారొచ్చి తలుపులు బద్దలుకొట్టి చూసేసరికి నలుగురి మృతదేహాలు కుళ్లిపోయిన స్థితిలో కనిపించాయి. 3-4 రోజుల క్రితమే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతదేహాల పక్కన పురుగుల మందు డబ్బా, జ్యూస్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్ కనిపించాయి.

దేశ ప్రయోజనాలే మిన్నగా బతికిన వ్యక్తి ఏచూరి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా దేశ ప్రయోజనాలే విన్నగా జీవితాంతం బతికిన వ్యక్తి సీతారాం ఏచూరి అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఎన్డీయేకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిని ఐక్యంగా ఉంచి, బలంగా ముందుకు తీసుకెళ్లడంలో తెరవెనుక ఏచూరి కీలక పాత్ర పోషించారని తెలిపారు. శనివారం, ఇక్కడ తాల్‌కటోరా స్టేడియంలో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభను ఆ పార్టీ నిర్వహించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడారు. ఏచూరికి తాను స్నేహితుడిని అయినందుకు గర్వంగా ఉందన్నారు.

డిప్యూటీ సీఎంగా ఉదయనిధి.. నేడు ప్రమాణం

చెన్నై, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు సీఎం స్టాలిన్ తనయుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ డిప్యూటీ సీఎంగా ఎన్నికయ్యారు. తన మంత్రివర్గాన్ని విస్తరించడంలో భాగంగా స్టాలిన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. డిప్యూటీ సీఎంగా ఉదయనిధి ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు పదవీ ప్రమాణం చేస్తారు. ఉదయనిధితోపాటు సెంథిల్ బాలాజీ మంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ఓ అవినీతి కేసులో అరెస్టు అయిన సెంథిల్ బాలాజీని మంత్రిగా గవర్నర్ తొలగించిన విషయం తెలిసిందే.

నేపాల్‌లో వరదలు..66 మంది మృతి

కఠ్మాండూ, సెప్టెంబరు 28: నేపాల్‌ను వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. భారీ వర్షాల ధాటికి కొండచరియలు విరిగిపడి కనీసం 66 మంది మృత్యువాత పడ్డారు. మరో 60మంది గాయపడ్డారు. 79మంది గల్లంతైనట్లు శనివారం అధికారులు తెలిపారు. గురువారం నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలకు చాలా ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. దేశవ్యాప్తంగా 3రోజుల పాటు అన్ని బడులకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది.

హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా హతం



బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడులు



నస్రల్లా



అబ్బాస్

(మొదటి పేజీ తరువాయి)

హిజ్బుల్లా వర్గాలు కూడా హసన్ నస్రల్లా మృతిని ధ్రువీకరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశాయి. "జెరూసలేం వైపు వెళ్లే క్రమంలో జరుగుతున్న పోరాటంలో నస్రల్లా అమరుడయ్యారు" అని పేర్కొన్నాయి. ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఆ ప్రకటనలో స్పష్టం చేశాయి. నస్రల్లా ఉనికిని గుర్తించిన ఐడీఎఫ్ పక్కా వ్యూహంతో 'ఆపరేషన్ న్యూ ఆర్డర్' పేరుతో భీకర దాడులు జరిపింది. దహియాలోని ఓ ఇంటి కింద ఉన్న బంకర్‌లో నస్రల్లా ఉన్నట్లు గుర్తించి, అంతమొందించింది. "నస్రల్లా ఇకపై ఈ ప్రపంచాన్ని ఉగ్రవాదంతో భయభ్రాంతులకు గురి చేయలేడు" అని ప్రకటించింది. పేజర్ బాంబులు, వాకీటాకీ పేలుళ్ల తర్వాత.. లెబనాన్‌పై వైమానిక దాడులను ముమ్మరం చేసిన ఇజ్రాయెల్.. వ్యూహాత్మకంగా.. ఒక్కొక్కరుగా హిజ్బుల్లా కీలక నేతలను అంతమొందిస్తూ వచ్చింది. బుధవారం హిజ్బుల్లా క్షిపణి విభాగం కమాండర్ మహమ్మద్ అలీ ఇస్మాయిల్ అడ్డు తొలగించింది. గురువారం వైమానిక దళ కమాండర్ మహమ్మద్ హుస్సేన్ సోరౌర్‌ను హతమార్చింది. శనివారం సాయంత్రం కొనసాగించిన దాడుల్లో హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ విభాగం సీనియర్ నేత హసన్ ఖలీల్ యాసిన్ మృతి చెందినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

16 ఏళ్ల ప్రాయంలో ఉద్యమం వైపు..

నస్రల్లా 1960లో బీరుట్ శివారులోని బుర్జ్ హమ్ముద్‌లో ఓ చిరు కూరగాయల వ్యాపారి ఇంట్లో తొమ్మిది మంది తోబుట్టువుల్లో ఒకరిగా నస్రల్లా జన్మించారు. 16 ఏళ్ల వయసులో షియా పొలిటికల్, పారామిలిటరీ గ్రూప్ ఉద్యమం 'అమల్'లో చేరారు. అప్పుడే ఆయన పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్(పీఎల్‌వో) నేత అబ్బాస్ అల్ ముసావి దృష్టిలోపడ్డారు. 1980లో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసి, బీరుట్ నుంచి పీఎల్‌వోను తరిమికొట్టింది. అప్పటి నుంచి ఇజ్రాయెల్ వ్యతిరేక ఉద్యమాల్లో నస్రల్లా కీలకంగా వ్యవహరించారు. 1982లో హిజ్బుల్లా ఏర్పాటులో నస్రల్లాది కీలక పాత్ర. 1992లో అప్పటి హిజ్బుల్లా అధినేత అబ్బాస్ అల్ ముసావిని ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. దీంతో సంస్థ పగ్గాలను నస్రల్లా అందుకున్నారు. అప్పటికి అతడి వయసు 32 సంవత్సరాలు. 2006లో లెబనాన్‌లో జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్‌ను ఓడించడంలో ఆయన కీలక ప్రాత పోషించారు. అప్పటి నుంచే ఇజ్రాయెల్‌కు బద్ధ శత్రువుగా మారారు. హిజ్బుల్లా ప్రభావాన్ని దేశ సరిహద్దులు దాటించి.. 2011లో సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొనేలా చేశారు. కాగా.. 1997లో ఇజ్రాయెల్ సైనికులతో జరిగిన పోరాటంలో నస్రల్లా తన పెద్ద కుమారుడు హదీని కోల్పోయారు. తాజాగా బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడుల్లో కుమార్తె జైనబ్ ప్రాణాలను పోగొట్టుకున్నారు.

రహస్య ప్రదేశానికి ఖమేనీ

నస్రల్లా మరణం.. ఇజ్రాయెల్ సైన్యం దూకుడు నేపథ్యంలో ఇరాన్ అప్రమత్తమైంది. నస్రల్లాతోపాటు.. తమ సైన్యానికి చెందిన జనరల్ కూడా మరణించడంతో ఇజ్రాయెల్‌పై అగ్గిమీద గుగ్గిలమవుతోంది. ఈ క్రమంలో ముందు జాగ్రత్తగా ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలను ప్రసారం చేసింది. అయితే.. అంతకు ముందు ఖమేనీ హిజ్బుల్లా, పశ్చిమాసియాలోని ఇతర మిత్ర పక్షాలతో అత్యవసరంగా భేటీ అయినట్లు తెలుస్తోంది. నస్రల్లా మరణం నేపథ్యంలో ఖమేనీ ఒక ప్రకటన విడుదల చేశారు. "లెబనాన్ ప్రజలకు, హిజ్బుల్లాకు అండగా ఉండాలి. దాడులను ఎదుర్కోవడంలో వారికి సహాయం చేయాలి" అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. నస్రల్లా మృతితో లెబనాన్‌కు తమ బలగాలను పంపి, ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనేందుకు ఇరాన్ సిద్ధమవుతోందని విశ్లేషకులు పేర్కొన్నారు. కాగా.. నస్రల్లా మృతిని హమాస్, ఇరాక్ కూడా ఖండించాయి. ఇరాక్ ఏకంగా మూడు రోజుల సంతాప దినాలను ప్రకటించింది.

వారసుడు హాషిమ్ కర్కోటకుడే?

నస్రల్లా మరణంతో అతని వారసుడిపై చర్చ మొదలైంది. ఆయన తర్వాత హిజ్బుల్లాలో నంబర్-2గా ఉండే అవకాశం ఉన్న నేతలందరినీ ఐడీఎఫ్ ఈ వారం రోజుల్లో మట్టుబెట్టింది. దీంతో హిజ్బుల్లా విదేశాంగ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న నస్రల్లా తమ్ముడి వరస అయ్యే హాషిమ్ సఫీద్దీన్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఇరాన్ కూడా అధికారికంగా ఆమెదం తెలిపితే.. వెంటనే హిజ్బుల్లా తమ కొత్త నాయకుడిగా హాషిమ్ పేరును ప్రకటించే అవకాశాలున్నాయి. అయితే.. నస్రల్లా కంటే హాషిమ్ కర్కోటకుడని, ఆయనకు ర్యాడికల్ భావజాలం మరీ ఎక్కువని పశ్చిమాసియా వ్యవహారాల నిపుణులు చెబుతున్నారు.

దాడులు ఉధృతం

శనివారం మధ్యాహ్నం నుంచి బీరుట్, దహియాపై ఐడీఎఫ్ దాడులను ఉధృతం చేసింది. అంతకు ముందు ఈ ప్రాంతాలను వదిలి వెళ్లాలంటూ పౌరులకు ఐడీఎఫ్ హెచ్చరికలు చేసింది. "నస్రల్లా మరణంతో మా యుద్ధం ఆగదు" అంటూ సందేశాలు పంపింది. కాగా.. గడిచిన వారం రోజుల్లో లెబనాన్ పౌరులు సుమారు 2 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయెల్ దాడుల్లో 720 మంది మృతిచెందారు.

7 నిమిషాలు.. 80 బాంబులు.. నస్రల్లా ఖతం!

గడిచిన వారం రోజులుగా ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సంస్థ మొస్సాద్.. నస్రల్లా జాడ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో మొస్సాద్ నుంచి ఐడీఎఫ్‌కు కీలక సమాచారం అందింది. "దహియాలో ఇరాన్ ప్రతినిధితో నస్రల్లా, ఇతర కీలక నేతలు భేటీ కానున్నారు" అనేది అందులోని సారాంశం. అంతే.. ఆగమేఘాల మీద ఇజ్రాయెల్ వార్‌రూమ్, ఐడీఎఫ్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉరుకులు-పరుగులు మొదలయ్యాయి. త్రివిధ దళాధిపతులు అక్కడకు చేరుకున్నారు. తమకు వచ్చిన సమాచారాన్ని ఒకటికి రెండు సార్లు నిర్ధారించుకున్నాక.. వైమానిక దళం చీఫ్– మేజర్ జనరల్ టోమర్ బార్ నేతృత్వంలో 'ఆపరేషన్ న్యూ ఆర్డర్' ప్రారంభమైంది. త్రివిధ దళాధిపతులు ఉత్కంఠగా కంప్యూటర్ల ముందు కూర్చుని, తమ వైమానిక దళాలు బీరుట్‌వైపు వెళ్లడాన్ని గమనించారు. అర్ధరాత్రి దాటాక.. సరిగ్గా నస్రల్లా ఉన్న బంకర్ వద్దకు వైమానిక దళం చేరుకోగానే.. మేజర్ జనరల్ టోమర్ బార్ ఆదేశాలు జారీ చేశారు. అప్పటిదాకా టార్గెట్‌ను లాక్ చేసి.. ఆదేశాల కోసం ఎదురుచూసిన ఫైటర్ పైలట్లు.. 7 నిమిషాల వ్యవధిలో ఒక్కోటి టన్ను బరువుండే 80 బంకర్ బ్లాస్టర్(జీబీయూ-28) బాంబులను జారవిడిచారు. అంతే.. ఆ బంకర్ పైభాగంలో ఉన్న భవనం కుప్పకూలిపోయింది. మంటలు చెలరేగాయి. 80 బాంబులతో చేసిన దాడిలో.. ఎవరూ బతికే అవకాశాలుండవని నిర్ధారించుకున్న వెంటనే ఇజ్రాయెల్ విమానాలు వెనుదిరిగాయి. తర్వాత నస్రల్లా మరణంపై ప్రకటన వెలువడింది.

లోకం తీరు





భారత్ వరం ఇరాన్ శాపం

» ఐరాస సమావేశంలో నెతన్యాహు

సెప్టెంబరు 28 : హమాస్‌తో యుద్ధం మొదలైన తర్వాత తొలిసారి ఐక్యరాజ్యసమితి వేదికగా ప్రసంగించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సర్వసభ్య సమావేశంలో ప్రసంగం సందర్భంగా... ఆయన రెండు చేతుల్లో రెండు మ్యాపులను ప్రదర్శించారు. కుడి చేతిలో 'శాపం' అని రాసి ఉన్న మ్యాప్‌లో ఇరాన్, ఇరాక్, సిరియా, యెమెన్ దేశాలుండగా అవి నలుపు రంగులో ఉన్నాయి. అలాగే ఎడమ చేతిలో 'వరం' అని రాసి ఉన్న మ్యాప్‌లో ఆకుపచ్చ రంగులో భారత్‌తో పాటు ఈజిప్టు, సుడాన్, సౌదీ అరేబియా దేశాలున్నాయి. ఇవి ఇజ్రాయెల్‌తో సన్నిహిత సంబంధాలున్న దేశాలు కావడం విశేషం. అయితే రెండు మ్యాపుల్లోనూ పాలస్తీనా ఆనవాళ్లు కూడా లేకపోవడం గమనార్హం. కాగా, ప్రస్తుత ఘర్షణలకు ఇరాన్, దాని మిత్రదేశాలే కారణమని నెతన్యాహు పేర్కొన్నారు. పశ్చిమాసియాను అస్థిరపరిచేందుకు హమాస్, హిజ్బొల్లా, హౌతీలకు టెహ్రాన్ ఆర్థికంగా సహకరిస్తోందని ఆరోపించారు. "మీరు దాడి చేస్తే తిరిగి మేము ప్రతిదాడి చేస్తామ"ని ఇరాన్‌ను హెచ్చరించారు. భారత్‌తో ఇజ్రాయెల్‌కు ఉన్న సత్సంబంధాలకు సూచికగానే నెతన్యాహు వరం అనే మ్యాపులో దాన్ని చూపినట్లు తెలుస్తోంది. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య సాంకేతిక, రక్షణ రంగాల్లో వాణిజ్య సంబంధాలు బలపడ్డాయి.

పల్లెల పురోగతికి ప్రణాళికలు

» 2న దేశవ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు

» 2.55 లక్షల పంచాయతీల్లో నిర్వహణ

» అభివృద్ధి ప్రణాళికలపై మార్గనిర్దేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: పల్లెలను పురోగతి బాట పట్టించే దిశగా కేంద్రం ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో భాగంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై దిశానిర్దేశం చేసేందుకు అక్టోబరు 2న ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనుంది. ఈ సభల్లో దేశవ్యాప్తంగా 2.55 లక్షల గ్రామ పంచాయతీలు, 6,700 బ్లాక్ పంచాయతీలు, 665 జిల్లా పంచాయతీలు పాల్గొంటాయని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. అన్ని పంచాయతీల్లో భాగస్వామ్య ప్రణాళికను పెంపొందించడం, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు(పీడీపీ) సకాలంలో రూపొందించడం లక్ష్యంగా 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్' అభియాన్ కింద శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో 20వేల మంది కళాశాల విద్యార్థులు పాల్గొంటారని, వారంతా వివిధ పంచాయతీల్లో పీడీపీల తయారీకి సహకరిస్తారని అధికారులు వెల్లడించారు. ఈ సభలను పర్యవేక్షించడానికి అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఎంపిక చేసిన పంచాయతీలకు అధికారులు, కన్సల్టెంట్లను నియమిస్తున్నారు. అక్టోబరు 2 కార్యక్రమానికి ముందు, ఈ నెల 30న మంత్రిత్వ శాఖ ఒక జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించనుంది. దీనిలో వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు, పంచాయతీల ప్రతినిధులు పాల్గొని తన అనుభవాలను పంచుకుంటారు.

లైఫ్ సపోర్ట్ తీసేయొచ్చు

పరోక్ష కారుణ్య మరణానికి మార్గదర్శకాలు.. ముసాయిదా విడుదల చేసిన కేంద్ర ఆరోగ్యశాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: చికిత్సతో ఎంతమాత్రమూ కోలుకోవటానికి అవకాశం లేకుండా, మరణశయ్యపై ఉన్న రోగులకు పరోక్ష కారుణ్య మరణాన్ని అందించే అంశానికి సంబంధించి కేంద్ర ఆరోగ్యశాఖ శనివారం ముసాయిదా మార్గదర్శకాలను వెలువరించింది. జీవనాధార వైద్య ప్రక్రియలపైనే (లైఫ్ సస్టెయినింగ్ ట్రీట్‌మెంట్స్ - ఎల్ఎస్టీపై) ఆధారపడిన రోగులను దృష్టిలో ఉంచుకొని వీటిని రూపొందించారు. వీటి ప్రకారం.. వెంటిలేషన్, వాసోప్రెషర్స్, డయాలిసిస్, శస్త్రచికిత్సలు, ట్రాన్స్‌ఫ్యూజన్స్, పేరెంటల్ న్యూట్రిషన్స్ తదితర ప్రక్రియలను ఎల్ఎస్టీగా పేర్కొన్నారు. 'వీటిని కొనసాగించటం ద్వారా రోగికి ఎంత మాత్రమూ ఉపశమనం లేనప్పుడు అవి రోగికి మరింత భారంగా పరిణమిస్తాయి. అంతేగాక రోగి కుటుంబంపై అవి మానసికంగా, ఆర్థికంగా ఒత్తిడి కలుగజేస్తాయి. ఇటువంటి ఐసీయూ కేసుల్లో ఎల్ఎస్టీని తొలగించటం ప్రపంచవ్యాప్తంగా అనుసరిస్తున్న విధానం' అని వివరించారు.

నాలుగు షరతులు

ఎల్ఎస్టీని తొలగించటం ద్వారా రోగికి పరోక్ష కారుణ్య మరణాన్ని కల్పించటానికి పాటించాల్సిన నాలుగు షరతులను ఈ మార్గదర్శకాల్లో పొందుపరిచారు. అవి, 1. రోగిని బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారా? 2. రోగి పరిస్థితి పూర్తిగా విషమించిందని, ఎంత తీవ్రమైన చికిత్సను అందించినా మెరుగుపడే అవకాశం లేదని వైద్యులు భావిస్తున్నారా? 3. ఎల్ఎస్టీని కొనసాగించవద్దని రోగి లేదా రోగి తరఫు వ్యక్తులు రాతపూర్వకంగా తెలియజేశారా? 4. ఎల్ఎస్టీపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందా?. వీటి ద్వారా ఎల్ఎస్టీ తొలగింపుపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. కాగా, ఆరోగ్యం పూర్తిగా విషమించిన రోగులకు ఎల్ఎస్టీ చికిత్సను ప్రారంభించే ముందు కూడా డాక్టర్లు ఈ షరతులను పరిగణనలోకి తీసుకోవాలని ముసాయిదా మార్గదర్శకాల్లో నిర్దేశించారు. చికిత్స జరిగే క్రమంలో తాను నిర్ణయాధికార సామర్థ్యాన్ని కోల్పోతే తన తరఫున వైద్యులు నిర్ణయం తీసుకోవటానికి వీలుగా రోగి అంగీకారం తెలియజేయవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. దీని ప్రకారం, ముగ్గురు వైద్యులతో ఒక ప్రైమరీ మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని, ఈ బోర్డు ఎల్ఎస్టీ తొలగింపుపై రోగికి సంబంధించిన వారికి అన్ని వివరాలు తెలిజేసి, ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నిర్ణయాన్ని, మరో ముగ్గురు వైద్యులతో కూడిన సెకండరీ మెడికల్ బోర్డు ఆమోదించాలని తెలిపారు. సెకండరీ బోర్డులో ఒక వైద్యుడిని జిల్లా వైద్యాధికారి నియమించాలన్నారు. కాగా, ఈ ముసాయిదా మార్గదర్శకాలపై వచ్చే నెల 20వ తేదీ వరకూ సూచనలు, సలహాలు తమకు తెలియజేయవచ్చని కేంద్రం తెలిపింది. పేషంట్ కోరిక మేరకు ప్రాణాలు తీయటాన్ని ప్రత్యక్ష కారుణ్య మరణం అని, ఎల్ఎస్టీ తొలగించడాన్ని పరోక్ష కారుణ్య మరణం అని పేర్కొంటారు.



డాక్టర్లపై ఒత్తిడి పెరుగుతుంది: ఐఎంఏ

కేంద్రం మార్గదర్శకాలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్వీ అశోకన్ వ్యతిరేకించారు. వీటి ద్వారా డాక్టర్లపై చట్టపరమైన చర్యలకు అవకాశం ఉంటుందని, వారి మీద ఒత్తిడి పెరుగుతుందని ఆయన తెలిపారు. యంత్రాల ద్వారా రోగిని బతికిస్తున్నారన్న ఆలోచనే తప్పు అని పేర్కొన్నారు. సైన్స్ పరిస్థితుల ఆధారంగా రోగి- కుటుంబసభ్యులు- డాక్టర్ కలిసి తీసుకునే నిర్ణయాలను వారికే వదిలేయాలని, మార్గదర్శకాల పేరుతో వాటిని పరిమితం చేయటం సరికాదన్నారు.

అమెరికాలో హెలెన్ బీభత్సం

» విరుచుకుపడిన కేటగిరి 4 హరికేన్

» 52 మంది మృతి, అంధకారంలో 30 లక్షల మంది

పెర్రీ, సెప్టెంబరు 28: అమెరికా ఆగ్నేయ ప్రాంతంలో హెలెన్ తుఫాను విధ్వంసం సృష్టిస్తోంది. తుఫాను ధాటికి ఐదు రాష్ట్రాల్లో దాదాపు 52 మంది చనిపోగా అపారమైన ఆస్తి నష్టం సంభవించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గురువారం రాత్రి ఫ్లోరిడాలోని బిగ్‌బెండ్ ప్రాంతంలో మొదలైన కేటగిరి 4 హరికేన్ భీకర గాలులతో విరుచుకుపడింది. గంటకు 225 కిలోమీటర్ల వేగంతో వీచిన పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. జార్జియా, కరోలినా, టెన్నెస్సీ గుండా సాగిన హెలెన్ ధాటికి అనేక వృక్షాలు నేల కూలగా, జనావాసాలు చెల్లాచెదురయ్యాయి. కొండచరియలు విరిగిపడటం, తీవ్ర స్థాయిలో వరద ముంచెత్తడంతో కొన్ని ప్రాంతాలు పూర్తిగా జలదిగ్బంధమయ్యాయి. విద్యుత్ సరాఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినడంతో దాదాపు 30 లక్షల మంది అంధకారంలో ఉన్నారు. ఫ్లోరిడా, జార్జియా, ఉత్తర, దక్షిణ కరోలినా, వర్జీనియాలో ఎక్కువగా మరణాలు సంభవించాయి. అట్లాంటాలో రికార్డు స్థాయిలో 28 సెంమీల వర్షపాతం నమోదైంది.

అర్బన్ నక్సల్స్ గుప్పిట కాంగ్రెస్

» వారిని బుజ్జగించడానికి ఏమైనా చేస్తుంది

» జమ్మూ కశ్మీర్ ఎన్నికల సభల్లో మోదీ



జమ్మూ, సెప్టెంబరు 28 : అర్బన్ నక్సల్స్ గుప్పిట్లో కాంగ్రెస్ పార్టీ ఉన్నదని, వారిని బుజ్జగించడానికి ఆ పార్టీ ఏమైనా చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. కశ్మీర్‌లో జవాన్ల త్యాగాల గురించి కాంగ్రెస్‌కు తెలియదని దుయ్యబట్టారు. "ఇది కొత్త భారతం. ఇంట్లోకి చొరబడి మరీ హతమారుస్తుంది" అంటూ 2016లో సరిగ్గా ఇదే రోజు (సెప్టెంబరు 28) పాకిస్థాన్‌పై జరిగిన మిలిటరీ సర్జికల్ స్ట్రైక్స్‌ను ఆయన గుర్తుచేశారు. జమ్మూకశ్మీరుకు రాష్ట్ర హోదా తొలగించి కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం అనేది కొద్ది కాలానికి మాత్రమే తీసుకున్న నిర్ణయమని మోదీ వివరించారు. జమ్మూకశ్మీర్‌లో మూడో విడత ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో శనివారం ప్రధాని మోదీ పర్యటించారు. జమ్మూ నడిబొడ్డున ఉన్న ఎమ్ఏఎమ్ స్టేడియంలో జరిగిన బీజేపీ ప్రచార సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్-ఎన్సీ కూటమి, పీడీపీ పార్టీలపై విరుచుకుపడ్డారు. కశ్మీర్ ప్రజలకు ఆ మూడు పార్టీలు అన్యాయం చేశాయన్నారు. అవి తమ కుటుంబాలకు మేలు చేసుకున్నాయేగానీ, అంతులేని బాధల్లో ఉన్న కశ్మీరీలను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. లోపాయికారీ కాంగ్రెస్ రాజకీయాలు, నిర్లక్ష్యమే కశ్మీరీలకు శాపాలుగా మారాయన్నారు. "పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా జరిగిన మిలిటరీ సర్జికల్ స్ట్రైక్స్ విశ్వసనీయతను ప్రశ్నించే కాంగ్రెస్ ద్రోహాన్ని మరవగలమా? ఓటుబ్యాంకు కోసం విదేశీ చొరబాటుదారులకు కాంగ్రెస్ స్వాగతం పలుకుతోంది. సొంత ప్రజలను మాత్రం అవమానిస్తోంది" అని దుయ్యబట్టారు. జమ్మూకశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని మోదీ అన్నారు. బీజేపీకి మాత్రమే ఆ శక్తి ఉన్నదని స్పష్టం చేశారు. "తమను గెలిపిస్తే పాత వ్యవస్థను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్-ఎన్సీ, పీడీపీ చెబుతున్నాయి. బీజేపీకి అధికారం కట్టబెడితే మహిళా సాధికారికత కోసం పాటుపడతామని వివరించారు. "స్వయం సహాయక గ్రూపులను ఏర్పాటుచేసి అక్కచెల్లెమ్మలను ధనవంతులను చేస్తాం. తగిన శిక్షణ ఇప్పించి డ్రోన్లను వారికి ఇప్పిస్తాం" అని తెలిపారు.

బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28: బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులపై అమల్లో ఉన్న నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. అయితే టన్నుకు 490 డాలర్ల కనీస ఎగుమతి ధర (ఎంఈపీ)ను శనివారం విధించింది. అలాగే ఈ బియ్యంను ఎగుమతి సుంకం నుంచి మినహాయించింది. దేశీయంగా బియ్యం సరఫరాను పెంచడానికే కాకుండా ధరలను నియంత్రించే ఉద్దేశంతో గత ఏడాది జూలైలో బాస్మతీయేతర తెల్ల బియ్యంపై కేంద్రం నిషేధం విధించింది. తాజాగా బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయడంతోపాటు కనీస ఎగుమతి ధరను విధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. దేశంలోని గోదాముల్లో బియ్యం నిల్వలు పెరగడం, రిటైల్ ధరలు నియంత్రణలోనే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. మరోవైపు పారాబాయిల్డ్ బియ్యంపై ఎగుమతి సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి కేంద్రం తగ్గించింది. బ్రౌన్ రౌస్‌పై ఎగుమతి సుంకాన్ని 10శాతానికి తగ్గిస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని రెవెన్యూ విభాగం ఓ నోటిఫికేషన్‌లో పేర్కొంది. బాస్మతీయేతర తెల్లబియ్యంపైనా ఎగుమతి సుంకం 20శాతం ఉండగా ఈ బియ్యాన్ని ఎగుమతి సుంకం నుంచి మినహాయించారు. తక్షణమే సుంకాల్లో మార్పు అమల్లోకి వస్తుందని నోటిఫికేషన్‌లో తెలిపారు.

హైదరాబాద్-విజయపుర
రైళ్ల రద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ పరిధిలో భీమా వంతెన వద్ద ట్రాక్ మునిగిపోవడంతో ఆ ప్రాంతం నుంచి రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నేటి నుంచి అక్టోబర్ 1 వరకు కొన్ని రైళ్లను రద్దు చేయగా మరికొన్నింటిని దారి మళ్లించనున్నట్లు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1వ తేదీల్లో విజయపుర-హైదరాబాద్(17029) రైలును రద్దు చేసినట్టు పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 29, 30, అక్టోబర్ 1 తేదీల్లో హైదరాబాద్-విజయపుర(17030), అక్టోబర్ 1న రాయచూర్-విజయపురా(07664) రైలు, అలాగే సెప్టెంబర్30, అక్టోబర్1, 2 తేదీల్లో విజయపురా-రాయిచూర్(07663) రైళ్లను రద్దు చేసినట్టు వివరించారు. కాగా సెప్టెంబర్29, 30, అక్టోబర్ 1 తేదీల్లో హుబ్లీ-హైదరాబాద్(17319) రైలును, సెప్టెంబర్30, అక్టోబర్1, 2 తేదీల్లో హైదరాబాద్-హుబ్లీ (17320) రైళ్లను దారి మళ్లించనున్నట్టు రైల్వే అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, అయోధ్య - కాశీ పుణ్యక్షేత్ర యాత్ర రైలు శనివారం సికింద్రాబాద్ నుంచి బయలుదేరి వెళ్లింది. పితృదినాల సందర్భంగా పవిత్ర కాశీ, గయ క్షేత్రాల్లో సంప్రదాయం ప్రకారం పితృదేవతలకు పిండప్రదానం చేయడానికి వీలుగా ఈ రైలు యాత్రకు రూపకల్పన చేశారు. తొమ్మిది రోజుల పాటు గయ, వారాణసి, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లోని పుణ్యక్షేత్రాలను సందర్శించడంతో పాటు కాశీ, గయలో తమ తమ పూర్వికులకు నివాళులర్పించే సౌకర్యాన్ని కల్పించారు.

వెబ్‌సైట్‌లో డిస్కమ్ ఉద్యోగుల బదిలీ జాబితా

- ఈ నెల 30 వరకు అభ్యంతరాల స్వీకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డిస్కమ్‌లలో బదిలీ కానున్న ఉద్యోగుల జాబితాను అధికారులు వెలువరించారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి ఒకే చోట రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారిని బదిలీ చేయాలని డిస్కమ్‌లు నిర్ణయించాయి. ఆ ప్రకారం బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితాను శనివారం వెబ్‌సైట్‌లో పెట్టాయి. ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలియజేయాలని అధికారులు చెప్పారు. 2025 సెప్టెంబరు 30వ తేదీన లేదా దానికంటే ముందు పదవీ విరమణ చేసేవారికి బదిలీలు వర్తించవని స్పష్టం చేశారు. డిస్కమ్‌లలో భార్యాభర్తలు ఇద్దరూ పనిచేస్తుంటే వారిలో ఒకరికి, 70 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారికి మానసిక వైకల్యం కలిగిన పిల్లలు కలిగిన తల్లిదండ్రులకు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. జాబితాలో పేరున్న ఉద్యోగులు పోస్టింగుల కోసం అక్టోబరు 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు దరఖాస్తు పెట్టుకోవాలని సూచించారు. ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు అక్టోబరు 7న వెలువడనున్నాయని, బదిలీ అయిన ఉద్యోగులు అక్టోబరు 10వ తేదీన లేదా ఆ లోపు సంబంధిత స్థానాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

ప్రఖ్యాత రచయిత్రి, సాహిత్య పరిశోధకురాలు
బోయి విజయ భారతి ఇకలేరు

- పూలే జీవిత చరిత్రను తెలుగులోకి అనువదించిన తొలి రచయిత్రి
- సీఎం రేవంత్, కేసీఆర్ సంతాపం
- రాహుల్ బొజ్జాను పరామర్శించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే జీవిత చరిత్రను తెలుగులోకి అనువదించిన తొలి రచయిత్రి, పురాణ, ఇతిహాసాలపై విశ్లేషణాత్మక వ్యాఖ్యానాలు రాసిన ప్రసిద్ధ విమర్శకురాలు బోయి విజయభారతి (84) ఇకలేరు. కొంతకాలంగా జీర్ణకోశ సమస్యతో బాధపడుతున్న ఆమె నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం 6గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆమె, ప్రముఖ కవి బోయి భీమన్న, నాగరత్నమ్మ దంపతుల కుమార్తె. ప్రఖ్యాత మానవహక్కుల న్యాయవాది దివంగత బొజ్జా తారకం సతీమణి. విజయభారతి కుమార్తె డాక్టర్ మహిత ఉస్మానియా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ కాగా, కుమారుడు రాహుల్ బొజ్జా తెలంగాణ ఇరిగేషన్ శాఖలో ప్రిన్సిపల్ సెక్రెటరీగా ఉన్నారు. విజయభారతి పుట్టి, పెరిగింది ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజోలులో. అక్కడే ఎస్ఎల్సీ పూర్తిచేసిన అనంతరం కాకినాడలోని పిఠాపురం ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ అభ్యసించారు. కోఠి మహిళా కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు చదివారు. 'దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం - సాంఘిక పరిస్థితులు' అంశంపై పరిశోధన పూర్తిచేశారు. కొద్దికాలం సమాచార, పౌరసంబంధాల శాఖలో అనువాదకురాలిగా సేవలందించారు. నిజామాబాద్ మహిళా కళాశాల అధ్యాపకురాలిగా, వైస్ ప్రిన్సిపల్‌గా 1965 నుంచి78 వరకు పనిచేశారు. తెలుగు అకాడమీలో రీసర్చి ఆఫీసరుగా, డిప్యూటీ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇన్‌చార్జి డైరెక్టర్‌గా 1999లో పదవీ విరమణ పొందారు. ఆమె హయాంలోనే రాష్ట్రస్థాయి ఇంటర్ పాఠ్యపుస్తకాలు ఇంగ్లిషు మాధ్యమంలో రాయించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. భారతీయ కులవ్యవస్థ ఆధారంగా పురాణ, ఇతిహాసాలపై విశ్లేషణాత్మక వ్యాఖ్యానాలు రాశారు. 'సత్యహరిశ్చంద్రుడు', 'వ్యవస్థను కాపాడిన రాముడు', 'షట్చక్రవర్తులు', 'రామాయణ మునులు', 'దశావతారాలు', 'నరమేధాలు - నియోగాలు', 'ఇతిహాసాలు మహాభారతం', 'పురాణాలు - మరోచూపు', 'ఇతిహాసాలు - రామకథ' తదితర రచనలు వెలువడ్డాయి. విజయభారతి రాసిన 'బాబాసాహెబ్ డాక్టర్ అంబేడ్కర్', 'మహాత్మా జ్యోతిరావు పూలే' జీవిత చరిత్రలు అమితాదరణ పొందాయి. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఉమ్మడి ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి కాకిమాధవరావు, ఆదిత్యానాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, రాహుల్ బొజ్జాను పరామర్శించారు. టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, జూలూరు గౌరీశంకర్, విజయభారతి భౌతికకాయాన్ని సందర్శించారు. విజయ భారతి కోరిక మేరకు భౌతికకాయాన్ని ఉస్మానియా మెడికల్ కళాశాలకు అందించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, ప్రముఖ రచయిత్రి బోయి విజయభారతి మరణం బాధాకరం అంటూ సీఎం రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా ఆమె అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. విజయభారతి కుటుంబానికి ఎక్స్ వేదికగా రేవంత్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. విజయభారతి మరణం పట్ల మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు.

తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైందని పరిపాలన అధికారి జి.కళార్చన వెల్లడించారు. పెండింగ్ కేసులతో పాటు ప్రీలిటిగేషన్ కేసులు కలిపి 9.87 లక్షల కేసులు ఒక్కరోజే పరిష్కరించి, రూ. 222 కోట్లు పరిహారం అందజేసినట్లు పేర్కొన్నారు.
- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

లడ్డూపై రేపు సుప్రీంకోర్టులో విచారణ

మొత్తం ఐదు పిటిషన్లు సుప్రీంలో దాఖలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి లడ్డూ అపవిత్రం అయిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు సోమవారం విచారణకు రానున్నాయి. న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ ఎదుట ఈ పిటిషన్లపై విచారణ జరగనుంది. టీటీడీ లడ్డూల తయారీలో ఉపయోగించే నెయ్యిలో ఎద్దు, పంది తదితర జంతువుల కొవ్వు కలిపారంటూ జరుగుతున్న ప్రచారంపై కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరగాలని దాదాపు ఐదుగురు పిటిషన్లు దాఖలు చేశారు. లడ్డూలు అపవిత్రమైన సంఘటనపై విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా విశ్రాంత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో ఒక కమిటీని నియమించి దర్యాప్తు జరపాలని సుదర్శన్ న్యూస్ టీవీ సంపాదకుడు సురేశ్ ఖండేరావు పిటిషన్ దాఖలు చేశారు. ప్రసాదంలో మాంసాహార పదార్థాలు ఉపయోగించడం రాజ్యాంగంలోని 25, 26 అధికరణల కింద భక్తుల ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్టేనని పేర్కొన్నారు. లడ్డూల కల్తీపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ద్వారా దర్యాప్తు జరిపించాలని హిందూసేన అధ్యక్షుడు సుర్జిత్ సింగ్ యాదవ్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ సంస్థలు నిర్వహిస్తున్న హిందూ ఆలయాల్లో జవాబుదారీ పాలన అవసరమని, ఆలయాలపై ప్రభుత్వ యంత్రాంగం పట్టు లేకుండా చూడాలని చరిత్రకారుడు డాక్టర్ విక్రమ్ సంపత్, ప్రవచన కర్త దుష్యంత్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఇక.. సీనియర్ బీజేపీ నేత సుబ్రమణ్య స్వామి దాఖలు చేసిన పిటిషన్‌లో కోర్టు పర్యవేక్షణలో కమిటీని నియమించి దర్యాప్తు జరిగేలా చూడాలని కోరారు. చివరగా పిటిషన్ దాఖలు చేసిన వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కూడా కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర దర్యాప్తు జరగాలని లేదా నిపుణులను నియమించి విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణలో విచారణ జరిపించాలని కోరారు.

తిరుమల లడ్డూపై నో కామెంట్స్: రజినీకాంత్

చెన్నై, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీపై స్పందించేందుకు తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ నిరాకరించారు. శనివారం ఉదయం చెన్నై విమానాశ్రయానికి వచ్చిన రజనీని 'మీరు ఒక ఆధ్యాత్మికవేత్త.. తిరుపతి లడ్డూ కల్తీ వివాదంపై ఏమంటారు' అని విలేకరులు ప్రశ్నించగా.. 'నో కామెంట్.. ప్లీజ్.. థ్యాంక్స్' అని నవ్వుతూ కారెక్కి వెళ్లిపోయారు.



హవేలీ ఘన్‌పూర్‌లోని జడ్పీ పాఠశాలలో మూత్రశాల ముందు క్యూ కట్టిన బాలికలు

540మంది విద్యార్థులకు రెండే మరుగుదొడ్లు

- మూత్రం వస్తుందని మంచినీళ్లకు దూరం
- హవేళీఘన్‌పూర్ జడ్పీ పాఠశాలలో దుస్థితి

మెదక్, సెప్టెంబరు 28: ఆ పాఠశాలలో 300 మంది బాలికలకు ఒకే మూత్రశాల ఉంది. మొత్తం 540 మంది విద్యార్థులకు రెండే. విరామ సమయంలో మూత్రం చేయడానికి క్యూ కట్టాల్సిందే. మెదక్ జిల్లా హవేళీఘన్‌పూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఈ పరిస్థితి నెలకొంది. అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా దీనికి పేరుంది. పాఠశాలలో మూత్రశాలల కొరత ఉండటంతో విద్యార్థులు కనీసం మంచినీళ్లు తాగేందుకు కూడా భయపడుతున్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికైంది. రెండేళ్ల క్రితం స్థానిక సర్పంచ్ మన ఊరు-మన బడి కింద ఉపాధి హామీ నిధులతో పాఠశాలకు ప్రహరీ, వంటగది షెడ్లు నిర్మించారు. అందుకు సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకూ ప్రభుత్వం చెల్లించలేదు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాల పథకానికి ఎంపికైనా మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణానికి ఉత్తర్వులు రాలేదని తాజా మాజీ సర్పంచ్ శ్రీకాంత్ తెలిపారు. నిధులు మంజూరు కాకపోవడంతో పాఠశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు క్యూ కట్టాల్సిన దుస్థితి నెలకొందని ఆయన వాపోయారు.

8వ తరగతి బాలికపై
అత్యాచారం

- బడికి వెళ్లొస్తుండగా దాడి చేసి అఘాయిత్యం
- ఉన్మాదిని శిక్షించాలని విద్యార్థినుల ఆందోళన
- ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన.. కేసు నమోదు

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 28: బడికి వెళ్లొస్తున్న బాలికను అటకాయించిన ఓ ఉన్మాది.. ఆమెపై దాడి చేశాడు. బలవంతంగా ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. ఆసిఫాబాద్ జిల్లాలో శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆసిఫాబాద్ మండలంలోని ఓ గ్రామంలో 8వ తరగతి చదువుతున్న బాలిక శుక్రవారం సాయంత్రం పాఠశాల ముగిశాక సైకిల్‌పై ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో బొమ్మెన సాగర్(29) అనే యువకుడు ఆమెపై దాడి చేశాడు. బాలికను ఇంట్లోకి ఎత్తుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది. ఇంటికి చేరుకున్న బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో.. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్ 65(1)తో పాటు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా, సాగర్‌ను కఠినంగా శిక్షించాలని తోటి విద్యార్థినులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు శనివారం ఉదయం బూర్గుడ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. గంటన్నర పాటు ఆందోళన చేయడంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దోషిని కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

చెవి కమ్మల కోసం
చంపేశారు!

షాద్‌నగర్‌లో మహిళ దారుణ హత్య

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళను దారుణంగా హత్య చేసిన దుండగులు ఆమె చెవులను కోసేసి బంగారు కమ్మలను అపహరించుకుపోయారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఫరూఖ్‌నగర్ శ్రీనివాస కాలనీలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. జిల్లేడు-చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, భాగ్యలక్ష్మి(40) భార్యాభర్తలు. ఇద్దరూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే, కొంతకాలంగా భాగ్యలక్ష్మి భర్త వెంకటయ్యకు దూరంగా శ్రీనివాసనగర్ కాలనీలో ఉంటోంది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసి.. మృతదేహాన్ని ప్లాస్టిక్ సంచిలో చుట్టి శ్రీనివాస కాలనీలో పడేశారు. చెవి కమ్మల కోసం దుండగులు ఏకంగా ఆమె చెవులను కోసేశారు. రాత్రి 8.30 గంటల సమయంలో హాజీపల్లి రోడ్డులో భాగ్యలక్ష్మి ఓ వ్యక్తితో మాట్లాడినట్లు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. అందులో ఆమె ఆ వ్యక్తికి డబ్బులు ఇచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు. మహిళను హత్య చేసిన నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

జర జాగ్రత్త... రేవంత్!

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన భారత రాష్ట్ర సమితి ఇటీవలి కాలంలో దూకుడు పెంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా గడవక ముందే బీఆర్ఎస్ నాయకులు స్పీడు పెంచడానికి కారణం లేకపోలేదు. పది మాసాల క్రితం జరిగిన ఎన్నికల్లో అనూహ్య ఓటమితోపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తుంటి ఎముక విరిగి విశ్రాంతి తీసుకోవాల్సి రావడం, ఆయన కుమార్తె కవిత ఢిల్లీ లిక్కర్ కేసులో జైలుకు వెళ్లాల్సి రావడం వంటి వరుస పరిణామాలతోపాటు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోవడంతో బీఆర్ఎస్ భవితవ్యంపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి. దీనికి తోడు పార్టీ తరఫున గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడం కూడా ఆ పార్టీని కుంగదీసింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కొన్ని వ్యూహాత్మక తప్పిదాల వల్ల భారత రాష్ట్ర సమితి ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు ఇటీవలి కాలంలో దూకుడు పెంచి రేవంత్‌రెడ్డి సర్కార్‌పై విరుచుకుపడుతున్నారు. భవిష్యత్తుపై ఆ పార్టీ నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

> మూసీ నదిలో ఆక్రమణలు జరగడానికి గత ప్రభుత్వాలే కారణం. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. రాజకీయ పార్టీలు ఒత్తిళ్లు తెచ్చి ఆక్రమణలకు పాల్పడి నిర్మించుకున్న కాలనీలకు ఆయా శాఖల అధికారులతో నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను సమకూర్చాయి. ఓట్లకోసం ఖాళీ స్థలాలను ఆక్రమింపజేయడం మన రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. ఇలా ఆక్రమిత ప్రాంతాల్లో నిర్మితమైన ఇళ్లు చేతులు మారాయి. ఇప్పుడు డబ్బు పెట్టి వాటిని కొనుగోలు చేసినవాళ్లు లబోదిబోమనడం సహజం. ఆక్రమణలకు పాల్పడి ఇళ్లు నిర్మించి విక్రయించిన వారి నుంచి జరిమానా వసూలు చేసి బాధితులకు నష్టపరిహారం చెల్లించడం వంటి చర్యలపై దృష్టిపెట్టాలి. ఏళ్ల తరబడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణ అనేది హక్కుగా ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడింది.

దీంతో కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధపడిన మరింత మంది ఎమ్మెల్యేలు ప్రస్తుతానికి వెనక్కి తగ్గారు. ప్రజలకు కనపడకుండా, వినపడకుండా ఫాంహౌస్‌కే పరిమితమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, రాజకీయ వ్యూహాలకు పదునుపెట్టడం మొదలెట్టారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై న్యాయ పోరాటం చేసి వారిని అనర్హులుగా ప్రకటింపజేసి ఉప ఎన్నికలు వచ్చేలా కేటీఆర్, హరీశ్‌రావు వ్యూహరచన చేయగా, కేసీఆర్ వారిని వారిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారడానికి మరికొంత సమయం పడుతుంది. కనుక ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీయే మళ్లీ గెలుస్తుందని కేసీఆర్ అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. ఈ కారణంగా ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటింపచేయడంలో తొందరపడవద్దని, న్యాయ స్థానంలో వెంటనే తీర్పు రాకుండా కొంత సమయం తీసుకోవాలని కేసీఆర్ సూచించినట్టు చెబుతున్నారు. ఉప ఎన్నికలు అంటూ వస్తే వచ్చే ఏడాది జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని కేటీఆర్, హరీశ్‌రావుకు ఆయన సూచించినట్టు తెలిసింది. ఉప ఎన్నికలు వచ్చే లోపు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను పెంచే దిశగా దాడిని ఉధృతం చేయాలని కూడా కేసీఆర్ దిశానిర్దేశం చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి తెరవెనుక కూడా కొంత రాజకీయం చోటుచేసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

కళ తప్పిన 'కమలం'

నిజానికి భారత రాష్ట్ర సమితి ఇంత త్వరగా కోలుకుంటుందని ఎవరూ ఊహించలేదు. లోక్‌సభ ఎన్నికల వరకు జోరుమీదున్న భారతీయ జనతా పార్టీ ప్రస్తుతం ఎందుకో నెమ్మదించింది. రాష్ట్రం నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర మంత్రులుగా ఉన్నప్పటికీ ఆ పార్టీ కార్యక్రమాలు మందగించాయి. పార్టీ అధ్యక్షుడి మార్పు విషయమై కూడా బీజేపీ అధినాయకత్వం నిర్ణయం తీసుకోలేకపోతోంది. దీంతో రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలని భావించిన బీజేపీ ఇప్పుడు వెనుకబడింది. అదే సమయంలో భారత రాష్ట్ర సమితి స్పీడ్ పెంచింది. మరో నెలలో హర్యానా, రెండు నెలల్లో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రాని పక్షంలో ఆ ప్రభావం తెలంగాణ రాష్ట్రంలో పార్టీపై పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే వచ్చే ఏడాది ప్రారంభం నుంచి వేగం పెంచాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. ఈ కారణంగానే కేటీఆర్, హరీశ్‌రావు నోటికి పదును పెడుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రతిపక్షానికి ఊతమిస్తున్నాయి.

కాంగ్రెస్‌లో తగ్గిన జోష్

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాటి జోష్ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కనిపించడం లేదు. మంత్రులు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం కారణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పార్టీలో, ప్రభుత్వంలో పట్టుచిక్కడం లేదు. ఇదే సమయంలో మంత్రులపై అజమాయిషీ చేయలేని పరిస్థితిలోనూ ఆయన ఉన్నారు. అధిష్ఠానం జోక్యం ఎక్కువ కావడంతో ముఖ్యమంత్రి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హైదరాబాద్‌లోనే మకాం చేస్తున్నారు. ఆమె ఇక్కడ ఎందుకు ఉంటున్నారో తెలియదుగానీ ఆమెపై కొన్ని ఆరోపణలు కూడా వస్తున్నాయి. మరోవైపు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించిన సునీల్ కనుగోలు కూడా ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గత అనుభవాల నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం గుణపాఠం నేర్చుకున్నట్టుగా లేదు. చీటికి మాటికీ ముఖ్యమంత్రిని ఢిల్లీకి పిలిపించుకొని తమ చుట్టూ తిప్పుకొంటున్నారు. ఇందిరా గాంధీ హయాంలో పరిస్థితులు ఇలా ఉండేవి కావు. కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకొనే ముందు అధిష్ఠానం తరఫున దూతలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి అభిప్రాయ సేకరణ జరిపేవారు. ముఖ్యమంత్రులను మార్చాలనుకున్నప్పుడు కూడా అధిష్ఠానం నుంచి దూతలు వచ్చేవారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం తరఫున దూతగా జీకే మూపనార్ వస్తున్నారంటే ముఖ్యమంత్రుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఇప్పుడు ఇందుకు విరుద్ధంగా పీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేయాలన్నా, మంత్రివర్గ విస్తరణకు అనుమతులు కావాలన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకొని రోజుల తరబడి కూర్చోబెట్టుకుంటున్నారు. దీంతో 1983కి ముందు పరిస్థితులు పునరావృతం అవుతున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడుతోంది. కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం పెరిగిపోవడం వల్లనే 1982లో ఎన్టీఆర్ 'తెలుగువాడి ఆత్మగౌరవం' అన్న నినాదం అందుకొని తెలుగుదేశం పార్టీని ప్రారంభించారు. నిజానికి ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రముఖులు అని చెప్పుకొంటున్న వారికి ఢిల్లీలో పెద్దగా పని లేదు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ మినహా మరే రాష్ట్రంలోనూ పార్టీ అధికారంలో లేదు. అలాంటప్పుడు ఢిల్లీలో కూర్చొని ముఖ్యమంత్రులను పిలిపించుకొనే బదులు ఆయా రాష్ట్రాలకు వారే వెళ్లవచ్చు కదా అన్న అభిప్రాయం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. ఫలితంగా అప్పట్లో అసంతృప్త స్వరాలు వినిపించేవి కావు. పార్టీపైనా, ప్రభుత్వంపైనా రాజశేఖర రెడ్డికి పూర్తి పట్టు ఉండేది. కేంద్రంలో అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్ అధిష్ఠానం రాజశేఖర రెడ్డికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. ఇప్పుడు ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉంది. అయినా, ఏ రాష్ట్రంలోనైనా రాష్ట్ర నాయకుల రెక్కల కష్టంతో అధికారంలోకి వస్తే ఆ ప్రభుత్వంపై ఢిల్లీ పెద్దలు పెత్తనం చేయాలనుకుంటున్నారు. ఈ కారణంగా భవిష్యత్తులో తెలంగాణలో కాంగ్రెస్ బలహీనపడితే అందుకు పార్టీ అధిష్ఠానం కూడా బాధ్యత తీసుకోవలసి ఉంటుంది.

మంత్రులే ముఖ్యమంత్రుల్లా...

మంత్రులకు తమ శాఖల వ్యవహారాల్లో స్వేచ్ఛ ఉండాలి కానీ అది అపరిమితం కాకూడదు. మంత్రులకు కేటాయించిన శాఖలకు సంబంధించిన అంశాలలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకోలేని పరిస్థితి కల్పిస్తే ఎలా? కేసీఆర్ హయాంలో మంత్రులకు స్వేచ్ఛ ఉండేది కాదన్న విమర్శ ఉన్నప్పటికీ... ఇతర మంత్రిత్వ శాఖలపై అజమాయిషీ చేసే అధికారం ముఖ్యమంత్రికి లేకుండా చేయడం ఏమిటి? ఈ కారణంగా ఇప్పుడు తెలంగాణలో పలువురు మంత్రులు తామూ ముఖ్యమంత్రులమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు వైద్య ఆరోగ్య శాఖ పనితీరు అధ్వానంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు గతంతో పోల్చితే ఇప్పుడు బాగోలేదన్న అభిప్రాయం ఉంది. అలాగే, విద్యుత్ శాఖ పనితీరుపై కూడా ప్రజల్లో అసంతృప్తి నెలకొంటోంది. అయినా ఆయా శాఖల పనితీరును సమీక్షించి మెరుగుపరిచే స్వేచ్ఛ ముఖ్యమంత్రికి లేని పరిస్థితి. దీనికి తోడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కొన్ని సందర్భాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. వ్యక్తులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటే రాజకీయంగా నష్టమే జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏం జరిగిందో చూశాం. ప్రతిపక్ష నేత చంద్రబాబు టార్గెట్‌గానే ఆయన నిర్ణయాలు ఉండేవి. తాను జైలు జీవితం గడపడానికి కారణమని భావించి చంద్రబాబును కూడా జైలుకు పంపాలని జగన్‌రెడ్డి తపించారు. చివరికి తన కోరిక నెరవేర్చుకున్నారు. దానివల్ల ఆయన సాధించింది ఏమీ లేకపోగా ఎన్నికల్లో దారుణ పరాభవాన్ని మూటగట్టుకున్నారు. 11 సీట్లకే పరిమితం అయ్యారు. తెలంగాణలో కూడా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేసుకున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై కోపంతో వేధించారు. ఫలితంగా తెలంగాణలో ఒక వర్గం ఓటర్లను దూరం చేసుకున్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డిని జైలుకు పంపి తన అహాన్ని సంతృప్తిపరచుకొని ఉండవచ్చునుగానీ ఏకును మేకుగా తయారు చేస్తున్నానని మరచిపోయారు. ఆనాటి వేధింపులతో రాటుదేలిన రేవంత్‌రెడ్డి ఏకంగా ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. అప్పట్లో కేసీఆర్ అతిగా వ్యవహరించి ఉండకపోతే రేవంత్‌రెడ్డి ఈ స్థాయికి ఎదగడానికి మరికొంత సమయం పట్టేదేమో? ఇది గతం! ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి కూడా గత చేదు అనుభవాలను మరచిపోలేకపోతున్నారు. ఫలితంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను దృష్టిలో పెట్టుకొనే వ్యవహరిస్తున్నారు. తెలంగాణ సమాజంలో కేసీఆర్ కుటుంబ ప్రభావం లేకుండా చేయాలని చూసిన సందర్భాలను చూశాం. తెలంగాణ చిహ్నం, తెలంగాణ గీతం, తెలంగాణ తల్లి విగ్రహం వంటి అంశాలు ఈ కోవలోకే వస్తాయి. తెలంగాణ అనేది ఏ ఒక్కరి జాగీరూ కాదు. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్రను ఎవరూ తుడిచివేయలేరు. తాము స్వప్నించిన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో తనవంతు పాత్ర పోషించిన కేసీఆర్‌ను నెత్తిన పెట్టుకున్న ప్రజలే ఆయన నియంతృత్వ పోకడలను సహించలేక విసిరికొట్టారు. కేసీఆర్ వంటి శక్తిమంతమైన నాయకుడు కూడా ప్రజాగ్రహం ముందు తలవొంచక తప్పలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నడపడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వాడిన భాషను ముఖ్యమంత్రిగా కూడా వాడితే ప్రజలు హర్షించరు. నాయకుడిగా వాడిన భాషనే ముఖ్యమంత్రిగా కూడా కేసీఆర్ వాడారు. చివరకు బావుకున్నది ఏమీ లేదు. సుదీర్ఘ కాలం పాటు తెలంగాణ ఉద్యమం సాగింది కనుక కేసీఆర్ భాషకు ప్రజలు అలవాటుపడ్డారు. రేవంత్‌రెడ్డి ఆయనకంటే ఎంతో చిన్నవారు. ఈ కారణంగా కేసీఆర్ భాషను ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి వాడకూడదు. ముఖ్యమంత్రి అంటే హుందాతనం ఉండాలి. రాజశేఖర రెడ్డి మర్రిచెట్టులా విస్తరించడంతో తెలంగాణలో కాంగ్రెస్‌కు బలమైన నాయకులు లేకుండా పోయారు. ఫలితంగానే ఎవరికి వారు తామెందుకు ముఖ్యమంత్రి కాకూడదని 2014 నుంచి పోటీపడుతూ వచ్చారు. చివరికి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ప్రదర్శించిన దూకుడు ఆయనకు కలిసొచ్చింది. ప్రజలు ఆయనలో కేసీఆర్‌కు ప్రత్యామ్నాయ నాయకుడిని చూసుకున్నారు. అప్పుడున్న పరిస్థితులలో రేవంత్‌రెడ్డికి మాత్రమే ప్రజల్లో ఆదరణ ఉంది. ఎన్నికల సమయంలో పార్టీని ముందుకు నడిపించడంలో కూడా ఆయన తన సమర్థతను రుజువు చేసుకున్నారు. రేవంత్‌రెడ్డిలోని టాలెంట్‌ను గుర్తించిన రాహుల్‌గాంధీ ఆయనకు కొండంత అండగా ఉంటున్నారు. అయితే ప్రతిపక్షంలో ప్రదర్శించిన దూకుడు ప్రభుత్వాధినేతకు తగదని ముఖ్యమంత్రి తెలుసుకోవాలి. కేసీఆర్, కేటీఆర్‌ను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోకూడదు. తమ ప్రభుత్వ నిర్ణయాలకు ప్రజామోదం ఉందా? లేదా? అని మాత్రమే చూసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇరికించే అవకాశం రేవంత్‌రెడ్డికి ఉంది. అయితే ఇందులో అనేక ప్రతిబంధకాలు ఉన్నాయి. ఎన్నో ఒత్తిళ్లు ఉంటాయి. చర్యలంటూ తీసుకుంటే నీటి పారుదల శాఖలో పనిచేయడానికి ఇంజనీర్లు మిగలరన్నది అక్షర సత్యం. కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న పీసీ ఘోష్ కమిషన్ చేస్తున్న వ్యాఖ్యలను కూడా చూస్తున్నాం. అందుకే చివరకు గజం మిథ్య పలాయనం మిథ్య అవుతుంది. ఇప్పుడు అవినీతి ప్రాతిపదికన ఎన్నికల్లో ప్రజల తీర్పు ఉండటం లేదు. అలా అయితే జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయివుండేవారే కారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ అవినీతికి పాల్పడిన తీరును రుజువు చేసినా కాంగ్రెస్ పార్టీకి అదనపు ప్రయోజనం ఉండకపోవచ్చు. ఎన్నికల్లో తాము ఓడించిన వారిని ప్రజలు ఇట్టే మరచిపోతారు. అధికారంలో ఉన్నప్పుడు వారు చేసిన చర్యలను కూడా గుర్తుపెట్టుకోరు. ప్రభుత్వంలో ఉన్నవారి నిర్ణయాలు ఎలా ఉంటున్నాయని మాత్రమే చూస్తారు. వ్యక్తులు టార్గెట్‌గా ప్రభుత్వాన్ని నడిపితే ఫలితం ప్రతికూలంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లక ముందే ఇటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అటు కాంగ్రెస్ అధిష్ఠానం మేలుకోవాలి. రైతులకు రుణ మాఫీ చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు దాన్ని చాలా కాలం మరచిపోయారు. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ముందూ వెనుకా చూసుకోకుండా, ఆర్థిక వనరులను సమకూర్చుకోకుండా పౌరుషానికి పోయి రుణమాఫీకి పూనుకుంది. ప్రతిపక్షానికి అదే ఆయుధం అయింది. అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు ఎన్నో హామీలు ఇవ్వడం పరిపాటి అయింది. ప్రజలు కూడా అవన్నీ అమలు అవుతాయని ఆశించడం లేదు. మొత్తంగా ప్రభుత్వ పనితీరు సంతృప్తికరంగా ఉందా? లేదా? అని మాత్రమే చూస్తారు.

> ఇతర మంత్రిత్వ శాఖలపై అజమాయిషీ చేసే అధికారం ముఖ్యమంత్రికి లేకుండా చేయడం ఏమిటి? ఈ కారణంగా ఇప్పుడు తెలంగాణలో పలువురు మంత్రులు తామూ ముఖ్యమంత్రులమే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.



> ప్రజలను దృష్టిలో ఉంచుకొని మాత్రమే ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవాలి. వ్యక్తులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకుంటే రాజకీయంగా నష్టమే జరుగుతుంది. అప్పట్లో కేసీఆర్ అతిగా వ్యవహరించి ఉండకపోతే రేవంత్‌రెడ్డి ఈ స్థాయికి ఎదగడానికి మరికొంత సమయం పట్టేదేమో? ఇది గతం! ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి కూడా గత చేదు అనుభవాలను మరచిపోలేకపోతున్నారు. ఫలితంగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను దృష్టిలో పెట్టుకొనే వ్యవహరిస్తున్నారు. తెలంగాణ సమాజంలో కేసీఆర్ కుటుంబ ప్రభావం లేకుండా చేయాలని చూసిన సందర్భాలను చూశాం. తెలంగాణ చిహ్నం, తెలంగాణ గీతం, తెలంగాణ తల్లి విగ్రహం వంటి అంశాలు ఈ కోవలోకే వస్తాయి. తెలంగాణ అనేది ఏ ఒక్కరి జాగీరూ కాదు. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్రను ఎవరూ తుడిచివేయలేరు. తాము స్వప్నించిన తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో తన వంతు పాత్ర పోషించిన కేసీఆర్‌ను నెత్తిన పెట్టుకున్న ప్రజలే ఆయన నియంతృత్వ పోకడలను సహించలేక విసిరికొట్టారు. కేసీఆర్ వంటి శక్తిమంతమైన నాయకుడు కూడా ప్రజాగ్రహం ముందు తల వొంచక తప్పలేదు.

ఆచితూచి వెళితేనే...

ప్రభుత్వాధినేతగా రేవంత్‌రెడ్డి ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం అలవరుచుకోవాలి. చెరువులు, జలాశయాల పరిరక్షణ అవసరమే. అంతమాత్రాన ఈ విషయంలో దూకుడు తగదు. ఆక్రమణల పేరిట వేలాది ఇళ్లు కూల్చడం ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుంది. హైడ్రా చర్యల వల్ల ఏ పాపం తెలియనివాళ్లు నిరాశ్రయులు అవుతున్నారు. ఫాం హౌజ్‌లను, అతిథి గృహాలను నిబంధనలను అతిక్రమించి నిర్మిస్తే కూల్చినా ఫర్వాలేదుగానీ... అన్ని అనుమతులతో పేదలు, మధ్యతరగతివారు నిర్మించుకున్న వాటిని, దశాబ్దాల క్రితం నిర్మించుకున్న వాటిని తొలగించాలనుకోవడం మంచిది కాదు. ప్రభుత్వ స్థలాలు, చెరువు శిఖంను ఆక్రమించడం పరిపాటిగా మారింది. రాజకీయ పార్టీలు ఈ చర్యలను ఇప్పటివరకూ ప్రోత్సహించాయి. మూసీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనుకోవడం తప్పు కాదు. అయితే... దశాబ్దాలుగా మూసీలో ఆక్రమణలు జరిగాయి. వేలాది మంది ఇళ్లను నిర్మించుకున్నారు. నిజానికి ఈ ప్రాజెక్టును ప్రజలు కోరుకోలేదు. ఫాం హౌస్‌ల కూల్చివేతలు జరిగినప్పుడు ప్రజల్లో సానుకూల స్పందన ఏర్పడింది. అయితే, హైడ్రా దూకుడు పెంచి సామాన్య ప్రజలు నిర్మించుకున్న ఇళ్లను కూడా కూల్చివేయడం ప్రారంభించగానే ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. చెరువులు, జలాశయాల ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లను ముందుగా నిర్ణయించకుండా, ఇతర శాఖల అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం సమర్థనీయం కాదు. ఇది అంతిమంగా ప్రజల్లో వ్యతిరేకతకు దారితీస్తుంది. తాజాగా బుచ్చెమ్మ అనే మహిళ కూల్చివేతలకు భయపడి ఆత్మహత్య చేసుకుంది. మరోవైపు మూసీనది ప్రక్షాళన పేరుతో జనావాసాలను ఖాళీ చేయించడంపై కూడా ప్రజల్లో ఆగ్రహావేశాలు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించాలి. కూల్చివేతలకు తాత్కాలికంగా విరామం ప్రకటించాలి. మొత్తం పరిస్థితిని సమీక్షించాలి. రెండు రోజుల క్రితం సంగారెడ్డి వద్ద ఎవరో చెరువులో నాలుగు అంతస్తుల భవనం నిర్మించుకున్నారు. అలాంటి వాటిని కూల్చినా ఎవరూ పట్టించుకోరు. మూసీ నది విషయమే తీసుకుందాం. అక్కడ ఆక్రమణలు జరగడానికి గత ప్రభుత్వాలే కారణం. సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. రాజకీయ పార్టీలు ఒత్తిళ్లు తెచ్చి ఆక్రమణలకు పాల్పడి నిర్మించుకున్న కాలనీలకు ఆయా శాఖల అధికారులతో నీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను సమకూర్చాయి. ఓట్లకోసం ఖాళీ స్థలాలను ఆక్రమింపజేయడం మన రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. ఇలా ఆక్రమిత ప్రాంతాల్లో నిర్మితమైన ఇళ్లు చేతులు మారాయి. ఇప్పుడు డబ్బు పెట్టి వాటిని కొనుగోలు చేసినవాళ్లు లబోదిబోమనడం సహజం. కూల్చివేతలపై ప్రజల్లో వ్యతిరేకత బలపడకముందే ప్రభుత్వం మేలుకోవాలి. తమది నిర్మాణాత్మక ప్రభుత్వమైతే రేవంత్‌రెడ్డిది కూల్చివేతల ప్రభుత్వమని బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ చేసిన విమర్శ ప్రజల్లోకి వ్యాపించక ముందే ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. కూల్చివేతలే ప్రభుత్వ అజెండా అయితే ప్రతిపక్షానికి బలమైన ఆయుధం ఇచ్చినట్టు అవుతుంది. తెలంగాణలో కూల్చివేతలు మాత్రమే జరుగుతున్నాయని ప్రజల్లో అభిప్రాయం ఏర్పడితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తలపెట్టిన మూసీ ప్రాజెక్టును తాత్కాలికంగా పక్కనపెట్టడం వాంఛనీయం. లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా ఏదీ ఉండకూడదు. ఆక్రమణలకు పాల్పడిన వారిని ముందుగా గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలి. ఆక్రమణలకు పాల్పడి ఇళ్లు నిర్మించి విక్రయించిన వారి నుంచి జరిమానా వసూలు చేసి బాధితులకు నష్టపరిహారం చెల్లించడం వంటి చర్యలపై దృష్టిపెట్టాలి. ఎవరో చేసిన నేరాలకు మరెవరినో శిక్షించడం సమంజసం, సమర్థనీయం కాదు కదా! ఆక్రమణ అయినా, మరేదైనా ప్రజలతో ముడిపడి ఉన్న సందర్భాలలో ప్రభుత్వం సంయమనంతో వ్యవహరించాలి. వ్యక్తులు వేరు–ప్రజా సమస్యలు వేరు. ఏళ్ల తరబడి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల ఆక్రమణ అనేది హక్కుగా ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడింది. ఏది ఏమైనా కూల్చివేతలపై ప్రజాభిప్రాయం ఎలా ఉందో తెలుసుకొనే ప్రయత్నం ఇప్పుడు జరగాలి. హైడ్రా చర్యలను తొలుత ఆక్షేపించని ప్రతిపక్షాలు ఇప్పుడు ఎందుకు స్వరం పెంచుతున్నాయో తెలుసుకొనే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేయాలి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అంటే కూల్చివేతల ప్రభుత్వం అనే పేరు తెచ్చుకోవద్దు. హెచ్చరికలతో కూడిన ఈ సూచనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టించుకుంటారో లేదో వేచి చూద్దాం!

> గత అనుభవాల నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం గుణపాఠం నేర్చుకున్నట్టుగా లేదు. చీటికి మాటికీ ముఖ్యమంత్రిని ఢిల్లీకి పిలిపించుకొని తమ చుట్టూ తిప్పుకొంటున్నారు. ఇందిరాగాంధీ హయాంలో పరిస్థితులు ఇలా ఉండేవి కావు. కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకొనే ముందు అధిష్ఠానం తరఫున దూతలు ఆయా రాష్ట్రాలకు వెళ్లి అభిప్రాయ సేకరణ జరిపేవారు. ముఖ్యమంత్రులను మార్చాలనుకున్నప్పుడు కూడా అధిష్ఠానం నుంచి దూతలు వచ్చే వారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం తరఫున దూతగా జీకే మూపనార్ వస్తున్నారంటే ముఖ్యమంత్రుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఇప్పుడు ఇందుకు విరుద్ధంగా పీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేయాలన్నా మంత్రివర్గ విస్తరణకు అనుమతులు కావాలన్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డిని ఢిల్లీకి పిలిపించుకొని రోజుల తరబడి కూర్చోబెట్టుకుంటున్నారు. దీంతో 1983కి ముందు పరిస్థితులు పునరావృతం అవుతున్నాయన్న భావన ప్రజల్లో ఏర్పడుతోంది.

యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

మహాత్ముడి 'వీలునామా'


గాంధీజీ పిలుపు మేరకు 'డు ఆర్ డై' నినాదంతో 1942 ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమం ఆరంభమైంది. గాంధీ కస్తూర్బాలను పూనాలోని ఆగాఖాన్ ప్యాలెస్‌లో బ్రిటిష్ ప్రభుత్వం నిర్బంధంలో ఉంచింది. గాంధీకి వరుసకు మనవరాలైన 14 ఏళ్ల మనుబెహన్ గాంధీని కూడా ఉద్యమంలో పాల్గొన్నందుకు నాగపూర్ జైల్లో బందీగా ఉంచారు. ఆ తర్వాత తొమ్మిది నెలలకు కస్తూర్బా అనారోగ్యం కారణంగా ఆమెకు సపర్యలు చేయడానికి ప్రభుత్వం మనుబెహన్‌ను కూడా ఆగాఖాన్ ప్యాలెస్‌కు తరలించింది. కస్తూర్బా మరణం తర్వాత, కొంతకాలం సేవాగ్రాంలో ఉన్న మనుబెహన్, ఆ తరువాత కొద్దికాలం చదువు నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్ళి తిరిగి గాంధీని చేరుకున్నది. అప్పుడు ఆయన బీహార్‌లోని నోవాఖలిలో మతకలహపు మారణహోమాన్ని ఆర్పివేసే కార్యక్రమంలో తలమునకలై ఉన్నారు. ఆయనకు నీడలా వెన్నంటి ఉండి సపర్యలు చేసింది మనుబెహన్. 1948లో గాంధీజీ హత్యచేయబడిన మరుసటిరోజు వరకు ప్రతిరోజూ ఆయన దినచర్యలను, వివిధ అంశాలపై గాంధీ ఆలోచనలను మనుబెహన్ అక్షరబద్ధం చేసింది. ఆ డైరీలు గాంధీజీ 'వీలునామా' వలె తనకు మార్గదర్శకంగా ఉన్నాయని 'బాపు మై మదర్' అనే తన పుస్తకంలో పేర్కొన్నది. అవి గాంధీజీ స్వభావం, కార్యక్రమాలను ప్రతిఫలిస్తాయని ముందుమాట రాసిన ప్రముఖ గాంధేయవాది కె.జి.మష్రువాలా అభిప్రాయపడ్డారు.

* * *

ప్రజల సంపదను ఒక వ్యక్తి స్వప్రయోజనాలకు వాడుకోవడం హింసాత్మకమైనదని బాపు అభిప్రాయం. 1947లో వైస్రాయిగా ఢిల్లీ వచ్చిన మౌంట్ బాటన్ గాంధీతో సమావేశానికై ఆహ్వానం పంపాడు. ఆ మేరకు, ప్రభుత్వాధికారులు గాంధీజీ ఢిల్లీ చేరుకోవడానికి విమానప్రయాణపు ఏర్పాట్లుచేశారు. కానీ గాంధీజీ దానిని తిరస్కరించి రైలు ప్రయాణానికి ఒప్పుకున్నారు. మూడవతరగతి ప్రయాణపు ఏర్పాట్లను ఆయన మనుబెహన్‌కు అప్పగించాడు. కానీ సౌకర్యం కోసం ఆమె రెండు పెట్టెలను ఎన్నుకొన్నది. దానికి మనుపై ఆగ్రహించిన బాపు ఒక పెట్టెను ఖాళీచేయించి వేలాడుతూ ప్రయాణంచేస్తున్న ఇతర ప్రయాణికుల కోసం వాడవలసిందని స్టేషన్ అధికారిని కోరారు. మొదట ఆ అధికారి ఒప్పుకోలేదు. 'మనకు అవసరం లేని దానిని వాడడం హింసాత్మకమైనది. తనకు లభించిన ఒక అదనపు హక్కును ఈ అమ్మాయి దుర్వినియోగం చేయడాన్ని సమర్థించి ఆమెను చెడగొడతారా?' అంటూ అతన్ని మందలించి, సరేననిపించారు గాంధీ.

నోవాఖలి యాత్రలో భాగంగా ఒకరోజు బయలుదేరవలసిన సమయానికి ఐదు నిమిషాలు ఆలస్యం చేసినందుకు మనుబెహన్‌ను గాంధీజీ చీవాట్లుపెట్టారు. 'నువ్వు 500 మందివి... ఐదు నిమిషాలు దొంగలించావు. దీనిని భరించలేను. నేను వెళుతున్నాను. నువ్వు నా వెనక వచ్చేయి. నేను బయలుదేరే సమయం 7 గంటలని ప్రజలకు చెప్పినప్పుడు, రెండు సెకండ్లు ఆలస్యమయినా అది నాకు బాధ కలిగిస్తుంది.'. నోవాఖలి పర్యటనలోనే మరొకరోజు ఒక ఊరు నుండి మరొక ఊరుకు వెళ్లే క్రమంలో గాంధీజీ స్నానం చేసేపుడు ఒళ్ళు రుద్దుకునేందుకు వాడే ఒక గరుకు రాయిని మనుబెహన్ మరచిపోయింది. అందుకు శిక్షగా ఆమెను ఒంటరిగా ఆ ఊరికి తిరిగివెళ్లి ఆ రాయిని తీసుకురావాలని ఆజ్ఞాపించారు. ఆ విషయాన్ని వివరిస్తూ ఆమె రాసిన కథనం ఆసక్తికరంగా ఉంటుంది: 'అవసరమైన ప్రతిదాని పట్ల ఎంత శ్రద్ధగా ఉండాలనే పాఠం ఇవాళ నువ్వు నేర్చుకున్నావు. ఇలాంటి రాళ్లు ఎన్ని కావాలనుకున్నా దొరుకుతాయి కదా అని అశ్రద్ధ కూడదు' అంటూ గాంధీజీ తనను మెచ్చుకున్నట్లు ఆమె రాసింది. 'బాపూ, ఇంత పిసినారిగా ఎందుకు ఉండాలి?' అని హాస్యంగా ఒకసారి మనుబెహన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఓ చిన్న గుడ్డ ముక్కను లేదా కొన్ని చుక్కల కిరసనాయిల్‌ను కూడా ఎలా పొదుపు చేయాలో, ఆ పొదుపు మనకు ఎలా లాభిస్తుందో అనే విషయాన్ని ఆయన వివరించిన తీరును ఉటంకిస్తూ బాపు ఒక గొప్ప బోధకుడు అని ఆమె వ్యాఖ్యానించింది. మరొకరోజు మల మూత్రాదులు ఉన్న దారిని శుభ్రం చేసి, గాంధీజీ తన సిద్ధాంతాల పట్ల ఎంత ఆచరణాత్మకంగా ఉండేవారో మను మనకు తెలియజేస్తుంది. 'ఆకలి అయినప్పుడు అన్నం తింటే ఎలా తృప్తిగా ఉంటుందో, అలాగే ఈ పారిశుద్ధ్యపు పని నాకు అంతు లేని సంతోషాన్ని ఇస్తుంది' అని ఆ సందర్భంగా గాంధీ అన్నారు.

> మనుబెహన్ తన 'బాపు మై మదర్'లో 14 అంశాలుగా రాసిన వ్యాసాలు 'భావ్ నగర్ సమాచార్' అనే గుజరాతీ వారపత్రికలో ధారావాహికగా వెలువడ్డాయి. ఆమె జీవించి ఉన్న రోజుల్లోనే అవి పుస్తక రూపంలో ప్రచురితమైనాయి. గుజరాతీలో రాసిన ఆ పుస్తకాన్ని ఆమె మిత్రురాలు చిత్రాదేశాయ్ ఇంగ్లిష్‌లోకి అనువదించింది. డైరీలు మాత్రం ఆమె మరణం (1969) తర్వాత చాలాకాలానికి లభించడంచేత 2019లో ముద్రితమైనాయి.



నోవాఖలి యాత్రలో బాపు క్యాంపు నిర్వహణ చూసుకునే సతీష్ బాబు తయారుచేసిన 'టెంట్‌ను రాజభవనం లాగ ఉందని, అందువల్ల దానిని తాను వాడనని, మరో లాగా వాడుకోమని ఓ ఊరిలో వదలి వేశాడు గాంధీ. అదే సందర్భంలో తాను చెప్పులు వాడకూడదని నిర్ణయం తీసుకున్నారు. 'గుళ్ళు, మసీదులు, చర్చిలు లాంటి పవిత్ర స్థలాలకు వెళ్ళినప్పుడు మనం చెప్పులు బయటే వదిలి లోనికి వెళ్తాం. నేను దరిద్ర నారాయణుని దర్శనానికి వెళుతున్నాను. నేను కలుసుకోబోతున్నవారి కుటుంబ సభ్యులు లూటీ చేయబడ్డారు. అమాయక స్త్రీలు, పిల్లలు ఊచకోతకు గురయ్యారు. వాళ్ళ నగ్న శరీరాలపైన కప్పుకోవడానికి సరైన గుడ్డలు లేవు. అలాంటి నేలపైన వాళ్లను కలవడం నా మటుకు నాకు ఓ పవిత్ర యాత్ర కాబట్టి చెప్పులు వేసుకోవడం ఎలా వీలవుతుంది?'

మరొక సంఘటనలో, తనకు స్వాగతం చెప్పడానికి ఊరంతటిని పూలతో అలంకరించిన ఆ గ్రామస్థుడైన కాంగ్రెస్ కార్యకర్తపై ఆయన కోపం చేశాడు: 'ఈ ఊళ్ళో డబ్బు ఎక్కువైనట్లుంది. లేకపోతే ఇంత కష్టసమయంలో ఈ అలంకరణ గురించి మీరు ఆలోచించేవారు కాదు. అంతేగాక నువ్వు ఒక కాంగ్రెస్ కార్యకర్తవు. జైలుకు వెళ్లావు, ఈ చిన్న ఖద్దరు ధోతీ ధరిస్తావు. అయినా కూడా ఈ విదేశీ దారాలు, రిబ్బన్లు వాడావు. ఇవాళ ప్రజాసేవకులుగా గుర్తింపబడినవారు ఒకవేళ రేపు గౌరవప్రదమైన స్థానాలు అలంకరిస్తే, ఇలాగే ఖరీదైన పూలమాలలు ఇవ్వడం, తీసుకోవడం చేస్తారా?' వెంటనే గ్రామస్తులు ఆ అలంకరణలను తొలగించి, ఆ తర్వాత వాటిలోని దారాలను బట్టను నేసేందుకు వినియోగించారు.

14 ఆగస్టు 1947 అర్ధరాత్రి దేశమంతా స్వాతంత్ర్య సంబరాలు జరుపుకుంటున్న సమయంలో, కలకత్తాలో బస చేసి ఉన్న గాంధీజీ వద్దకు వచ్చిన కొందరు నాయకులను ఉద్దేశించి ఆయన కొన్ని విషయాలు చెప్పారు. 'చూడండి! ఈ రోజు నుండి మీరంతా ముళ్ళ కిరీటాలు ధరించవలసి ఉంటుంది. ఇవాళ ఎంత నిరాడంబరంగా ఉన్నారో, రేపు అధికారం వచ్చిన తర్వాత కూడా అలాగే ఉండాలి. విలాసాలకు, ఆడంబరాలకు లోనుకాకండి. నిరాడంబరత, అణకువ, అహింస, సహనంతో ప్రజలకు మార్గదర్శకులుగా నిలవండి. పల్లెటూర్లను బాగు చేయండి. మీకు అసలైన పరీక్ష ఇప్పుడు మొదలవుతోంది. ఇన్నాళ్ల బ్రిటిష్ పాలనలో మీకు పరీక్ష లేదు, కానీ ఈ రోజు నుండి వరుస పరీక్షలు మొదలవుతాయి'.

అలాగే, 'ఎవరైనా మనకు స్వపరిపాలన, మంచి పరిపాలన మనదేశానికి తేగలరు అంటే... అది కేవలం మన స్త్రీలే అని నేను ఘంటాపథంగా చెప్తున్నాను' అని ఒక సందర్భంలో స్త్రీల గురించి బాపూజీ ఎంతో విలువైన వ్యాఖ్య చేశారట. మనుబెహన్ తన 'బాపు మై మదర్'లో 14 అంశాలుగా ప్రచురించబడిన వ్యాసాలు 'భావ్‌నగర్ సమాచార్' అనే గుజరాతి వారపత్రికలో ధారావాహికగా వెలువడ్డాయి. ఆమె జీవించి ఉన్న రోజుల్లోనే అవి పుస్తక రూపంలో ప్రచురితమైనాయి. గుజరాతీలో రాసిన ఆ పుస్తకాన్ని ఆమె మిత్రురాలు చిత్రాదేశాయ్ ఇంగ్లిష్‌లోకి అనువదించింది. ఆమె రాసిన డైరీలు మాత్రం ఆమె మరణం (1969) తర్వాత చాలాకాలానికి లభించడంచేత 2019లో ముద్రించబడ్డాయి. అక్టోబర్ 2 గాంధీజీ జన్మదినం. అయితే, పంచాంగం ప్రకారం భాద్రపద మాసం శుక్లపక్షం ద్వాదశి రోజున కూడా ఆయన జన్మదినాన్ని జరుపుకునేవారట.

■ చింతకుంట్ల సంపత్‌రెడ్డి

(అక్టోబర్ 2: గాంధీ జయంతి)

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి




వివరాలు : 8లో..

రచ్చబండ ఏడబాయె..

ఊరు ముచ్చట్లకు వేదికగా రచ్చబండలు, సావటి గద్దెలు

సెల్ లేకుంటే జీవితమే లేదనే రోజులు నేటివి.. ఖాళీగా ఉంటే సెల్‌ఫోన్ కాలక్షేపం.. పక్కవారి యోగక్షేమాలు పట్టని కాలం. పల్లె నుంచే ప్రపంచాన్ని చుట్టేసే టెక్నాలజీతో ఎదుటి వ్యక్తితో కన్నా.. సోషల్ మీడియాతోనే ఎక్కువ బంధాలను పెంచుకుంటున్న ఈ సమాజంలో ఇప్పటివరకు రచ్చబండలే పల్లె జనం మధ్య అనుబంధాలకు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. నిద్ర లేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు పల్లెల్లోని సావటి గద్దె వద్ద జరిగే చర్చలెన్నో. ఊరి పంచాయతీలు, సాధక బాధలు, గ్రామంలోని సమస్యలు, భార్యాభర్తల పంచాయితీలు, పోరగాళ్ల అల్లర్లు గల్లీ నుంచి ఢిల్లీ రాజకీయాల వరకు చర్చలకు ఈ సావటి గద్దెలు వేదికగా నిలుస్తున్నాయి. పల్లె పాలిట్రిక్స్ నుంచి అమెరికా అధ్యక్ష ఎన్నికల వరకు కూడా చర్చించేందుకు రచ్చబండలే అడ్డాలు. ప్రస్తుతం అనేక గ్రామాల్లో రచ్చబండలు, సావటి గద్దెలు కనుమరుగై పోగా.. ఇంకా అక్కడక్కడా రచ్చబండల వద్ద సందడిగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రచ్చబండ ముచ్చట్లపై ఈ ఆదివారం ప్రత్యేక కథనం..

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



- గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని రకాల చర్చలకు కేంద్రాలు
- పంచాయితీలకు, చర్చలకు, తీర్మానాలకు స్థానాలు
- మంచి, చెడు పంచుకునేందుకు పల్లె జనానికి ధర్మశాలలు
- అభివృద్ధి, అవినీతి, సమకాలీన రాజకీయాలపై అవగాహన
- పల్లె జనం ఐక్యతకు సజీవ సాక్ష్యంగా ఊరు సావటి గద్దెలు
- టెక్నాలజీ యుగంలో పలు ప్రాంతాల్లో కనుమరుగు



శాయంపేట మండలం కొప్పులలో రచ్చబండ వేదిక



7



మేడారం అడవుల్లో నేలకూలిన చెట్లు (ఫైల్)

ప్రకృతి ప్రకోపం ఛేదించేనా?

- క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జల ప్రళయాలు
- అడవిలో వాయుగుండాలతో పెను విధ్వంసం
- 50వేలకు పైగా చెట్లు నేలకూలినా చిన్న ప్రాణికి కూడా హాని జరగని వైనం
- వైపరిత్యాన్ని ముందే పసిగట్టిన మూగజీవాలు
- మోరంచ, కొండాయిల్లో వరదను అంచనా వేయలేకపోయిన జనం
- ఉమ్మడి జిల్లాలో ఈ వైపరిత్యాలకు కారణాలపై మొదలవుతున్న పరిశోధనలు

7

క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జలప్రళయాలు.. ఎక్కడో నడి సముద్రంలో అలజడితో ఇక్కడి అడవుల్లో పెనుగాలుల విధ్వంసం... అసలు ఈ ప్రకృతి ప్రకోపానికి కారణాలు ఏంటి? ఓరుగల్లు పరిసర ప్రాంతాల్లోనే ఎందుకు ఈ విధ్వంసం జరుగుతోంది? ఇవే ఇప్పుడు పరిశోధకులను.. ప్రకృతి ప్రేమికుల మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలు. ప్రకృతి వైపరీత్యాలను జంతువులు, పక్షులు ముందే పసిగడుతున్నా యా? ఆ శక్తిలేకనే జల ప్రళయాలకు మానవులు జలసమాధి అవుతున్నారా? అనే చర్చ కూడా విస్తృతంగా జరుగుతోంది. రెండుమూడేళ్లుగా వరుసగా తలెత్తుతున్న ప్రకృతి వైపరీత్యాలు ఓరుగల్లువాసులను టెన్షన్ పెడుతున్నాయి. వీటిని ఛేదించే పనిలో శాస్త్రవేత్తలు పడ్డారు. ఈ మేరకు పరిశోధనలు ప్రారంభించారు.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాజకీయ అజ్ఞానంతోనే కేటీఆర్ వ్యాఖ్యలు

- దమ్ముంటే నయీంనగర్ బ్రిడ్జి వద్దకు చర్చకు రావాలి..
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 28: సీఎం రేవంత్‌రెడ్డి కేటాయిస్తున్న నిధులతో పశ్చిమ నియోజవర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక రాజకీయ అజ్ఞానిలాగా కేటీఆర్ మాట్లాడుతున్నాడని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం హనుమకొండ 10వ డివిజన్‌లో రామకృష్ణకాలనీ, వడ్డెరకాలనీలో సుమారు రూ.35లక్షల నిధులతో సీసీరోడ్లు, సైడ్‌డ్రైనేజీల నిర్మాణ పనులకు స్థానిక డివిజన్ కార్పొరేటర్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్‌లీడర్ తోట వెంకటేశ్వర్లులతో కలిసి ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమకొండ నయీంనగర్ బ్రిడ్జి నాలాను యుద్ధప్రాతిపదికన 4నెలల వ్యవధిలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తే.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే బ్రిడ్జిని అభివృద్ధి చేశామని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పుకోవడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శమన్నారు. కేటీఆర్‌కు దమ్ము, ధైర్యం ఉంటే ఈనెల 29న నయీంనగర్ బ్రిడ్జి వద్దకు రావాలని సవాల్ విసిరారు. నాలా నిర్మాణం మీరే చేస్తే ప్రజలు పూల వర్షంతో స్వాగతం పలుకుతారని, లేదంటే రాళ్లతో సమాధానం చెబుతారని అన్నారు. కబ్జా చేసి హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కట్టిన మీకు.. కబ్జాల గురించి మాట్లాడే నైతిక హక్కు ఉందా అని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్ దిగజారుడు రాజకీయాలు చేస్తూ అహంకార మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. అనంతరం 9వ డివిజన్ కాకతీయకాలనీ లోని కల్గీధర్ గురుద్వార సాహెబ్ ఆలయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించి గురుద్వార మత పెద్దలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుద్వార ఆలయా అభివృద్ధి, కమ్యూనిటీహాల్ నిర్మాణ పనుల గురించి మతపెద్దలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ మాజీ సభ్యుడు దర్శన్‌సింగ్, గురుద్వార మత పెద్దలు హరిసింగ్, దీప్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు శోభన బోయిన కుమార్‌యాదవ్, చీకటి ఆనంద్, బొంత రామకృష్ణ, పెరికారి శ్యాంసుందర్, శివ, జాఫర్, రాకేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



10వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

ఆరోగ్య నియమాలు పాటించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 28: ఆరోగ్య సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజల్లో రక్తపోటు, డయాబెటిస్, సీపీఆర్, ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయమాలపై అవగాహన కల్పించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి సూచించారు. ఈ నెల 29న హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందికి రక్తపోటు, డయాబెటిస్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఇప్పటికే మందులు వాడుతున్న వారు క్రమం తప్పకుండా వాడాలని, వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు. జిల్లాలో 94,244 రక్తపోటుతో, 45,942 మంది డయాబెటిస్‌తో, 509 మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇఫ్తికర్ అహ్మద్, డాక్టర్ నాగరాజు, డెమో వి.అశోక్‌రెడ్డి, డాక్టర్ రోహిత్, టి.సదానందం, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి



అర్‌ఐలతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

రెవెన్యూ ఆదాయం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- భువన్ యాప్‌పై ఆర్‌ఐలకు అవగాహన కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 28: బల్దియా పరిధిలో పని చేస్తున్న రెవెన్యూ అధికారులు ఆదాయ పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో భువన్ యాప్‌లో సర్వే, డాటా నమోదు తదితర అంశాలపై ఆర్‌ఐలక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది సమర్థవంతంగా పని చేయుటకు తగు సూచనలు చేశారు. ఆర్‌ఐలతో భవన్ యాప్‌పై కమిషనర్ విడివిడిగా మాట్లాడారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) బల్దియా పరిధిలో ఉన్న 66 డివిజన్‌ల పూర్తి సమాచారం నమోదు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా భువన్ యాప్ అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఆర్‌ఐలు ఏదైనా సమాచారాన్ని నవీకరించే క్రమంలో పూర్తి కాలన్ని అవగాహన చేసుకోవాలన్నారు. 2007 గెజిట్ ఉత్తర్వుల ప్రకారం నిబద్ధతతో అసెస్మెంట్స్ పూర్తిచేయాలన్నారు. ఆర్‌ఐలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పీటీఎం నెంబర్ ద్వారా ధృవీకరణ జరిపి సంబంధిత డిప్యూటీ కమిషన్‌ల ద్వారా ఎడిట్ జరిగేలా చూడాలన్నారు. అనంతరం సమాచార నమోదు తీరును అర్‌ఐలకు దృశ్యమాలిక ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చింతకుట్ల రాజేందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్‌లు నిమ్మ కృష్ణారెడ్డి, రవీందర్, టాక్సెస్ అధికారి బిరు శ్రీనివాస్, ఆర్‌వోలు యూసుఫోద్దీన్, శ్రీనివాస్, షహజాది బేగంలతో పాటు అర్‌ఐలు పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా ఎగరాల్సింది కాంగ్రెస్ జెండానే..

- గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలి
- పరకాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



పరకాల, సెప్టెంబరు 28: రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా.. ఎగరాల్సింది కాంగ్రెస్ జెండాయేనని వరంగల్ ఎంపీ కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం పరకాల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో తనను ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు జరిగినవి సెమీ ఫైనల్స్ మాత్రమేనని, ఇప్పుడు జరగబోయే ఎన్నికలే ఫైనల్స్ అని అన్నారు. ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. త్వరలోనే కుల గణన జరగనుందని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు జరుగుతుందని వెల్లడించారు. పరకాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి..

రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో ఉన్న ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సమష్టి కృషితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టుసాధించేందుకు కార్యాచరణ ఉండాలన్నారు. ఆ దిశగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రజావ్యతిరేక విధానాలను

మిగతా 8వ పేజీలో..

ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి..

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.ప్రావీణ్య



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 28: ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. ఎల్కతుర్తి జంక్షన్ నిర్మాణంతోపాటు వివిధ అభివృద్ధి పనులపై కుడా, రెవెన్యూ, మునిసిపల్, ఆర్టీసీ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ ప్రావీణ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వరంగల్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలకు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిలో ఉన్న ఎల్కతుర్తి మండల కేంద్రంలో జంక్షన్ నిర్మాణం, సుందరీకరణ, అభివృద్ధి పనులకు సంబంధించి ఎక్కడ కూడా ఇబ్బందులు కలగకుండా ప్లాన్‌ను అధికారులు సమన్వయంతో రూపొందించాలన్నారు. కుడా, మునిసిపల్, కార్పొరేషన్, జిల్లా పరిధిలోని నాలాలు, చెరువులు, ప్రభుత్వ భూములను సర్వే చేసి నివేదికను త్వరగా సమర్పించాలన్నారు. నాలాల ఆక్రమణల తొలగింపు విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలన్నారు. నగరంలో 70కిపైగా ఉన్న చెరువులకు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. జిల్లా పరిధిలో ప్రభుత్వ భూముల సర్వే కొనసాగుతోందని, వాటికి సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను సమర్పించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఆర్టీసీ, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలల తుదిదశ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి డీఈవో వాసంతి, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్‌డీవో నాగపద్మజ, ఎంపీడీవోలు, ఎంఈవో, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో పాటు నిర్మాణ దశలో ఉన్న వివిధ పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరిచేందుకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరగా వాటిని త్వరగా పూర్తిచేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో చేపట్టిన పనులలో ఎక్కడైనా చిన్న చిన్న పనులు ఉన్నట్లయితే వాటి పనులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో సత్యనారాయణ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్ బాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు
- లోక్ అదాలత్‌లో 11,618 కేసుల పరిష్కారం

6



లోక్ అదాలత్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ

విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండాలి

▸▸ షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్


మాట్లాడుతున్న మూగల కుమార్ యాదవ్

నయీంనగర్, సెప్టెంబరు 28: విద్యార్థులు మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ అన్నారు. షైన్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్ రోడ్‌లోని డీకన్వెన్షన్ హాల్‌లో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డాన్స్‌లు చేస్తూ, పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం చైర్మన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కష్టపడి చదివిన విద్యార్థులే భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో ఉంటారన్నారు. వేడుకలలోషైన్ విద్యాసంస్థల డైరెకర్లు పి.రాజేంద్ర కుమార్, జక్కుల శ్రీనివాస్, మూగల రమ, మూగల రమేష్ యాదవ్, ప్రిన్సిపల్స్ మారబోయిన రాజుగౌడ్, కె.శ్రీనివాసన్, ప్రశాంత్, సంధ్య, అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

▸▸ హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు

▸▸ లోక్ అదాలత్‌లో 11,618 కేసుల పరిష్కారం

వరంగల్ లీగల్, సెప్టెంబరు 28: రాజీ మార్గం ద్వారా కక్షిదారులు కేసులు పరిష్కరించుకోవాలని, తద్వారా వివాదాలకు స్వస్తి పలకాలని వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు బీవీ నిర్మల గీతాంబ, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి జడ్జి అపర్ణాదేవి సూచించారు. శనివారం జాతీయ లోక్ అదాలత్‌లో వారు పాల్గొని స్నేహపూర్తిత వాతావరణంలో ఇరు పక్షాలకు ఆమోద యోగ్యమైన తీర్పు ద్వారా పరిష్కారం పొందాలని వారు సూచించారు. పలు మార్లు కోర్టుల చుట్టూ తిరుగుతూ వ్యయ ప్రయాసాలకు పాల్పడకుండా జాతీయ లోక్ అదాలత్ సహకరిస్తుందని వారు పేర్కొన్నారు. కక్షిదారుల కేసుల పరిష్కారంలో న్యాయవాదులు, పోలీసులు సహకరించాలని న్యాయమూర్తులు సూచించారు.

కాగా, జాతీయ లోక్ అదాలత్ ఆదేశానుసారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాల జాతీయ లోక్ అదాలత్‌లో 11,618 కేసులు పరిష్కరించారు. వరంగల్ జిల్లాలో 9 బెంచిలను ఏర్పాటు చేసి 106 సివిల్ కేసులు, 66 రోడ్డుప్రమాద బీమా కేసులు, 3,771 క్రిమినల్ కేసులు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 40 పరిష్కరించారు. అదే విధంగా 2,311 విద్యుత్ శక్తి పీఎల్‌సీ కేసులు కూడా పరిష్కరించారు. హనుమకొండ జిల్లాలో 8 బెంచిలు ఏర్పాటు చేసి సివిల్ కేసులు ఏడు, ఎంబీవోపీ కేసులు 67, 7625 క్రిమినల్ కేసులు, బ్యాంకు పీఎల్‌సీ కేసులు 42 పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కక్షిదారులకు పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు తమతమ బెంచిల ద్వారా కేసులు పరిష్కరించి సహకరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో బాలుడి కిడ్నాప్

▸▸ దర్యాప్తు చేస్తున్న పోలీసులు


వివరాలు తెలుపుతున్న బాధితులు

కాజీపేట, సెప్టెంబరు 28 : భార్యభర్తల గొడవ పడుతుండగా.. ఇదే అదునుగా భావించిన ఓ జంట.. బాలుడిని తీసుకుని ఉడాయించారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ కుమారుడిని ఎవరో ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఎస్‌కే మసూద్, కౌసర్ దంపతులకు అయాన్, ఇఫ్రార్ ఇద్దరు కుమారులు. కుమారులను తీసుకుని శుక్రవారం జనగామకు వెళ్లేందుకు కాజీపేట రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అప్పటికే రైళ్లు వెళ్లిపోవడంతో బస్సులో వెళ్లేందుకు కాజీపేట చౌరస్తా సమీపంలోకి వచ్చారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. భార్య కౌసర్ తన చిన్నకుమారుడు ఇఫ్రార్‌ను తీసుకుని కాస్త ముందుకు వెళ్లింది. మసూద్ తమ ఐదేళ్ల పెద్ద కుమారుడు అయాన్‌ను అక్కడే ఉన్న ఓ జంటకు అప్పగించి భార్యను వెనక్కి తీసుకురావడానికి వెళ్లాడు. అతడు భార్యను తీసుకువచ్చేలోపు పెద్దకుమారుడిని అప్పగించిన దంపతులు బాబును తీసుకుని ఉడాయించారు. బాధితులు కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబరు 2న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ చెస్‌సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 2న హనుమకొండ కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీలోని తుషార హైస్కూల్‌లో జిల్లాస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ స్థాయి అండర్-15 బాల బాలికల విభాగంలో నిర్వహించనున్న రెండోర్యాంకింగ్ చెస్ టోర్నీలో 1జనవరి 2009 సంవత్సరం, ఆ తరువాత జన్మించి వారు అర్హులని తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లను ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకై 9059522986 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రచ్చబండ ఏడబాయె..

- ఊరు ముచ్చట్లకు వేదికగా రచ్చబండలు, సావటి గద్దెలు
- గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని రకాల చర్చలకు కేంద్రాలు
- టెక్నాలజీ యుగంలో పలు ప్రాంతాల్లో కనుమరుగు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

పల్లె అంటేనే ఐక్యతకు మారు పేరు. నక్సలిజం, కమ్యూనిజం, కాషాయిజం అన్ని ఇజాలు కలిసిన ప్రజలు సహజీవనం చేసే ఓరుగల్లులో ప్రతీ గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. ఒకప్పుడు ఊరూరా రచ్చబండలు, సావటి గద్దెలు, ధర్మశాలలు ఉండేవి. నక్సలైట్ల ప్రాబల్యం ఉన్న గ్రామాలతో పాటు మైదాన ప్రాంతాల పల్లెలోనే ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజలకు కాలక్షేపంగా కూడా రచ్చబండలు పనిచేసేవి. ఎప్పుడూ ఓ పదిమంది సావటి గద్దె, రచ్చబండలపై కూర్చుని ఊరుముచ్చట్లతో పాటు రైతు సమస్యలు, రాజకీయాల గురించి మాట్లాడుకోవటం ప్రతీ ఊళ్లో కనిపించే దృశ్యాలే. పండుగలొచ్చినా.. పబ్బులొచ్చినా.. గ్రామంలో ఏ సంఘటన జరిగినా సమాచారం మొత్తం ఈ రచ్చబండలకు చేరేది. ఊళ్లో ఏ గల్లీలో చిన్న గొడవలైనా, భార్యాభర్తల పంచాయితీ అయినా సరే.. సావటిల్లో చర్చనీయాంశంగా మారేది. ఇప్పుడే సాంకేతికత బాగాపెరిగిపోడటంతో యువతతోపాటు నడివయస్సు వారు కూడా సెల్‌ఫోన్‌లకు అతుక్కుపోతున్నారు. పక్కోడి కష్టం కంటే సెల్‌లో సోల్లుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అయినప్పటికీ అక్కడక్కడా అనేక గ్రామాల్లో ఇంకా ఈ రచ్చబండ సంస్కృతి దర్శనిమిస్తుండగా, మరికొన్ని చోట్ల సావటిలు వెలవెల పోతున్నాయి.


శాయంపేట మండలం హుస్సేన్‌పల్లిలో రచ్చబండ వేదిక

రచ్చబండలపై సమయం తెలిసేది కాదు..

కసిరెడ్డి రఘోత్తంరెడ్డి, నవాబుపేట

గ్రామాల్లో పాత రోజులే బాగుండేవి. మా గ్రామంలో అప్పటి సర్పంచ్ కాల్వ లక్ష్మారెడ్డి ఇంటి వద్ద రచ్చబండ ఉండేది. అక్కడ కూర్చుంటే సమయం తెలిసేది కాదు. కథలు, నాటికలు, గ్రామ సమస్యలు, తగాదాల పరిష్కారాలతో సమయం తెలిసేది కాదు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం రచ్చబండ కాడ కూర్చొని ఒకరి ఇబ్బందులు, సమస్యలు మరొకరితో చెప్పుకునే వాళ్లం. ఉమ్మడి కుటుంబాలు ఉండటంతో అందరూ కలిసి ముచ్చట్లు చెప్పుకునేటోళ్లం. ఇప్పుడు స్వార్థాలు పెరిగాయి. కాలక్షేపానికి నలుగురితో కలిసి ముచ్చటించే సమయం దొరకడంలేదు. అలాంటి ప్రత్యేక స్థలాలు లేవు.



- చిట్యాల

చెట్టు కిందే అన్ని సమస్యలకు పరిష్కారం

రచ్చబండ అంటే సామాన్యంగా భారీ చెట్ల కింద ఏర్పాటు చేసే పంచాయితీ కేంద్రం గ్రామస్థులు కలుసుకునే ప్రదేశంగా, వారి సమస్యలను చర్చించే వేదికగా, పంచాయతీ కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశంగా ఇవి ఉపయోగపడేది. చాలా గ్రామాల్లో రచ్చబండలు ఉండేవి. అక్కడ వెలువడే తీర్పును ప్రజలు పరమావధిగా భావించేవారు. విడాకులు, వరకట్నం, భూపంచాయతీలు, ప్రేమ వివాహాలు, గట్ల పంచాయతీ ఇలా రోజు ఊరిలో జరిగే ఏదో వివాదాన్ని అక్కడ పరిష్కరించేవారు. ఇరు వర్గాలకు రాజీ కుదిర్చేవారు.

- వెంకటాపూర్(రామప్ప)

గ్రామాభివృద్ధి చర్చలకు వేదికలుగా ఉండేవి

కత్తాల రాంచందర్‌రావు, ధర్మరావుపేట



నా చిన్ననాటి హయాంలో గ్రామాలు, తండాల్లో పెద్దపెద్ద వృక్షాల కింద చావడిలు, రచ్చబండలు ఉండేవి. నాడు గ్రామపెద్దలు, వృద్ధులు రచ్చబండల వద్ద కాలక్షేపంతో పాటు ఊరు బాగోగుల కోసం ఉదయం, సాయంత్రం వేళ్లలో ఒక్కచోట పోగై చర్చించుకునేవారం. రాజకీయాలపై చర్చలు జరిగేవి. ఒకొక్కరి బాగోగులు, యోగక్షేమాలు సైతం చర్చించుకునేవాళ్లం. దీంతో గ్రామస్తుల మధ్య ఐక్యత, ఆపాయ్యత పెరిగేది. నేడు ఉరుకుల పరుగుల జీవితంతో పాటు, ఆదునిక సాంకేతికత పెరగడంతో టీవీలు, సెల్‌పోన్ల వినియోగం పెరగడంతో ఎవరి ఇంట్లో వారే ఉంటున్నారు. అదేవిదంగా గ్రామాల నుంచి ఉపాధి కోసం పట్నాలవైపు వెళ్తుండటంతో రచ్చబండలు, గ్రామాల్లోని ప్రధాన కూడల్లోని చావడీలు కనుమరుగయ్యాయి.

- ఖానాపురం

ఆనాటి ముచ్చట్లు ఏమాయే..

వెలవెలబోతున్న రచ్చబండ వేదికలు

గ్రామీణ ప్రాంతాల్లో రచ్చబండ ముచ్చట్లు కాలక్రమేణా మాయమై పోతున్నాయి. గ్రామంలో ఏ నలుగురు కలిసినా సహజంగా మర్రి, వేప, రాల చెట్ల కింద రచ్చబండపై కూర్చుని, ముచ్చట్లు పెట్టుకుంటూ కాలక్షేపం చేసేవారు. ఊరు సంగతులు.. వ్యవసాయం ఎట్లా ఉంది.. పిల్లగాండ్లు ఏడ సదువుతున్నారు.. ఏం చేస్తున్నారు.. గ్రామంలో సమస్యలు.. నాయకుల పనితీరు.. గ్రామం నుంచి జాతీయస్థాయి వరకు రాజకీయపార్టీల అనుకూల, వ్యతిరేక విషయాలు ఇలా అనేక విషయాలను చర్చించుకునేవారు. ఇవే కాకుండా కుటుంబ, గ్రామ, భూమి, తదితర తగాదాలను సైతం రచ్చబండల ద్వారా పరిష్కరించుకున్న సందర్భాలు అనేకం. ఇలాంటి నేపథ్యమున్న రచ్చబండలు క్రమేణా గ్రామస్తుల ముచ్చట్లకు దూరమయ్యాయి. సాంకేతిక పెరగడంతో పిల్లల నుంచి మొదలు వృద్ధుల వరకు స్మార్ట్ ఫోన్, టీవీ, కంప్యూటర్లకు అలవాటు పడిపోయారు. ఒకరితో మరొకరు సమయం గడపడమే మర్చిపోతున్నారు.

మాట్లాడుకుంటూ రేడియోలో వార్తలు వినేవాళ్లం

బయ్య సాంబయ్య, కొప్పుల



గ్రామస్తులంతా రచ్చబండపై కూర్చుని అన్ని విషయాలు మాట్లాడుకుంటూ.. రేడియోలో వార్తలు విని, ఆ వార్తలపై చర్చించుకునేవాళ్లం. కానీ నేడు రచ్చబండ వద్దకు రావడానికి కూడా ఎవరికీ సమయం లేకుండా పోయింది. భవిష్యత్తు తరాలకు రచ్చబండ అనే పదమే తెలియని పరిస్థితి నెలకొంది.

ఆ రోజులే బాగుండేవి..

భూతాల వీరయ్య, హుస్సేన్‌పల్లి



గ్రామంలోని విషయాలన్నీ రచ్చబండపై కూర్చుని ఒకే కుటుంబంలాగా రాత్రి పొద్దుపోయేవరకు మాట్లాడుకునే వాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఆరోజులే బాగుండేవి. నేడు కనీస పలకరింపులే కరువయ్యాయి.

- శాయంపేట

పండుగ రోజుల్లో రైల్వే ప్రయాణికులకు కొత్త కష్టాలు

- కాజీపేటలో ఇంటర్‌లాక్ పనులు
- 47 పండుగ స్పెషల్ రైళ్లు రద్దు
- అక్టోబరు 2 నుంచి తిరుపతికి స్పెషల్ రైలు


కాజీపేట రైల్వే స్టేషన్‌లో రద్దీ

కాజీపేట, సెప్టెంబరు 28: దసరా, దీపావళి పండుగ రోజులు వస్తున్నాయి. అక్టోబరు 2నుంచి విద్యా సంస్థలకు సెలవులు మెదలుకానున్నాయి. సొంతూళ్లకు వెళ్లే రైల్వే ప్రయాణికులకు ఈసారి కొత్త కష్టాలు వచ్చి పడ్డాయి. హసన్‌పర్తి-వరంగల్, హసన్‌పర్తి-కాజీపేట మీదుగా బైపాస్ రైల్వే లైన్ల నిర్మాణంతో ఈ రూట్లలో పండుగకు ప్రకటించిన 47 ప్రత్యేక రైళ్లను రద్దు చేశారు. దీంతో గూడ్స్ రైళ్లను రీ షెడ్యూల్ చేసి మరీ ప్రత్యేకంగా పండుగ రైళ్లను అతి కష్టం మీద కొన్ని రైళ్లను నడపడానికి ప్రణాళికలు చేస్తున్నారు. 38 రైళ్లను దారి మళ్లించి నడుపుతున్నారు. అసలే ప్రత్యేక రైళ్లు సరిపోని తరుణంలో 47 పండుగ స్పెషల్ రైళ్లు రద్దు కావడంతో సొంత ఊళ్లకు వెళ్లే ప్రయాణికులకు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు..

దసరాకు కాజీపేట మీదుగా తిరుపతికి ప్రత్యేక రైళ్లు

అక్టోబరు 2 నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ మీదుగా 28 సర్వీస్‌లను నడిపించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. (07041) సికింద్రాబాద్ - తిరుపతి మధ్య నడిచే ఈ స్పెషల్ రెళ్లు అక్టోబరు 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30, నవంబరు 1, 6, 8, 13, 15 వ తేదీల్లో నడవనుంది, ఈ రైలు సికింద్రాబాద్‌లో సాయంత్రం 5.50 నిమిషాలకు బయలుదేరి కాజీపేట జంక్షన్‌కు సాయంత్రం 7.52కు చేరకుంటుంది. (07042) తిరుపతి - సికింద్రాబాద్ స్పెషల్ రైలు అక్టోబరు 3, 5, 10, 12, 17, 19, 24, 28, 31, నవంబరు 2, 7, 9, 14, 16, తేదీల్లో నడవనుంది. ఈ రైలు నిర్ణయించిన తేదీల్లో తిరుపతిలో ఉదయం 9.40 నిమిషాలు బయలుదేరి మరునాడు ఉదయం 5.23కు కాజీపేటకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లకు అప్ అండ్ డౌన్ రూట్లలో కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

ప్రతీ సోమవారం గచ్చిబౌలికి ప్రత్యేక బస్సు

బాలసముద్రం, సెప్టెంబరు 28: వరంగల్, హనుమకొండ నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు గచ్చిబౌలి ప్రాంతానికి ప్రయాణిస్తుంటారని, వారికి సౌకర్యంగా ప్రతీ సోమవారం హనుమకొండ నుంచి గచ్చిబౌలికి ప్రత్యేక రాజధాని బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. ఈ బస్సు ప్రతీ సోమవారం ఉదయం 5గంటలకు హనుమకొండ నుంచి బయలుదేరి ఉప్పల్, జేబీఎస్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి వరకు చేరుకుంటుందని టికెట్ ధర రూ.450 అని, ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఉద్యోగస్థులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డీఎం కోరారు.

ప్రకృతి ప్రకోపం ఛేదించేనా?

- క్షణాల్లో కుంభవృష్టి వానలు.. నిమిషాల్లోనే జల ప్రళయాలు
- అడవిలో వాయుగుండాలతో పెను విధ్వంసం
- 50వేలకు పైగా చెట్లు నేలకూలినా చిన్న ప్రాణికీ హాని జరగని వైనం
- ఉమ్మడి జిల్లాలో ఈ వైపరిత్యాలకు కారణాలపై చర్చోపచర్చలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కొన్నేళ్లుగా ఓరుగల్లు పరిసరాల్లో ప్రకృతి విధ్వంసం దేనికి సంకేతాలనే చర్చ జరుగుతోంది. ఆగస్టు 31న సాయంత్రం మేడారం అడవుల్లో ఏకకాలంలో కుంభవృష్టి వానతో పాటు పెనుగాలులు సృష్టించిన బీభత్సం పర్యావరణ శాస్త్రవేత్తలను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ఈ ప్రకృతి విధ్వంసం వెనుక ఉన్న రహస్యాలను కనుగొనేందుకు శాస్త్రీయ కారణాలపై శాస్త్రవేత్తలు విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. అటవీశాఖ ఉన్నతాదికారులు, ఫారెస్ట్ రిటైర్డ్ అధికారులు, జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్) ఎన్‌జీఆర్ఐ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ), ఐఎండీ శాస్త్రవేత్తలు టోర్నడోలపై అధ్యయనం చేస్తున్నారు. వరంగల్ నిట్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు సైతం ఈ ప్రకృతి విధ్వంసం వెనుక ఉన్నకారణాలను తెలుసుకునే పనిలో పడ్డారు.

వాస్తవానికి మేడారం అడవుల్లోకి జాతరకు ఒకప్పుడు ఎడ్ల బండ్లపైనే వచ్చేవారు. కానీ పదిహేనేళ్లుగా వాహనాల రద్దీ పెరిగింది. తద్వారా పెరిగిన గాలి కాలుష్యం వాతావరణ సమతుల్యతను దెబ్బతీయటంతో పాటు కార్బన్ డయాక్సైడ్, మీథేన్ లాంటి విషవాయువులు సరస్సులు, చెరువులు, సముద్రాలు, గోదావరి నీటి తేమని పైకి వెళ్లకుండా కట్టడి చేస్తుందని, ఫలితంగా గాలిలో పయనించి తేమ పొరలా ఏర్పడి వర్షం రూపంలో ఒకేచోట (క్లౌడ్‌బరస్ట్) కుంభవృష్టిగా పడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనినే గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌గా కేయూ ప్రొఫెసర్ ఒకరు అభివర్ణించారు. ఈ కారణంతోనే ములుగు జిల్లా లక్ష్మీదేవిపేటలో గతేడాది జూలై 27వ తేదీన 64.98సె.మీ వర్షం కురిసి ఉండవచ్చుననే అభిప్రాయాలను పరిశోధకులు వెల్లడిస్తున్నారు. ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం మండలాల్లో మేఘాలు ఇళ్లపైకి రావడానికి, చిలుకలగుట్టపైన ఏర్పడిన సుడిగాలికి కూడా ఇదే కారణమై ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది ఆగస్టు 31న బంగాళాఖాతంతో పాటు ఆరేబియా సముద్రంలో ఏర్పడిన వాయుగుండం పెనుగాలులు సుడులుగా మారి మేడారం అడవుల్లో విధ్వంసం సృష్టించి ఉండవచ్చుననే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. భారీగా వృక్షసంపద నష్టానికి ప్రధాన కారణం చెట్ల ఎదుగుదల కూడా ఒకటిగా చెబుతున్నారు. మేడారం అడవుల్లో నేల గట్టిగా ఉండటంతో చెట్ల వేర్లు లోపలికి వెళ్లకుండా.. పక్కకు పాకి ఉంటాయని, సక్రమంగా భూమితో పట్టు లేకపోవడంతో పెనుగాలులకు త్వరగా నేలకూలే అవకాశం కూడా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈఏడాది ఆగస్టు 31న ఏర్పడిన విధ్వంసం టోర్నడోల వల్ల కాదని కొందరు వాదిస్తుంటే.. మరికొంత మంది శాస్త్రవేత్తలు మాత్రం పెనుగాలులే కారణంగా చెప్పుతున్నారు. దీనిపై శాస్త్రవేత్తలు లోతుగా పరిశోధనలు చేస్తుండటంతో ఓరుగల్లు ఏజెన్సీలోనే ప్రకృతి ప్రకోపానికి కారణం తెలుస్తుందనే చర్చ జరుగుతోంది.

వైపరిత్యాలను జంతువులెలా గుర్తించాయో..?

మేడారం అడవుల్లో ఆగస్టు 31న భారీ పెనుగాలుల విధ్వంసానికి భారీ వృక్షాలు నేలకూలినప్పటికి అడవి జంతువులేవీ మృత్యువాత పడకపోవడం అధికారులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. 80వేలకు పైగా చెట్లు నేలకొరిగ్గా.. ఎక్కడా కూడా చిన్నపాటి జంతువు మృతి చెందిన ఆనవాళ్లు కనిపించలేదు. దీనికి కారణం జంతువులు, పక్షులు ప్రకృతి వైపరీత్యాల రాకను ముందే పసిగడతాయని అర్థమవుతోంది.

2023 జూలై 27న కుంభవృష్టి వానలకు మోరంచ, కొండాయి వాగుల్లో భారీగా వరద వచ్చి ఇళ్లను ముంచెత్తినప్పటికి మానవులు ముందుగా నష్టాన్ని అంచనా వేయలేకపోయారు. ఆ సమయంలో తాడుతో కట్టేయకుండా వదిలేసి ఉన్న పశువులు ముందే వరద విధ్వంసాన్ని పసికట్టి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయాయి. కట్టేసి ఉన్న పశువులు అరుస్తూ తమ యజమానులను అప్రమత్తం చేయడం గురించి ఇప్పటికీ చర్చించుకుంటారు.

గ్లోబల్ వార్మింగ్ వల్లే వైపరిత్యాలు

ప్రొఫెసర్ ఎస్.జ్యోతి, కెమిస్ట్రీ, ప్రిన్సిపాల్ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజి హనుమకొండ



పట్టణీకరణ, పారిశ్రామీకరణ పెరగటంతో వాతావరణ కాలుష్యం పెరగడం, గ్లోబల్ వార్మింగ్ వల్లే ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడుతున్నాయి. గతంలో మేడారం అడవుల్లోకి ఎడ్లబండ్లపై వెళ్లేవారు. ప్రస్తుతం వాహన కాలుష్యం పెరిగింది. దీనికి తోడు వాతావరణంలో విషవాయువులు పెరిగి, సముద్రాల నుంచి తేమ పైకి వెళ్లకుండా అడ్డు పడుతున్నాయి. దీంతో అసాధారణ వర్షాలు పడుతున్నాయి. ములుగు ఏజెన్సీలో కొద్దిగా చెట్లు ఎక్కువగా ఉండటంతో గాలి ద్వారా ఈ ప్రాంతంలో కుంభవృష్టి వానలు కురుస్తున్నాయి. వైపరీత్యాలను గుర్తించే శక్తి జంతువులకు ఉన్న కారణంగానే మేడారం అడవుల్లో వేల చెట్లు నేలకూలినా జంతువులకు ఎలాంటి ప్రాణ జరగలేదు.

వాతావరణ అసమతుల్యం వల్లే..

ప్రొఫెసర్ ఎన్.రామస్వామి, బయోటెక్నాలజీ, కాకతీయ విశ్వవిద్యాలయం



వాతావరణంలో అసమతుల్యమే ప్రకృతి వైపరీత్యాలకు ప్రధాన కారణం. మన ప్రాంతంలో ఉండాల్సినంత వృక్ష సంపద లేకపోవడం, వాతావరణ కాలుష్యం పెరగటం కూడా ఓ కారణం కావొచ్చు. అయితే మేడారం అడవుల్లో టోర్నడోల వల్ల చెట్లు నేలకూలి పోకపోవచ్చు. దీనిపై లోతుగా పరిశోధనలు జరుగుతున్నాయి. సాధారణంగా గాలిలో అధిక పీడనంవల్ల ఇలాంటి వైపరీత్యాలు ఏర్పడుతుంటాయి. ఇలాంటి సంఘటనలో తొలిసారిగా చూశా. అయితే సింగపూర్‌లో ఉన్న కొత్త టెక్నాలజీతో నేలకూలిన చెట్లను తిరిగి బతికించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ దిశగా ప్రయత్నాలు చేయాలి.

క్రికెట్ క్రీడాభివృద్ధికి ప్రణాళికలు

- కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి
- సందడిగా అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్స్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కుడా చైర్మన్ ఇనుగాల

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలికితీయడంతోపాటు జిల్లాలో క్రికెట్ క్రీడాభివృద్ధికి త్వరలోనే ప్రణాళికలు రూపొందిస్తామని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి స్పష్టంచేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మొగిలిచర్ల క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లాల అండర్-19 బాలుర క్రికెట్ పోటీలను కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ క్రీడాకారులను తీర్చిదిద్దేలా జిల్లాలో క్రికెట్ క్రీడను అభివృద్ధి చేస్తామన్నారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొగిలిచర్ల క్రికెట్ క్రీడా మైదానంతో పాటు కోమటిపల్లిలోని పోర్ట్ క్లబ్ క్రికెట్ మైదానంలో అంతర్ జిల్లా స్థాయిలో 8జట్లు పాల్గొంటాయని, వీటికి అక్టోబర్ 5వరకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఉపాధ్యక్షుడు ఖాజా, మాజీ కార్యదర్శి ఉదయభానురావు, సభ్యులు తోట రాము, మట్టెడ కుమార్, బండారి ప్రభాకర్, రామకృష్ణ, అభినవ్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తొలిరోజు వరంగల్ - మహబూబ్‌నగర్ జట్ల మధ్య నిర్వహించిన పోటీలో ఆతిథ్య వరంగల్ జిల్లా ఓటమి చెందింది. మెదక్-నల్లగొండ జట్ల మధ్య జరిగిన పోటీల్లో నల్లగొండ జట్టు విజయం సాధించింది.

గురుకులాల్లో చాక్‌డౌన్-పెన్‌డౌన్

హనుమకొండ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వరంగల్ యాకూత్‌పుర గిరిజన గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు గురుకుల విద్య జేఏసీ పిలుపు మేరకు శనివారం టీటీఆర్ఈఐటీఏ ఆధ్వర్యంలో చాక్‌డౌన్-పెన్‌డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు విధులకు హాజరై బోధన, కార్యాలయ పనులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. అనంతరం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ పాఠశాల ప్రిన్సిపాల్ ద్వారా గురుకుల సెక్రెటరీకి మెమోరాండం సమర్పించారు. తెలంగాణ గిరిజన గురుకుల విద్యాలయాల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రుషీకేశ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీహెచ్. సతీష్‌కుమార్, స్థానిక యూనిట్ అధ్యక్షుడు ఇ.రాజన్న, సీనియర్ ప్రిన్సిపాల్ బి.మధు, జూనియర్ వైస్‌ప్రిన్సిపాల్ భవానీ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించాలి

ఐనవోలు, సెప్టెంబరు 28: విద్యార్థుల్లో దాగి ఉన్న ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించాలని ఎంఈవో పులి ఆనందం తెలిపారు. శనివారం నిర్వహించిన మండలస్థాయి కళా ఉత్సవ్-2024 పోటీల్లో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళల ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గుతుందన్నారు. ఓకల్ మ్యూజిక్‌లో కె. హర్షిణి, (ఏకశిల స్కూల్), థియేటర్ (మైమ్)లో మమ్మద్ రహమాన్ టీం సింగారం, నృత్యంలో మనోజ్ఞ, ఏకశిల స్కూల్, విజువల్ ఆర్ట్స్(2డి) ఎస్. మేఘన, కొండపర్తి సూల్, ట్రెడిషినల్ స్టోరీ బెల్లింగ్(బుర్ర కథ) యశ్వంత్ గ్రూప్ పాత్ ఫైండర్ స్కూల్ విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, పోటీల నిర్వహకులు అలిగిరెడ్డి మధుసూదన్ రెడ్డి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సత్యవాణి, న్యాయ నిర్ణేతులు ఆర్. విజయభాస్కర్, స్వప్నలు వ్యవహరించగా సీఆర్పీలు రేవతి, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలి

కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 28: పెంపుడు కుక్కలను పెంచుతున్న యజమానులు వాటికి యేటా రేబీస్ వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. వడ్డెపల్లిలోని ప్రాథమిక పశు వైద్యకేంద్రంలో శుక్రవారం ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పశు వైద్య కేంద్రంలోని అన్ని విభాగాలను కలెక్టర్ పరిశీలించి పశు వైద్య, ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన వివరాలను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రేబీస్ వ్యాధి నివారణకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వడ్డెపల్లి పశు వైద్య కేంద్రంలో టీకాలకు సంబంధించిన వివరాలను, ఆస్పత్రి సంబంధించిన వివరాలను స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ కె.వెంకటరమణ, సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్, జంతువుల రోగ నిర్ధారణ ప్రయోగశాల సహాయ సంచాలకులు నాగమణి, వైద్య సిబ్బందితోపాటు స్థానిక రైతులు పాల్గొన్నారు.

30న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 28: హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 30న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 16, 18, 20 బాల బాలికల విభాగంలో హనుమకొండ జేఎన్ఎస్‌లో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు అక్టోబర్ 7, 8 తేదీల్లో జేఎన్ఎస్ అథ్లెటిక్స్ సింథటిక్‌ట్రాక్‌పై నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9390104499, 9441086556 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

ఐనవోలు, సెప్టెంబరు 28: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన ఘటన ఒంటిమామిడిపల్లిలో జరిగింది. బాధిత రైతు గోనె రాజు కథనం ప్రకారం.. ఆరకట్టి మొక్కజొన్న విత్తనాలు వేస్తుండగా తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు ఎద్దు తలిగి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. కాడెద్దు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని రైతులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తక్కువ ఉందని ఎత్తుపెంచాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని వాపోయారు. నష్టపోయిన రైతుకు పరిహారం అందించాలని కోరారు.

ఆలయాల పరిరక్షణ బాధ్యత తీసుకోవాలి

కమలానంద భారతీస్వామి



కమలానంద భారతీస్వామిని సత్కరిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 28: రాష్ట్రంలో ఆలయాల పరిరక్షణ బాధ్యత హిందూ సమాజంలోని మేధావులు, ధార్మిక నిష్ఠ కలిగిన వారు తీసుకొని ప్రాచీన ఆలయాలను పరిరక్షిస్తూ పూర్వ వైభవం తీసుకు రావాల్సిన ఆవశ్యకత ఉందని స్వామి కమలానంద భారతీ పిలుపునిచ్చారు. శనివారం ప్రదోశకాల సమయంలో రాత్రి చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని ఆయన సందర్శించారు. దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడి హోదాలో ఆలయాన్ని సందర్శించిన స్వామికి ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మతోపాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఘనంగా స్వాగతించారు. ఆలయ నాట్య మండపంలో తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి కమలానంద భారతీస్వామి అనుగ్రహ భాషణం చేస్తూ కాకతీయుల కాలం నాటి చారిత్రక ఆనవాళ్లున్న వరంగల్ ఉమ్మడి జిల్లాలోని కాకతీయ శిల్పాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. శిల్పా కళా నైపుణ్యం ఉట్టిపడే రామప్ప, వేయిస్తంభాల ఆలయంలాంటి అనేక ప్రాచీన ఆలయాలు ఈ జిల్లాలో పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఆలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ ఆలయాలపై ప్రస్తుతం జరుగుతున్న దాడుల నేపథ్యంలో హిందూ సమాజం స్పందించకపోవడం ఏమాత్రం వాంఛనీయం కాదన్నారు. మన ఆలయాలను మనం రక్షించుకోవాలన్నారు. హిందూ సమాజంలో ప్రజలు చైతన్యవంతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకులు న్యాలకొండ భాస్కర్‌రావు, జయపాల్‌రెడ్డి తదితరులు స్వామివెంట ఉన్నారు.



డీజీపీని కలిసిన అమరవీరుల కుటుంబాల సభ్యులు

స్థలం ఇస్తే ఇండ్లు కట్టుకున్నాం..

ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని నోటీసులు ఇచ్చారు..

డీజీపీకి పోలీసు అమరవీరుల కుటుంబాల వినతి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 28: పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం ఉద్యోగంతో పాటు కాజీపేటలోని సర్వే నంబర్ 27లో 14 మందికి 200 గజాల చొప్పున స్థలం ఇస్తే ఇండ్లు కట్టుకున్నామని, ఇటీవల ఈ స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని నోటీసులు ఇచ్చారని, తమకు న్యాయం చేయాలని డీజీపీని శుక్రవారం అమరవీరుల కుటుంబాలు కలిసి విన్నవించారు. వరంగల్ కలెక్టర్ ఉత్తర్వులతో తమకు స్థలాలు ఇచ్చారని, ఆ స్థలాల్లో అప్పు చేసి ఇండ్లు కట్టుకున్నామని వారు తెలిపారు. నోటీసులు ఇవ్వడంతో ఆందోళనకు గురవుతున్నామని వారు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని అమరవీరుల కుటుంబాలు విజ్ఞప్తి చేశాయి. డీజీపీని కలిసిన వారిలో అమరవీరుల కుటుంబాల సంఘం రాష్ట్ర నాయకులు సింగం రేణుక, ఉపాధ్యక్షురాలు స్వరూప రాణి తదితరులు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

బాలసముద్రం, సెప్టెంబరు 28: నేడు ఆదివారం వరంగల్-1డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ -1 డిపో పరిధిలో హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ల ప్రయాణికులు బస్సు సర్వీసులు, సౌకర్యవంతమైన ప్రయాణం కోసం సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 వరకు ప్రయాణికులు 9959226047 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు కొత్త ఆలోచనలపై దృష్టి పెట్టాలి

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 28: విద్యార్థులు కొత్త ఆలోచనలపై దృష్టి పెట్టాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ పింగిళి బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కవిత ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సత్ప్రవర్తనతో తోటి విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలగాలన్నారు. కళాశాల నిబంధనలు పాటిస్తూ క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. జూనియర్లు తమలో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించే వేదిక ఫ్రెషర్స్ డే అని అన్నారు. విద్యార్థినులు ఆట పాటలతో అలరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎం. శ్రీనివాస్, పి. శ్రీదేవి, లైబ్రేరియన్ అజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, కాంగ్రెస్ 58, 60 డివిజన్ల అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నంచందర్, కాంగ్రెస్ నాయకులు మండల సమ్మయ్య, తాళ్లపెల్లి మేరి, ముస్తాక్ నేహాల్, తాళ్లపెల్లి రవీందర్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించాలి

వడ్డెపల్లి ముదిరాజ్ సంఘం హిందూ శ్మశాన వాటికకు నిధులు మంజూరు చేయాలని ముదిరాజ్ సంఘం సభ్యులు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని కోరారు. వడ్డెపల్లి శాఖ ప్రధాన కార్యదర్శి మట్టెపల్లి సమ్మయ్య, ప్రతినిధులు కేశబోయిన కోటేశ్వర్‌రావు, మండల సమ్మయ్య తదితరులు పింగిళి కళాశాలలో ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 28: 54వ డివిజన్‌లో డ్రైనేజీ నిర్మాణ పనులకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.10లక్ష లతో కేయూ మొదటి గేటు నుంచి డబ్బాల వరకు సైడ్ డ్రైన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుంటి రజిత, కార్పొరేషన్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు అజీజ్‌ఖాన్, నలు బోల సతీష్, వీరగంటి రవీందర్, నెక్కొండ కిషన్, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 28: అక్టోబర్ 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దేవాదాయ రెవెన్యూ, విద్యుత్, సాగు నీటి పారుదల, మున్సిపల్. పంచాయతీరాజ్, పోలీస్, మత్స్య శాఖల అధికారులు, వేయిస్తంభాల ఆలయం, పద్మాక్షి దేవా లయం, మెట్టుగుట్ట తదితర ఆలయాల అర్చకులతో బతు కమ్మ, దసరా ఉత్సవాలపై వెంకట్ రెడ్డి సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో, నగర పరిధిలో మహిళలు బతుకమ్మ ఆడుకునే ఆలయాల వద్ద పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలు, తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సిద్ధం చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణ ఎప్పటికప్పుడు జరిగేలా చర్యలు చేపట్టాలని, బతుకమ్మ నిమజ్జనం అనంతరం పారిశుధ్యం సక్రమంగా జరిగే విధంగా చూసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడ కూడా చిన్న ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం చేసే చెరువుల వద్ద తగిన ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలన్నారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునిత మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ తరఫున ఆలయాల వద్ద బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. వేయిస్తంభాల దేవాలయం, పద్మాక్షి దేవాలయం, మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయాల వద్ద ప్రభుత్వం తరఫున చేయాల్సిన ఏర్పాట్లను గురించి అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, విష్ణువర్ధనాచార్యులు ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్య వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేష్, డీసీపీ రవి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి మాట్లాడారు. ఈ సమావేశంలో డీఆర్వో వై.వి.గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్‌డీవో నాగ పద్మజ, డీపీఓ లక్ష్మీరమాకాంత్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు, వెంకటేష్, డాక్టర్ నారాయణ, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలదే కీలక పాత్ర

హసన్‌పర్తి, సెప్టెంబరు 28: శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలదే కీలకపాత్ర అని నిట్ ప్రొఫెసర్ డాక్టర్ వలుప దాసు రమ అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాద్ ఇంజనీరింగ్ ఎఫినిటీ గ్రూప్ ఆధ్వర్యంలో వరంగల్ జోనల్ కాంగ్రెస్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో కృత్రిమ మేధ అన్ని రంగాల్లో ముఖ్యమైన అంశంగా పరిణమి స్తుందన్నారు. వైద్య రంగంలో కృత్రిమ మేధ అప్లికేషన్స్‌ని పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను వివరించారు. అతిథి ఐ ట్రిపుల్‌ఈ ఉమెన్ ఏజీ సెక్రటరి హర్షవర్ధిని మాట్లాడుతూ.. ఉమెన్ ఎంపవర్‌మెంట్ అంశం, సాక్ చైర్మన్ నీరటి మహేష్ యువతపై సోషల్‌మీడియా ప్రభావం అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం కోల్‌కత్తాలో హత్యాచారానికి గురైన వైద్య విద్యార్థినికి నివాళులర్పించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్, ఐట్రిపుల్ ఈ అడ్వైజర్ మూల రాము, ఏవో వేణుగోపాలస్వామి, విద్యార్థి కోఆర్డినేటర్లు సన వర్షిత, నందిని, అశ్రిత, అర్చనతో పాటు వరంగల్‌లోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

వడ్డెరలు రాజకీయాలను శాసించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 28 : సామాజిక, ఆర్థికంగా వెనుకబడి పోయిన వడ్డెర కులస్తులు ఎదిగి రాజకీయాలను శాసించాలని మోస్ట్ బ్యాక్ వర్డ్ క్యాస్ట్స్ (ఎంబీసీ) రాష్ట్ర చైర్మన్ జర్పటి జయపాల్ అన్నారు. శనివారం హనుమకొండ బ్యాంక్ కాలనీలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర వడ్డెర సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సభను ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లపు సమ్మయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జర్పటి జయపాల్ మాట్లాడుతూ.. ఎంబీసీలో 36 కులాలు ఉన్నాయని, అందులో వడ్డెర కులం అభివృద్ధికి నోచుకోక సంచార జీవనం గడుపుతూ పేదరికంలో మగ్గుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎంబీసీ కులాల కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ. 400 కోట్లు కేటాయించిందని చెప్పారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సమ్మయ్య మాట్లాడుతూ.. వడ్డెరలను షెడ్యూల్ తెగలో చేర్చాలని, 80 శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని, కాంట్రాక్టు పనుల్లో 20 శాతం రిజ ర్వేషన్ కల్పించాలని, మండలానికో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని సభలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఎంబీసీ చైర్మన్ జర్పటి జయపాల్‌తో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని, ఓబీసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ ఓర్సు తిరుపతిని సత్కరించారు. ఈ సభలో తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు బొంత మురళి, ఎత్తరి అంతయ్య, పల్లపు రాజేందర్, బొంత ఐలయ్య, కస్తూరి రాజు, శివరాత్రి వెంకటమ్మ, వల్లెపు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళిని సన్మానిస్తున్న టీఎన్‌జీవోస్ నేతలు

ఎంజీఎం సూపరింటెండెంట్‌కు సన్మానం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 28: ఎంజీఎం సూపరింటెండెంట్‌గా డాక్టర్ మురళి పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టీఎన్‌జీవోస్ నేతలు శనివారం ఆయనకు పూలమొక్క అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్ మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో అందరికీ సహకారంతో పేదలకు వైద్య సదుపాయాలు అందించడంలో సహకరిస్తామన్నారు. అదేవిధంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సూపరింటెండెంట్ చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంబి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, జిల్లా బాధ్యులు గద్దల రాజు, శెంకేసి రాజేష్, యాసుఫ్, గణేష్, యాదగిరి, నాగేశ్వర్‌రావు, కిషన్, రమేష్, గోపి, వినోద్, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ జీవో వెంటనే సవరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 28: ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ప్రభుత్వం ఇచ్చిన జీవో 25ను వెంటనే సవరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట యూఎస్‌పీసీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021 ఆగస్టులో ఇచ్చిన జీవో 25 అప్పుడు వచ్చిన వ్యతిరేకత దృష్ట్యా వెనక్కి తీసుకొని తిరిగి నూతన ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఇప్పుడు అదే జీవోను అమలు చేయాలనడం అన్యాయమన్నారు. దీని వల్ల ప్రభుత్వ పాఠశాలలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సోమశేఖర్, పెండెం రాజు, సత్యనారాయణ, కట్కూరి శ్రీనివాస్, ఉప్పలయ్య, బి.అంజనీదేవి, సుమ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ కలెక్టరేట్ ఎదుట..

ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం ప్రభుత్వం ఇచ్చిన జీవో 25ను వెంటనే సవరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) వరంగల్ కలెక్టరేట్ ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ నేతలు మాట్లాడుతూ.. జీవో నెంబరు 25ను సవరించిన తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. బోధనేతర పనులు, పాఠశాలల పర్యవేక్షణ నిమిత్తం ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంగ్లీష్, తెలుగు మీడియం ఉన్న పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులను ఆయా మీడియాంకు వేర్వేరుగా పూర్తిస్థాయి ఉపాధ్యాయులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యూఎస్‌పీసీ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, కె.భోగేశ్వర్, గోవిందరావు, టి.కుమార్, వెంకటేశ్వర్లు, సృజన్ ప్రసాద్‌రావు, యాకయ్య, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూఎస్‌పీసీ నేతలు

గోపాల్‌పూర్ ఊర చెరువును పరిరక్షించాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 28: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్ ఊర చెరువును పరిరక్షించాలని టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కందుకూరి రజనీకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీతో పాటు గ్రామస్థలతో గోపాల్‌పూర్ ఊర చెరువు కట్టపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా కందుకూరి రజనీకాంత్ మాట్లాడుతూ.. గోపాల్‌పూర్ ఊర చెరువు సర్వే నంబర్ 89లో 20 ఎకరాల 10 గుంటల భూమి ఉండేదన్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో చెరువు శిఖం భూమి అన్యాక్రాంతమైందని పేర్కొన్నారు. 20ఎకరాల 10 గుంటలకు ప్రస్తుతం చెరువు విస్తీర్ణం సుమారు 3 నుంచి 4 ఎకరాలలోపు ఉంటుందని తెలిపారు. నగరం నడిబొడ్డున ఉన్న ఈ భూమిని కబ్జా చేసి ప్లాట్లుగా విభజించి విక్రయించి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. చెరువు ఎఫ్టీఎల్, బఫర్‌జోన్లను సర్వే చేయించి అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని కోరారు. హైదరాబాద్‌లో హైడ్రా మాదిరిగా వరంగల్‌లో వాడ్రాను తీసుకొచ్చి ప్రభుత్వ భూముల అన్యాక్రాంత భూములను వెలికి తీయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ధర్నాలో గోపాల్‌పూర్ ఊర చెరువు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు గిన్నారపు రాజు, ఇమ్మడి అశోక్ బాబు, కందుకూరి ప్రవీణ్, ఇమ్మడి రాజేంద్రప్రసాద్, బూర రాజేష్, ఇమ్మడి రమేష్, గిన్నారపు చందు, ఇమ్మడి శ్రీనివాస్, నలుబాల దామోదర్, ఇమ్మడి బాబు, ఇమ్మడి నూతన్‌తో పాటు ప్రజా తంత్ర ఆలోచన వేదిక జిల్లా అధ్యక్షుడు తుపాకుల దశరథం తదితరులు పాల్గొన్నారు.

పాత పోలీస్‌స్టేషన్‌కు తాళం

మడికొండ, సెప్టెంబరు 28: మడికొండ గ్రామంలోని పాత పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు తాళం వేశారు. కొంతకాలంగా ఆ ప్రదేశం వాహనాల పార్కింగ్, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ఆదేశాల మేరకు శనివారం పోలీసులు పాత పోలీస్‌స్టేషన్‌కు తాళం వేశారు. లోనికి ఎవరైనా వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ గేటుకు బోర్డును తగిలించారు.

కేజీబీవీని తనిఖీ చేసిన డీఆర్‌డీవో

వేలేరు, సెప్టెంబరు 28: మండలంలోని గొల్లకృష్ణంపల్లి కేజీబీవీ విద్యాలయాన్ని శనివారం డీఆర్‌డీవో నాగ పద్మజా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన, పచ్చదనం, పరిశుభ్రతపై విద్యార్థులకు వివరించి, ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, ఎంపీవో విమల, ఏపీవో విజయ, కేజీబీవీ ఎస్‌వో స్రవంతి, కార్యదర్శి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఏవైనా ఎగరాల్సింది కాంగ్రెస్ జెండానే..

5వ పేజీ తరువాయి

ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికలకు 20 రోజుల ముందు తనకు పరకాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం వచ్చిందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి తన గెలుపునకు కృషి చేశారని గుర్తు చేశారు. పార్టీ కోసం త్యాగం చేసిన కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించాలన్నదే లక్ష్యమని ఎమ్మెల్యే చెప్పారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నియోజకవర్గంలో రూ.42 కోట్ల 83 లక్షల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు చేసినట్లు వెల్లడించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే తపన ఉందని, ఎలాంటి స్వార్థం లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో అతిథులుగా టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, డీసీసీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధుల పోషణ, సంరక్షణ వారసులదే..

హసన్‌పర్తి, సెప్టెంబరు 28: వృద్ధుల పోషణ, సంరక్షణ బాధ్యత వారసులదేనని జిల్లా సంక్షేమాధికారి రాజమణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగాయి. జిల్లా సంక్షేమ అధికారి, మహిళలు, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ హనుమకొండ జిల్లా ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారత కేంద్రం మిషన్ కోఆర్డినేటర్ కల్యాణి జిల్లా స్థాయి వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం- 2007పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శిరీష, అనురాగ్ సొసైటీ నిర్వాహకులు అనితారెడ్డి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, ఆర్‌టీసీ రిటైర్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు సమ్మయ్య, పీఎల్ఎన్‌రావు, ఎఫ్ఆర్‌వో రవికృష్ణ, జెండర్ స్పెషలిస్టు స్వర్ణలత, రజిత, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీని కలిసిన బల్దియా జేఏసీ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 28: ఇటీవల గ్రేటర్ వరంగల్ పరిధిలో ఏర్పడిన జేఏసీ నాయకులు శనివారం మున్సిపల్ కార్పొరేషన్ కాశిబుగ్గ సర్కిల్ -1 కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డిని వారు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

డీసీని కలిసిన వారిలో జేఏసీ అధ్యక్షుడు బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్, కోశాధికారి స్వర్ణన్‌రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, కార్యదర్శి బానోతు బాలునాయక్, ముఖ్య సలహాదారులు ఏల్పుల ధర్మరాజు యాదవ్, నాయకులు జన్ను విజయ్‌కుమార్, ఏలియా, గిరిబాబు, సత్యంలు ఉన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందాం..



ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మడికొండ, సెప్టెంబరు 28: మడికొండలో ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. అంటూ సెయింట్ మాథ్యూస్ హైస్కూల్ విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వల్ల వాతావరణ కాలుష్యం, రాబోయే తరాలకు కలిగే నష్టాలను ప్లకార్డుల ద్వారా ప్రదర్శిస్తూ ప్లాస్టిక్ వాడకాన్ని బంద్ చేద్దాం.. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములమవుదాం.. అంటూ గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్ ప్రతాప్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌పై చిన్నారులకు అవగాహన

మడికొండకు చెందిన మాస్టర్జీ స్కూల్ విద్యార్థులు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలీస్‌స్టేషన్‌లోని రిసెప్షన్, ఎస్‌హెచ్‌వో చాంబర్, ఎస్సై రూమ్, లాకప్స్, పోలీస్‌స్టేషన్ పరిసరాలపై ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై రాజబాబు, పోలీస్ సిబ్బంది, స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి

మడికొండ, సెప్టెంబరు 28: మడికొండ చౌరస్తాలో స్వాతంత్ర్య సమర యోధుడు భగత్ సింగ్ జయంతిని ఛత్రపతి శివాజీ సేన ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బజరంగ్‌దళ్ మహానగర సంయోజక్ కొల్లూరి ఆదిత్యసాయి, సహ సంయోజక్ బండి రోహిత్, బీజేపీ జిల్లా నాయకులు వీ వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, పాల్గొన్నారు.

● తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం తయారీ విషయంలో జరిగిన అపవిత్రతను వ్యతిరేకిస్తూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఈనెల 30న కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన చేయనున్నట్లు బజరంగ్‌దళ్ బాధ్యులు కోరారు. హిందూ బంధువులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భగత్‌సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలి

హనుమకొండ టౌన్: భగత్‌సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని జిల్లా కమిటీ అధ్వర్యంలో శనివారం లష్కర్‌బజార్‌లోని భూమయ్య భవన్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుఐఎస్ఎఫ్ టౌన్ సెక్రెటరీ బాలగోని రాకేశ్, జిల్లా నాయకులు ఈశ్వర్, రహమాన్, సిద్ధు, ధనుష్, అభిరామ్, ప్రసన్న, అఖిల, రజిని తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 28: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ హనమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉప్పలయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు, ఇతర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న నాన్ పర్మినెంట్ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస ఉద్యోగ భద్రత కల్పించి రూ.26వేల కనీస వేతనం అందజేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డికి అందజేశారు. ధర్నాలో బరుపట్ల మహేష్, యాస బాబు, మాతంగి నవనీత, కోటి, నరేష్, అనిల్, సాగర్‌తోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఆదివారం



బాలీవుడ్‌లో ఇప్పుడు ప్రతిఒక్కరి నోట వినిపిస్తున్న పేరు... శ్రద్ధా కపూర్. అందుకు కారణం... ఆమె నటించిన బ్లాక్‌బస్టర్... 'స్త్రీ-2'. ఈ చిత్రం వసూళ్లు వందల కోట్లు దాటేసింది. ఓటీటీలోనూ దుమ్ము రేపుతోంది. ఇది శ్రద్ధానే కాదు... పరిశ్రమ కూడా ఊహించని ఘన విజయం. ప్రభాస్ 'సాహో'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీ... ఇప్పుడు దర్శకనిర్మాతల హాట్ ఫేవరెట్.

హిట్టయినా.. ఫ్లాపయినా.. కష్టం ఒక్కటే



హిందీ పరిశ్రమలో విలన్‌గా దశాబ్దాలు ఏలిన శక్తికపూర్ తనయగా సినీ రంగ ప్రవేశం చేసినా... ఆమె కెరీర్ పూల పాన్పు కాలేదు. నాన్న పేరుతో బాలీవుడ్‌లో ఎంట్రీ దొరికినా... ఆ తరువాత నిలదొక్కుకోవడానికి ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంది. వరుస అపజయాలతో ఆరంభంలో తడబడినా... నటిగా మాత్రం మంచి గుర్తింపు తెచ్చుకుంది. పద్నాలుగేళ్ల కిందట విడుదలైన 'తీన్ పత్తి' ఆమెకు తొలి చిత్రం. ఆ తరువాత 'ఆషికీ2, భాగీ, స్త్రీ, సాహో' తదితర హిట్స్‌తో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది.

'ఫోర్బ్స్ ఇండియా' మ్యాగజైన్ 'టాప్ 100 సెలబ్రిటీ'ల జాబితాలో, అలాగే '30 అండర్ 30'లో చోటు దక్కించుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్స్ (9.3 కోట్లు) ఉన్న భారత నటుల్లో ఒకరుగా వెలుగుతోంది. ఎన్నో బ్రాండ్స్‌కు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. ఇవన్నీ రాత్రికి రాత్రి సాధించిన విజయాలు కాదు. అపజయం ఎదురైన ప్రతిసారీ... మరింత పట్టుదలగా ప్రయత్నించింది. తన సామర్థ్యం ఏవిటో తనకు తెలుసుకుని... దానికి తగిన పాత్రలు ఎంపిక చేసుకొంటూ అడుగులు వేసింది.

అమ్మ వైపు... నాన్న వైపు... నటులు, సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్న వ్యక్తులే. కానీ ప్రతిభ లేకపోతే రాణించడం కష్టం. దీన్ని గ్రహించిన శ్రద్ధ... అవకాశం లభించిన ప్రతిసారీ తనను తాను నిరూపించుకొంటూ వచ్చింది. పాత్రకు అనుగుణంగా తన లుక్స్‌ను మార్చుకోవడానికి ఆమె ఎప్పుడూ ముందుంటుంది. అందుకు గత ఏడాది విడుదలై మంచి కలెక్షన్లు సాధించిన 'తు ఝూఠీ మై మక్కర్' ఒక ఉదాహరణ. అందులో కథ కంటే శ్రద్ధా కపూర్ ధరించిన బికినీల గురించే ఎక్కువ చర్చ జరిగింది. బీచుల్లో రణబీర్ కపూర్‌తో ఆమె పండించిన సన్నివేశాలు 'హాట్' టాపిక్ అప్పుడు. మరే తారకూ కుదరనంతగా శ్రద్ధకు బికినీలు కుదిరాయనేది డిజైనర్ల మాట. 'ఆ చిత్రంలో రణబీర్‌కు, నాకు మధ్య సన్నివేశాలు అధిక భాగం సముద్ర తీరాల్లోనే ఉంటాయని దర్శకుడు ముందే చెప్పారు. బీచ్ డ్రెస్సుల్లో అందంగా కనిపించాలంటే శరీరాకృతిని దానికి తగ్గట్టు మలుచుకోవాలి. అందుకోసం జిమ్‌లో ఎంతో శ్రమించాను. షూటింగ్ జరిగినన్ని రోజులూ ఉదయం ఐదున్నరకల్లా వర్కవుట్స్ ముగించేదాన్ని' అంటూ ఓ సందర్భంలో చెప్పింది శ్రద్ధ.

'స్త్రీ-2'తో 'తార'స్థాయికి...

గత నెలలో విడుదలైన కామెడీ హర్రర్ చిత్రం 'స్త్రీ-2' శ్రద్ధ స్టార్డమ్‌ను అమాంతం పెంచేసింది. బాలీవుడ్‌లో ఆమె స్థానాన్ని 'తార'స్థాయికి తీసుకువెళ్లింది. ఆమె పేరు ప్రతి ఇంటికీ పరిచయమైంది. ఇలాంటి విజయం ప్రతి నటుడి కల. అయితే ఆమెకు ఈ తరహా అనుభవం పూర్తిగా కొత్తేమీ కాదు. కాకపోతే హిందీలో అత్యధిక పారితోషికం తీసుకొంటున్న కథానాయికల్లో ఒకరుగా ఎదిగిన శ్రద్ధకు ఈ చిత్రం కెరీర్‌లో అతి పెద్ద మలుపు. ఇదే విషయం ఆమె వద్ద ప్రస్తావిస్తే... 'మా నాన్న వారసత్వం, సినిమా పట్ల నాకున్న గాఢమైన ప్రేమతో సాగుతున్న ప్రయాణంలో భాగం ఈ విజయం. నా కెరీర్‌లో మరో మెట్టు ఎక్కినట్టుగా దీన్ని భావిస్తున్నాను. ఇకపై కూడా చేసే పని అర్థవంతంగా ఉండేలా చూసుకొంటూ, గొప్ప చిత్రాల్లో భాగం కావాలని కోరుకొంటున్నాను. ప్రస్తుతానికి నా దృష్టి దానిపైనే' అంటూ చెప్పుకొచ్చింది.

నాన్నను చూసి...

సినీ కుటుంబంలో పుట్టిన శ్రద్ధకు షూటింగ్‌లు, సెట్లు, కెమెరాలు కొత్తేమీ కాదు. నటి కావాలన్నది ఆమె చిన్ననాటి కల. 'నాన్న రోజూ షూటింగ్ నుంచి రకరకాల డ్రెస్సుల్లో, వేషాల్లో ఇంటికి వచ్చేవారు. నేను సెట్స్‌కు వెళ్లినప్పుడు నటనలో ఆయన హావభావాలు, ఒక పాత్ర నుంచి మరో పాత్రలోకి పరకాయ ప్రవేశం చేసే తీరు చూసి ఎంతో ఉత్సుకతకు లోనయ్యేదాన్ని. అదంతా నాకొక మాయాజాలంలా అనిపించేది. కొన్నాళ్లకు అర్థమైంది... నా మనసు కూడా అదే కోరుకొంటోందని' అని ఓ ఇంటర్వ్యూలో తన చిన్ననాటి రోజులు గుర్తు చేసుకుంది శ్రద్ధ.

ప్రేమ మరువలేనిది...

'ఆషికీ2'తో నవతరం 'ప్రియ' నాయికగా మన్ననలు అందుకొంటున్న ఆమె... 'స్త్రీ2'తో 37 ఏళ్ల వయసులో కెరీర్ బెస్ట్ విజయాన్ని చవిచూసింది. 2018లో విడుదలైన 'స్త్రీ'కి సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం... బాక్సాఫీసుల వద్ద కనక వర్షం కురిపించింది. ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్లు దాదాపు ఎనిమిది వందల కోట్ల రూపాయలని ఓ అంచనా. బడా హీరోల రికార్డులను బద్దలు కొట్టింది. ఈ ఏడాదిలో బాలీవుడ్ బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇందులో శ్రద్ధ మంత్రగత్తెగా నటించింది. 'అద్భుతమైన చిత్రంలో భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రేక్షకులు నాపై కురిపించిన ప్రేమ మరువలేనిది. నా నటనతో వాళ్లందరినీ అంతగా అలరించినందుకు గర్వంగా అనిపిస్తోంది' అంటుంది ఈ భామ.

అదే నిజమైన విజయం...

శ్రద్ధ కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు... ఆటుపోట్లు. వేటికీ కుంగిపోలేదు. తన మార్గాన్ని తనే నిర్మించుకుంది. హిట్ సినిమా అయినా... ఫ్లాప్ అయినా... పడే కష్టం ఒకటేనంటుంది. 'నా దృష్టిలో విజయం అనేది రుచికరమైన భోజనం ఆస్వాదించడం లాంటిది. నా కుటుంబంతో, మనసుకు దగ్గరైన సన్నిహితులతో మధుర క్షణాలను పంచుకోవడం. నిజమైన విజయం అంటే నన్ను ప్రేమించేవారు నా చుట్టు ఉండడం. కంటి నిండా నిద్రపోవడం. చేసే పనిలో అభివృద్ధి సాధించడం. జీవితాన్ని సమతుల్యం చేసుకోవడం. అన్నిటికీ మించి ప్రశాంతంగా జీవించడం. ఇప్పటికీ మా నాన్న శ్రమిస్తున్నారు. ఆయన గురించి తెలుసుకొంటుంటే... కష్టపడకుండా ఏదీ ఆశించకూడదనేది నాకు బోధ పడింది. ఇలాంటివన్నీ నాకు ఎంతో ప్రేరణనిస్తాయి. విజయ గర్వం నా తలకు ఎక్కకుండా దోహదపడతాయి'... అంటున్న శ్రద్ధా కపూర్ సినిమాలతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలకు కూడా సహకారం అందిస్తోంది. జంతు ప్రేమికురాలు. కొన్నేళ్ల కిందట నాన్‌వెజ్‌ను వదిలేసి శాకాహారిగా మారింది. సినీ ప్రాజెక్టులే కాదు... ఆమెకు ఉన్న భారీ ఫ్యాన్ ఫోలోయింగ్‌తో బడా బ్రాండ్లు కూడా క్యూ కడుతున్నాయి.

అద్భుతమైన అనుభూతి

'ఏ రంగంలోనైనా సరే రాణించాలంటే మీ బలాలు, బలహీనతలు ఏమిటో తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. అలాగే... మన విజయాల గురించి తల్లితండ్రులు, మనల్ని ప్రేమించేవారు గొప్పగా చెప్పుకోవడం కంటే పెద్ద బహుమతి ఏదీ ఉండదనేది నా అభిప్రాయం. అదే అద్భుతమైన అనుభూతి.'

కాఫీ సందేశ్!

కాఫీని చాలా మంది తాగుతారు. బెంగాలీలకు సందేశ్ అత్యంత ఇష్టమైన స్వీట్. ఈ రెండింటిని కలిపితే? రుచికరమైన ఫ్యూజన్ రెసిపీ అవుతుంది. ఫ్యూజన్ ఫుడ్స్‌కు మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో దీనిని ఎలా చేయాలో చూద్దాం..

కావాల్సిన పదార్థాలు

వెన్న తీయని పాలు: ఒక లీటరు, నిమ్మరసం- అరకప్పు, పంచదార- అరకప్పు, ఇన్‌స్టెంట్ కాఫీ పౌడర్- పావు కప్పు, ఏలకుల పొడి- పావు టీస్పూను, ఉప్పు- పావు టీస్పూను, నెయ్యి- రెండు స్పూన్లు, డ్రైఫ్రూట్స్- రుచికి తగినట్లుగా..

తయారీ విధానం

- పాలను తొరక కట్టేదాకా మరిగించాలి. దానిలో నిమ్మరసం కలపాలి.
- విరిగిన పాలను ఒక గుడ్డలో పోసి వడగట్టాలి. అదనంగా ఉన్న నీటినీ తీసివేయాలి.



- ఆ తర్వాత మిగిలిన పాల ముద్దను మృదువుగా కలపాలి. దానిలో పంచదార, కాఫీపౌడర్, ఏలకుల పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి.
- రెండు నిమిషాలు స్టౌ మీద పెట్టి వేడి చేయాలి.
- ఆ తర్వాత మిశ్రమాన్ని స్టౌ మీద నుంచి దింపి చల్లబరచాలి. దానిలో నెయ్యి వేసి కలపాలి.
- ఆ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి- వాటిపై డ్రైఫ్రూట్స్ అద్దాలి.

జాగ్రత్తలు

- కాఫీ రుచిని అందరూ ఆస్వాదించరు. కాబట్టి రుచికి అనుగుణంగా కాఫీ పౌడర్‌ను కలుపుకోవాలి

మధ్యాహ్నం నిద్ర ఇబ్బంది పెడుతుంటే

మధ్యాహ్నం కునుకు మంచిదే అంటారు. కానీ ఆఫీసులో ఆ కునుకు కెరీర్‌పై ప్రభావాన్ని చూపించవచ్చు. మధ్యాహ్నం నిద్ర చాలామందికి ఎదురయ్యేదే. ఈ పరిస్థితిని బయటపడాలంటే ఇలా చేయాలంటున్నారు నిపుణులు.

- లంచ్‌లో ఎక్కువ కార్బోహైడ్రేట్స్ లేకుండా చూసుకోవాలి. ముఖ్యంగా రైస్ తినడం వల్ల నిద్ర ముంచుకొస్తుంది. కార్బోహైడ్రేట్స్‌లో గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. ఇది నిద్రను ప్రేరేపించే రసాయనం అయినటువంటి ట్రిప్టోఫన్‌ను వేగంగా విడుదలయ్యేలా చేస్తుంది.
- రాత్రుళ్లు పొద్దుపోయే వరకు టీవీ చూడటం వల్ల దాని ప్రభావం నిద్రపై పడుతుంది. బెడ్‌పైకి చేరిన తరువాత ఫోన్ చూసే అలవాటు కూడా మంచిది కాదు. బ్లూ లైట్ నిద్రను దూరం చేస్తుంది.
- రాత్రివేళ త్వరగా పడుకుని, సూర్యోదయం కన్నా ముందే లేవడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల శరీరానికి, మనసుకు అవసరమైన విశ్రాంతి లభిస్తుంది. ఇది రోజంతా యాక్టివ్‌గా ఉండటానికి దోహదపడుతుంది.
- శరీరానికి తగినంత ఎనర్జీ అందనప్పుడు కూడా అలసట వస్తుంది. శక్తి కావాలంటే నట్స్, బెర్రీస్, డేట్స్ తీసుకోవాలి. ఇవి ఎక్కువ ఎనర్జీని అందిస్తాయి. ఇవి అలసటను దూరం చేసి శరీరానికి శక్తిని అందిస్తాయి.



- ప్రతిరోజు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల ఆ రోజంతా హుషారుగా ఉంటుంది. కనీసం నలభై ఐదు నిమిషాలు వేగంగా వాకింగ్ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. యోగా, మెడిటేషన్ వంటివి కూడా మంచి ఫలితాలను ఇస్తాయి.
- మధ్యాహ్నం వేళ మెదడుకు ఉత్సాహానిచ్చే విధంగా ఇష్టమైన వాటిని చూడటం, ఆసక్తి ఉన్న వాటికోసం సెర్చ్ చేయడం లాంటివి చేయాలి.



లాపతా లేడీస్... మహిళల గుర్తింపుపై బలమైన ముద్ర వేసిన సినిమా. బెస్ట్ ఫారిన్ ఫిల్మ్ కేటగిరీలో ఇండియా నుంచి అధికారిక చిత్రంగా ఆస్కార్ బరిలో నిలిచింది. బిప్లాబ్ గోస్వామి అందించిన కథకు తన స్క్రీన్‌ప్లే, డైలాగ్స్‌తో మాయ చేశారు స్నేహా దేశాయ్. లాపతా లేడీస్‌తో తన కలను సాకారం చేసుకున్నారామె. మరిన్ని విశేషాలు ఆమె మాటల్లోనే...



ఈ గుర్తింపుతో కల సాకారమైంది

"ఒక రచయితగా ఈ గుర్తింపు నాకలను సాకారం చేసింది. ఈ ప్రాజెక్టులో భాగస్వాములైన అందరికీ గుర్తింపు లభించింది. ఇందులో నేను కూడా భాగస్వామి కావడం నా అదృష్టం. ఈ చిత్రం మూల కథ బిప్లాబ్ గోస్వామి రాశారు. సినీస్థాన్ ఇండియా స్టోరీటెల్లర్ కాంపిటీషన్‌లో ఆయన రాసిన కథ పోటీలో నిలిచింది. ఆ కాంపిటీషన్ జ్యూరీలో అమీర్‌ఖాన్ ఉన్నారు. ఆ స్టోరీ నచ్చడంతో స్క్రీన్‌ప్లే డెవలప్ చేయమని నాకు ఇచ్చారు. అమీర్‌ఖాన్ వాళ్ల అబ్బాయి జునైద్‌ఖాన్ హీరోగా వచ్చిన 'మహరాజ్' సినిమాకు నేను పనిచేశాను. నా పని నచ్చడంతో గోస్వామి కథను డెవలప్ చేయమని చెప్పారు. అలా లాపతా లేడీస్ పట్టాలెక్కింది. సినిమా కోసం కొన్ని క్యారెక్టర్లు డెవలప్ చేసే స్వేచ్ఛను ఇచ్చారు. కథలు చెప్పడం భారతీయ మూలాల్లోనే ఉంది. అలాంటి వాతావరణంలోనే నేను పెరిగాను. మా తాత, అమ్మమ్మ, నానమ్మ, మా పేరెంట్స్ కథలు అద్భుతంగా చెప్పేవారు. ఆ ప్రభావం నాపై ఉంది.

అదే చూపించాం...

ఇది స్త్రీవాద చిత్రం కాదు. మహిళలు, మహిళా సాధికారత గురించి మాట్లాడే సినిమా. మహిళలు వాళ్ల సమస్యలకు పరిష్కారం కనుగొనమని అడిగేందుకు ప్రయత్నించాం. స్వేచ్ఛ వైపు అడుగులు వేయమని కోరాం. ఇందులో పురుష క్యారెక్టర్లను కూడా అద్భుతంగా చూపించాం. మొత్తంగా బ్యాలెన్స్ చేశామనే అనుకుంటున్నాం. జీవితంలో ఎదగాలంటే ఒకరి సహకారం మరొకరికి అవసరం. అదే సినిమాలో చూపించాం. సినిమాలో ప్రధాన స్త్రీ క్యారెక్టర్లకు ముసుగులు వేయడమనేది కథ ముందుకు వెళ్లేందుకు ట్రిగ్గర్‌లా ఉపయోగపడతాయని పెట్టాం. లక్ష్యాలు, ఆశయాలు ఎంత చిన్నవైనా, పెద్దవైనా కావచ్చు. అని కానీ వాటిని సంపూర్ణంగా సాధించుకోవాలి. ఉదాహరణకి గృహిణిగా ఉంటే అత్తగారితో స్నేహం చాలా ముఖ్యం. భాగస్వామి కోసం సబ్జీని వండటం ముఖ్యమైన అంశం. అదే ఇందులో చూపించాం.



తగిన గుర్తింపు లేదు

ఒక సినిమా విజయం సాధించినప్పుడు దర్శకులకు, నటులకు వచ్చినంత గుర్తింపు రచయితలకు రావడం లేదు. ఇది బాధ కలిగించే అంశమే. అయితే పెన్నుకున్న పవర్‌ను ప్రేక్షకులు అర్థం చేసుకుంటున్నారు. ఒక బౌండ్ స్క్రిప్ట్‌కున్న పవర్‌ని, రచయితలకు ఉన్న శక్తిని ప్రేక్షకుడు తెలుసుకున్నారు. గుల్జార్, జావేద్ అక్తర్, జుహీ చతుర్వేది లాంటి గొప్ప రచయితలు కథలు అందించిన సినిమాలు వాళ్ల పేర్లతో అమ్ముడవుతున్నాయి.

అవకాశాలు పుష్కలం

కథలు రాయడాన్ని కెరీర్‌గా ఎంచుకునే వారికి బోలెడు అవకాశాలు ఉన్నాయి. అయితే రాసే కథలో కాంప్రమైజ్ కావద్దు. మీ మనసును పాలో కావాలి. కథలను స్వేచ్ఛగా రాయాలి. ముందుగా బాగా చదవడం అలవాటు చేసుకోవాలి. సాహిత్యం, కామిక్స్, ఫిక్షన్ చదవాలి. పదాలు వెతుక్కునేందుకు శ్రమ పడకుండా ఉండేలా తయారవ్వాలి. సినిమాలు బాగా చూడాలి. రాసిన పదాలు చాలా దూరం ప్రయాణిస్తాయి. అందులో సందేహం లేదు.

నటన నుంచి రచన వైపు...

మాది ముంబయి. నాకు గుజరాతీ థియేటర్‌తో చాలా సంబంధం ఉంది. దాదాపు 25 ఏళ్లు పనిచేశాను. నేను ముందుగా నటిని. ఆ తరువాతే రచయితగా మారాను. స్నేహితులతో వన్ లైన్ ఐడియాస్, స్టోరీస్ షేర్ చేసే దాన్ని. గుజరాత్ థియేటర్ తరువాత టీవీ రంగంలోకి అడుగుపెట్టాను. గుజరాతీ టీవీ నుంచి హిందీ టీవీకి వచ్చాను. హిందీ టీవీ నుంచి మహరాజ్ అవకాశం వచ్చింది. ఆ తరువాత లాపతా లేడీస్ ఛాన్స్ దక్కింది. ప్రతినెలా టీవీ కోసం 56 ఎపిసోడ్‌లు రాసేదాన్ని. టీవీ రంగంలో టైమ్‌లైన్ కీ ఫ్యాక్టర్‌గా ఉంటుంది. ఈ రోజు నువ్వు రాసింది రేపు లేక ఎల్లుండి షూట్‌కి వెళుతుంది. డ్రాఫ్ట్ రీరైట్ చేయడం ఉండదు.

సహకారం మరువలేనిది

స్నేహితులు, బంధువులు, వెల్‌విషర్స్ నుంచి అభినందనలు చెబుతూ చాలా మెసేజ్‌లు వచ్చాయి. వాళ్ల సపోర్టు నాకెంతో ఆనందానిచ్చింది. నా కుటుంబ సభ్యులు నన్నెంతో నమ్మారు. నా కష్టాలను వాళ్లు చూశారు. ఇప్పుడు వాళ్లెంతో గర్వపడుతున్నారు. దర్శకురాలు కిరణ్‌రావుతో పనిచేయడం ఎంతో సంతోషానిచ్చింది. ఆమె తన టీమ్ మొత్తాన్ని నమ్మారు. మొదటి నుంచి కథను డెవలప్ చేయడానికి క్రియేటివ్ ఫ్రీడం అందించారు. ఆమెతో చేసిన డిస్కషన్స్ ఎంతో ఉపయోగపడ్డాయి. ఆమె సహకారం వల్లే రచన సులువుగా సాగిపోయింది. దర్శక రచయితల మధ్య రిలేషన్‌షిప్‌లో ఆ నమ్మకం, సహకారం చాలా అరుదుగా చూస్తుంటాం. యువ రచయితలను ప్రోత్సహించడంలో అమీర్‌ఖాన్ ఎప్పుడూ ముందుంటారు.'




ఒంటరితనం.. అధిగమించండి ఇలా

కొన్నిసార్లు మనం ఒంటరిగా ఉండాల్సిన రోజులుంటాయి. స్నేహితులు ఉండరు.. కుటుంబ సభ్యులు ఉండరు.. బయటకు వెళ్దామంటే - 'ఒంటరిగా వెళ్లాలా?' అనే ఆలోచన వేధిస్తూ ఉంటుంది. జీవితంలో ఇలాంటి ఫేజ్ వచ్చినప్పుడు ఏం చేయాలి అనే ప్రశ్న చాలా మందిని వెంటాడుతూ ఉంటుంది. ఇలాంటి సమయాల్లో- "మీకు మీరే స్నేహితులు.. మీరు మీరే కంపెనీ" అంటున్నారు మానసిక నిపుణులు. ఒంటరిగా ఉండాల్సి వచ్చినప్పుడు సమయాన్ని గడపటానికి వారు కొన్ని టిప్స్ చెబుతున్నారు. అవేమిటో చూద్దాం..

కొత్త స్కిల్ నేర్చుకోండి..

కొత్త స్కిల్స్ నేర్చుకోవటానికి వయస్సు ఎప్పుడూ అడ్డు కాదు. ఒంటరిగా ఉండాల్సిన సమయంలో కొత్త స్కిల్స్‌ను నేర్చుకుంటే జీవితం కొత్త మలుపు తిరిగే అవకాశముంటుంది. ఉదాహరణకు మీకు ముగ్గులు వేయటం రాదనుకుందాం. ఖాళీగా ఉన్న సమయంలో ముగ్గులు వేయటం నేర్చుకుంటే- ఎప్పుడో ఒకప్పుడు ఉపకరిస్తుంది.




సోషల్ మీడియా వద్దు..

ఖాళీగా ఉన్న సమయం దొరికితే చాలు- సోషల్ మీడియాలో మునిగిపోవటం అందరికీ అలవాటు అయిపోయింది. సోషల్ మీడియాను ఎక్కువగా చూడటం వల్ల సమయం గడిచినట్లు అనిపిస్తుంది.. కానీ అంతర్ముఖులం కావటానికి సమయం చిక్కదు. సోషల్ మీడియాలో గడిపే సమయంలో మన గురించి మనం ఆలోచించుకుంటే- మన చేసిన తప్పులను విశ్లేషించుకుంటే.. మన బలాలను మదింపు వేసుకుంటే ప్రయోజనం ఉంటుంది.

వ్యాయామం తప్పనిసరి

ఒంటరితనాన్ని అధిగమించాలంటే- ప్రతి రోజు వ్యాయామం తప్పనిసరిగా చేయాలి. దీని వల్ల శరీరంలోని కణాలు ఉత్తేజమవుతాయి.. పాజిటివ్ ఆలోచనలు వస్తాయి. వీలైనంత వరకు- ప్రకృతి ఒడిలో వ్యాయామం చేయటం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ	ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
అమెజాన్ ప్రైమ్			**ఆహా...**		
హౌస్ ఆఫ్ స్పాయిల్స్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 03	35 చిన్న కథ కాదు	తెలుగు చిత్రం	అక్టోబర్ 02
ది ట్రైబ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 04	బాలూగాని టాకీస్	తెలుగు చిత్రం	అక్టోబర్ 04
నెట్‌ఫ్లిక్స్			**జీ 5**		
టిమ్ డిల్లాన్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 01	ది సిగ్నేచర్	హిందీ చిత్రం	అక్టోబర్ 04
షెఫ్స్ టేబుల్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 02	**జియో సినిమా**		
లవ్ ఈజ్ బ్లైండ్	వెబ్‌సిరీస్	అక్టోబర్ 02	అమర్ ప్రేమ్ కీ ప్రేమ్ కహానీ	హిందీ చిత్రం	అక్టోబర్ 04
అన్‌సాల్వ్‌డ్ మిస్టరీస్ 5	వెబ్‌సిరీస్	అక్టోబర్ 02	**మనోరమా మ్యాక్స్**		
హార్ట్‌స్టాపర్ 3	వెబ్‌సిరీస్	అక్టోబర్ 03	ఆనందపురం డైరీస్	మలయాళ చిత్రం	అక్టోబర్ 04
కంట్రోల్	హిందీ చిత్రం	అక్టోబర్ 04			



అరవింద్ సంతకం

ప్రముఖ మరాఠీ నిర్మాత గజేంద్ర అహిరే దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'ది సిగ్నేచర్'. 2013లో వచ్చిన మరాఠీ చిత్రం 'అనుమతి'కి ఇది రీమేక్. అనుపమ్‌ఖేర్ లీడ్‌రోల్ పోషించారు. మహిమా చౌదరి, నీనా కులకర్ణి, రణ్‌వీర్ షోరే కీలకపాత్రలు పోషించారు.

అరవింద్ అనే పాత్రలో అనుపమ్‌ఖేర్ కనిపించారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న భార్యను కాపాడు కునేందుకు ఆయన పడిన కష్టాలు, వారి కుటుంబంలో ఎలాంటి సంక్షోభాన్ని సృష్టించాయి అనే అంశం చుట్టూ అల్లుకున్న కథ ఇది. మధ్యతరగతి కుటుంబాల్లోని కష్టాలు హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించారని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది.




LYCA PRODUCTIONS
ASIAN SURESH
SRI LAKSHMI MOVIES
OCT. 10
WORLDWIDE RELEASE
SUBASKARAN PRESENTS
SUPERSTAR RAJINIKANTH
వేట్టయన్
ద హంటర్
WRITTEN & DIRECTED BY T. J. GNANAVEL
AN ANIRUDH MUSICAL
PRODUCED BY SUBASKARAN
TAMIL TELUGU HINDI KANNADA


people MEDIA FACTORY
CHITRALAYAM
GOPICHAND
A SREENU VAITLA FILM
OCT 11TH
IN CINEMAS WORLDWIDE
విశ్వం
TG VISHWA PRASAD VENU DONEPUDI
TELUGU


CULT CONCEPTS
From The Director of
మంత్ర మంగళ
'OSHO' THULASIRAM'S
దక్షిణ
OCTOBER 4TH
RELEASE
PRODUCER :
ASHOK SHINDE


PHOENIX GAGA
JOKER FOLIE A DEUX
THE WORLD IS A STAGE
OCTOBER 2nd
WEDNESDAY RELEASE
FILMED FOR IMAX
WARNER BROS.
WARNER BROS. PICTURES RELEASE THROUGH NVR CINEMA - 9966963111


NANDAMURI TARAKA RAMARAO ARTS
Yuvasudha ARTS
MASSIVE BLOCKBUSTER
MAN OF MASSES NTR
DEVARA
PART 1
KORATALA SIVA
AN ANIRUDH MUSICAL
IN CINEMAS NOW


BGM STUDIO
దసరా నవరాత్రుల శుభాకాంక్షలతో
ADITYA MUSIC
OCTOBER 3RD
WORLDWIDE RELEASE
IN THEATRES
చిట్టి పొట్టి
Story, Screenplay, Producer & Director
BHASKAR YADAV DASARI
Music SRI VENKAT Editor BALAKRISHNA BOYA DOP MALHARBHAT JOSHI
Choreography KAPIL Stunts STAR MALLI PRO LAXMI NIVAS


BLOCKBUSTER HIT
ASIAN SURESH
2D ENTERTAINMENT
KARTHI ARVIND SWAMI
సత్యం సుందరం
WRITTEN & DIRECTED BY C. PREMKUMAR
PRODUCED BY JYOTIKA - SURIYA
Co Produced by Rajsekar Karpoorasundarapandian
IN CINEMAS NOW

బిజినెస్

మూడేళ్లలో ఏఐ ఉత్పత్తుల మార్కెట్ రూ.83 లక్షల కోట్లకు..

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఉత్పత్తులు, సర్వీసుల మార్కెట్ 44-45 శాతం వార్షిక వృద్ధితో 2027 నాటికి 99 వేల కోట్ల డాలర్ల (రూ.83.16 లక్షల కోట్లు) స్థాయికి చేరుతుందని అంచనా. రాబోయే మూడేళ్ల కాలంలో ఏఐ పని భారం ఏడాదికి 25 నుంచి 35 శాతం మేరకు పెరగవచ్చని బెయిన్ అండ్ కో 5వ వార్షిక ప్రపంచ టెక్నాలజీ నివేదికలో అంచనా వేసింది. ఏఐ విస్తరిస్తున్న కొద్ది కంప్యూటింగ్ శక్తి వేగంగా పెరగాల్సి ఉందని ఆ నివేదిక తెలిపింది. ఫలితంగా రాబోయే 5 నుంచి 10 ఏళ్ల మధ్య కాలంలో భారీ డేటా సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడుతుందని పేర్కొంది. ప్రస్తుతం 50 నుంచి 200 మెగావాట్లున్న డేటా సెంటర్ల సామర్థ్యం గిగావాట్ కన్నా పై స్థాయికి పెంచాల్సి వస్తుందని, అంటే నేడు 100 కోట్ల డాలర్ల నుంచి 400 కోట్ల డాలర్లున్న డేటా సెంటర్ల వ్యయం ఐదేళ్ల కాలంలో 1,000 కోట్ల డాలర్ల నుంచి 2,500 కోట్ల డాలర్లకు చేరుతుందని అంచనా వేసింది. ఏఐతో పని చేయగల జీపీయూల డిమాండు పెరిగిన కొద్ది వాటికి కావలసిన ఆధునిక విడిభాగాల డిమాండును 30 శాతం మేరకు పెంచుతుందని అంచనా వేసింది.

పండగ సీజన్‌పై 'ఆటో' ఆశలు

కొత్త కార్ల విడుదలకు కంపెనీలు రెడీ

దేశీయ ఆటోమొబైల్ కంపెనీలు ఈ ఏడాది పండగ సీజన్‌పై భారీ ఆశలు పెట్టుకున్నాయి. ఇందులో భాగంగా వినియోగదారులను ఆకట్టుకునేందుకు కియా మోటార్స్, మారుతి సుజుకీ, నిస్సాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీవైడీ, మెర్సిడెస్ బెంజ్ సహా మరికొన్ని కంపెనీలు వచ్చే నెలలో మార్కెట్లోకి కొత్త కార్లను విడుదల చేసేందుకు రెడీ అవుతున్నాయి. కొంతకాలంగా నిస్తేజంగా సాగుతూ వస్తున్న ఆటో మార్కెట్‌కు దసరా, దీపావళి పండగలు మరింత ఊపునిస్తాయని కంపెనీలు అంచనా వేస్తున్నాయి.

కొత్త తరం కియా కార్నివాల్



కియా మోటార్స్ తన ప్రీమియం మల్టీ పర్పస్ వెహికిల్ (ఎంపీవీ) కార్నివాల్‌లో న్యూ జనరేషన్ మోడల్‌ను వచ్చే నెల 3న విడుదల చేసే అవకాశం ఉంది. 2024 కార్నివాల్‌ను సరికొత్త డిజైన్, హంగులతో అందుబాటులోకి తేనుంది. దీని ధర రూ.40-45 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా.

కియా ఈవీ 9



కియా వచ్చే నెలలో కార్నివాల్‌తో పాటు తన ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ మోడల్ 'ఈవీ 9'ను సైతం విడుదల చేయనున్నట్లు తెలిసింది. 99.8 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్‌తో కూడిన ఈ కారు పూర్తి చార్జింగ్‌తో 561 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదు. దీని ధర వేరియంట్‌ను బట్టి రూ.90 లక్షల నుంచి రూ.1.20 కోట్ల స్థాయిలో ఉండే అవకాశం ఉంది.

నిస్సాన్ మాగ్నైట్ ఫేస్‌లిఫ్ట్



జపాన్ కార్ల కంపెనీ నిస్సాన్ తన కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ మాగ్నైట్‌లో ఫేస్ లిఫ్ట్ వెర్షన్‌ను వచ్చే నెల 4న మార్కెట్లోకి విడుదల చేయబోతోంది. దేశీయ మార్కెట్లో ప్రస్తుతం అత్యధికంగా అమ్ముడవుతున్న నిస్సాన్ మోడల్ ఇదే. కంపెనీ ఈ కారును సరికొత్త డిజైన్‌తో పాటు అదనపు హంగులతో అందుబాటులోకి తీసుకువస్తోంది. దీని ధరల శ్రేణి రూ.6-11 లక్షల స్థాయిలో ఉండే అవకాశం ఉంది.

బీవైడీ ఈమ్యాక్స్ 7



చైనా ఎలక్ట్రిక్ కార్ల కంపెనీ బీవైడీ తన ప్రీమియం ఎలక్ట్రిక్ ఎంపీవీ మోడల్ 'ఈమ్యాక్స్ 7' కారును వచ్చే నెల 8న భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టనుంది. సంస్థ ఇప్పటికే విక్రయిస్తోన్న ఈ6 మోడల్‌కు ఫేస్‌లిఫ్ట్ వెర్షన్ ఇది. కంపెనీ ఈ కారు ప్రీ-బుకింగ్‌ను సైతం ప్రారంభించింది. రూ.51వేలు చెల్లించి కారును బుక్ చేసుకోవచ్చు. దీని ధరల శ్రేణి రూ.30-32 లక్షల స్థాయిలో ఉండే అవకాశం ఉంది.

మారుతి డిజైర్ ఫేస్ లిఫ్ట్



దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా ఈ దీపావళి సీజన్‌లో 'డిజైర్' ఫేస్ లిఫ్ట్ వెర్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేయనుంది. సరికొత్త లుక్, ప్రీమియం ఇంటీరియర్స్‌తో పాటు హెడ్, టెయిల్ ఎల్‌ఈడీ ల్యాంప్స్, సరికొత్త అల్లాయ్స్, ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, ఆటోమెటిక్ క్లైమెట్ కంట్రోల్, 9 అంగుళాల సైజున్న టచ్ స్క్రీన్‌తో దీన్ని డిజైన్ చేసినట్లు తెలిసింది. దీని ధర రూ.7 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా.

మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ఈవీ



కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ'ను ఇప్పటికే మార్కెట్లో విక్రయిస్తోన్న మహీంద్రా.. ఇందులో ఎలక్ట్రిక్ వెర్షన్‌ను ఈ దీపావళి సీజన్‌లో మార్కెట్లోకి విడుదల చేసేందుకు రెడీ అవుతోంది.

కొత్త తరం బెంజ్ ఈ-క్లాస్



జర్మన్ లగ్జరీ కార్ల దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ భారత మార్కెట్లోకి ఆరో తరం ఈ-క్లాస్ మోడల్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. అక్టోబరు 9న ఈ కారును విడుదల చేసే అవకాశం ఉంది. ఈ-200, ఈ-220డీ వేరియంట్లలో లభించనున్నఈ కారు ధర శ్రేణి రూ.80-90 లక్షల స్థాయిలో ఉండే వీలుంది.

2030 నాటికి రిటైల్ రుణాలు మూడింతలు

ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ రిపోర్టు అంచనా

ముంబై: దేశీయ బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రిటైల రుణాలు 2030 నాటికి మూడింతల స్థాయికి పెరగవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ తాజా రిపోర్టు అంచనా వేసింది. దాంతో కుటుంబాల రుణ భారం 2030-31 ఆర్థిక సంవత్సరం నాటికి 34 శాతానికి పెరగవచ్చని నివేదికలో ప్రస్తావించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) నాటికి ఈ వాటా 23 శాతంగా నమోదైంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- బ్యాంక్‌లతో పోలిస్తే ఎన్‌బీఎఫ్‌సీలు బలమైన రుణ వృద్ధిని కనబర్చనున్నాయి. ఎన్‌బీఎఫ్‌సీ రిటైల్ రుణాలు 14 శాతం చొప్పున వృద్ధి చెందవచ్చు. ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండటం రుణాల తిరిగి చెల్లింపుల సామర్థ్యానికి తోడ్పడనుంది.
- ఫైనాన్స్ కంపెనీల విభాగంలో అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలు సమృద్ధిగా మూలధన నిల్వలు కలిగి ఉన్నాయి. ఈ అంశం వచ్చే రెండేళ్లపాటు రుణ వృద్ధికి తోడ్పడనుంది.
- దేశంలో తనఖా రహిత రిటైల్ రుణాలు అసాధారణ స్థాయిలో వృద్ధి చెందుతుండటం, ఈ విభాగంలో మొండి బకాయిలు కూడా క్రమంగా పెరుగుతుండటంపై ఆర్‌బీఐ ఈ మధ్య ఆందోళన వ్యక్తం చేసింది. భవిష్యత్‌లో ఇది ఆర్థిక సేవల రంగ స్థిరత్వానికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉండటంతో బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఈ విభాగ రుణాల మంజూరుకు సంబంధించిన నిబంధనలను కఠినతరం చేసింది.

క్రెడిట్ కార్డు వ్యయాల వృద్ధి తగ్గుముఖం

దేశంలో క్రెడిట్ కార్డు వ్యయాల వృద్ధి గత మూడు ఆర్థిక సంవత్సరాలుగా తగ్గుముఖం పడుతోంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో క్రెడిట్ కార్డు వ్యయాలు ఏకంగా 54.10 శాతం వృద్ధి చెందగా.. 2022-23లో ఈ వృద్ధి 47.50 శాతానికి తగ్గింది. 2023-24లో 27.80 శాతానికి పరిమితమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) వృద్ధి మరింత తగ్గవచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. 2024-25లో ఇప్పటివరకు వృద్ధి 16.6 శాతంగా నమోదైంది. అయితే, ఏటా పండగ సీజన్ (సెప్టెంబరు-డిసెంబరు)లో క్రెడిట్ కార్డు వ్యయాలు పతాక స్థాయిలో నమోదవుతాయి. ఎందుకంటే, ఈ సీజన్‌లో ఈ-కామర్స్ కంపెనీలు పండగ సేల్‌లో భాగంగా కార్డు ద్వారా కొనుగోలుపై క్యాష్ బ్యాక్‌లు, ప్రత్యేక డిస్కౌంట్‌లు ఆఫర్ చేస్తుండటం ఇందుకు కారణం. కాబట్టి ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి కార్డు వ్యయాల వృద్ధి 20-22 శాతానికి పరిమితం కావచ్చని అంచనా.

తమిళనాడులో టాటా మోటార్స్ ప్లాంట్



రూ.9,000 కోట్ల పెట్టుబడి
ఎస్‌యూవీ, స్పోర్ట్స్ కార్ల తయారీ

రాణిపేట్ (తమిళనాడు): దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్.. స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ), స్పోర్ట్స్ కార్ల కోసం తమిళనాడులో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. చెన్నైకి సమీపంలో పనపాక్కం జిల్లాలో రూ.9,000 కోట్ల పెట్టుబడితో కంపెనీ ఈ ప్లాంట్‌ను నెలకొల్పనుంది. శుక్రవారం నాడు టాటా సన్స్ లిమిటెడ్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌తో కలిసి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శంకుస్థాపన చేశారు. టాటా మోటార్స్‌తో పాటు కంపెనీ బ్రిటిష్ ఆటో విభాగమైన జాగ్వార్ అండ్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్లాంట్‌లో నెక్ట్స్ జెనరేషన్ వాహనాలను ఉత్పత్తి చేయనున్నాయి. దశలవారీగా ఈ ప్లాంట్ పనులను ప్రారంభించి వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని 2.5 లక్షల యూనిట్లకు చేర్చనున్నట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. కంపెనీ పూర్తి స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాన్ని చేపట్టటానికి ఐదు నుంచి ఏడేళ్ల సమయం పట్టే వీలుందని తెలిపింది.

దేశ,విదేశీ మార్కెట్ల కోసం: దేశీయ, విదేశీ మార్కెట్లలో మరింత పట్టును చేజిక్కించుకునేందుకు ఈ ప్లాంట్ ఎంతగానో దోహదపడుతుందని టాటా మోటార్స్ అంచనా వేస్తోంది. ఈ ప్లాంట్‌ను పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరులతో నిర్వహించనున్నట్లు పేర్కొంది. కాగా తమిళనాడు ఇప్పటికే ఆటోమొబైల్ హబ్‌గా ఉందని తాజాగా టాటా మోటార్స్ ఎస్‌యూవీ వాహనాల తయారీకి ముందుకు రావటంతో ఎంతో సంతోషాన్నిస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. ఈ ప్లాంట్ ద్వారా కొత్తగా 5,000 మందికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	126
కర్నూలు	125	నెల్లూరు	126
విశాఖపట్నం	107	అనంతపురం	126
గోదావరి	121		

బ్యాంకుల రుణ పత్రాల బాట: ఇక్రా

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రంగంలో నిధుల కొరత కొనసాగుతోంది. పరపతి డిమాండ్‌కు తగ్గట్టు డిపాజిట్లు పెరగడం లేదు. దీంతో బ్యాంకులు కూడా రుణ పత్రాల (బాండ్స్) బాట పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బ్యాంకులు రికార్డు స్థాయిలో రూ.1.3 లక్షల కోట్లు బాండ్స్ ద్వారా సేకరించే అవకాశం ఉందని ఇక్రా రేటింగ్స్ సంస్థ అంచనా. ఇందులో ఇప్పటికే రూ.76,700 కోట్ల సమీకరణ పూర్తయింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 225 శాతం ఎక్కువ.

పబ్లిక్ ఇష్యూకి కుమార్ ఆర్క్

రూ.740 కోట్ల సమీకరణ లక్ష్యం

న్యూఢిల్లీ: పీవీసీ ఆధారిత బిల్డింగ్ మెటీరియల్ ఉత్పత్తుల తయారీ సంస్థ కుమార్ ఆర్క్ టెక్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా మొత్తం రూ.740 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. ప్రతిపాదిత ఐపీఓలో భాగంగా రూ.240 కోట్లకు కొత్త ఈక్విటీ షేర్లు జారీ చేయనుండగా రూ.500 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) ద్వారా విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది. కాగా ప్రీ-ఐపీఓ ప్లేస్‌మెంట్ రౌండ్ ద్వారా రూ.48 కోట్లు సమీకరిస్తే.. తాజా ఈక్విటీ షేర్ల జారీ చేసే మొత్తం రూ.182.09 కోట్లకు తగ్గుతుందని పేర్కొంది. ఐపీఓ ద్వారా సమీకరించిన మొత్తాలను కంపెనీ అనుబంధ సంస్థ త్రైలాస్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయనున్న కొత్త ప్లాంట్‌కు వినియోగించనుంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,400 ▼	70,950 ▼	1,01,000 ▼
ముంబై	75,640 ▼	69,286 ▼	91,448 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

29వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 78	

స్పోర్ట్స్

ఎక్స్‌ప్రెస్ వేగంతో..



రెండేళ్ల కిందటే ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టిన మయాంక్..ఎక్స్‌ప్రెస్ వేగంతో బంతులు విసురుతూ అబ్బురపరిచాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరపున ఈసారి ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన అతడు..తొలి రెండు మ్యాచ్‌ల్లోనే గంటకు 156 కి.మీ. వేగంతో బౌలింగ్ చేసి బ్యాటర్లను గడగడలాడించాడు. కానీ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండుసార్లు గాయపడడంతో.. టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. లేదంటే టీ20 వరల్డ్ కప్‌నకే మయాంక్ ఎంపికయ్యేవాడని భావించారు. అనంతరం గాయం నుంచి కోలుకున్న యాదవ్‌ను ఇటీవల జాతీయ క్రికెట్ అకాడమీలో జరిగిన ప్రత్యేక శిబిరానికి ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు.

మయాంక్, నితీశ్ వచ్చేశారు



బంగ్లాదేశ్‌తో మూడు టీ20లకు టీమిండియా ఎంపిక

న్యూఢిల్లీ: నిప్పులు చెరిగే బంతులతో బ్యాటర్లలో గుబులు పుట్టిస్తూ ప్రపంచ క్రికెట్‌ను ఆకర్షించిన యువ పేసర్ మయాంక్ యాదవ్‌కు టీమిండియాలో తొలిసారి చోటు దక్కింది. బంగ్లాదేశ్‌తో జరిగే మూడు టీ20లకు శనివారం ఎంపిక చేసిన జట్టులో 22 ఏళ్ల ఢిల్లీ పేస్ సంచలనానికి సెలెక్టర్లు స్థానం కల్పించారు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యం వహించే 15 మంది జట్టులో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యానూ చేర్చారు. గతంలో జింబాబ్వే పర్యటనకు ఎంపికైనా..గాయంతో ఆ టూర్‌ను మిస్సయిన తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి కూడా చోటు నిలబెట్టుకున్నాడు. ఇక పనిభారం రీత్యా గిల్, జైస్వాల్, పంత్, బుమ్రా, సిరాజ్‌లకు విశ్రాంతి ఇచ్చారు. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి మూడు సంవత్సరాల అనంతరం జాతీయ జట్టులో పునరాగమనం చేశాడు. కీపర్, బ్యాటర్ జితేశ్ శర్మకు కూడా స్థానం లభించింది. అయితే సంజూ శాంసన్ ప్రధాన కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తొలి టీ20 వచ్చేనెల ఆరున గ్వాలియర్ జరగనుంది. తొమ్మిదిన న్యూఢిల్లీలో రెండో మ్యాచ్, 12న హైదరాబాద్‌లో ఆఖరి టీ20 జరగనుంది.

భారత జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (కీపర్), రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, జితేశ్ శర్మ (కీపర్), అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, మయాంక్ యాదవ్.

ఆరుగురితో రిటైన్ పాలసీ

ఫ్రాంచైజీ పర్స్ విలువ రూ. 120 కోట్లు
ఆటగాళ్ల మ్యాచ్ ఫీజు రూ. 7.50 లక్షలు
ఇంపాక్ట్ ప్లేయర్ కొనసాగింపు



ఐపీఎల్‌పై పాలకమండలి నిర్ణయాలు

బెంగళూరు: ఐపీఎల్ మెగా వేలం రిటెన్షన్ విధానంపై నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. ప్రతీ జట్టు గరిష్ఠంగా ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవచ్చు. ఇందులో కనీసం ఓ అన్‌క్యాప్డ్ ప్లేయర్ ఉండాల్సిందే. అలాగే వీరందరినీ వేలానికి ముందే అట్టిపెట్టుకోవడమా? రైట్ టు మ్యాచ్ (ఆర్‌టీఎం) ద్వారా తీసుకోవడమా? లేక ఈ రెండు పద్ధతుల ద్వారా కొనసాగించడమా? అనేది ఆయా ఫ్రాంచైజీలదే తుది నిర్ణయం. 2022లో జరిగిన ఆటగాళ్ల వేలంలో నలుగురిని మాత్రమే రిటైన్ చేసుకునే అవకాశం కల్పించారు. అయితే ఫ్రాంచైజీల సూచన మేరకు ఈసారి మెగా వేలంలో మాత్రం అదనంగా మరో ఆటగాడిని చేర్చింది. ఇదిలావుండగా గత సీజన్ నుంచి కొనసాగుతున్న ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను మున్ముందు కూడా అమలు చేయనున్నారు. అంతేకాకుండా.. వేలంలో ఏదైనా జట్టు కొనుగోలు చేసిన ఆటగాడు ఆ తర్వాత తాను లీగ్‌కు అందుబాటులో ఉండలేనని చెబితే మాత్రం అతడిపై రెండు సీజన్ల నిషేధం విధించనున్నారు. శనివారం జరిగిన ఐపీఎల్ పాలక మండలిలో వేలానికి సంబంధించి పలు నిర్ణయాలను తీసుకున్నారు.

సాలరీ క్యాప్ రూ.120 కోట్లు

మెగా వేలంలో పది ఫ్రాంచైజీలు ఆటగాళ్లను కొనుగోలు చేసేందుకు (సాలరీ క్యాప్) ఖర్చు చేసే మొత్తాన్ని కూడా రూ.120 కోట్లకు పెంచారు. నిరుడు మినీ వేలంలో ఈ మొత్తం రూ.100 కోట్లుగా ఉండింది. దీంతో ఈసారి వేలం రాకెట్ వేగంతో దూసుకెళ్లనుందనే అంచనాలున్నాయి.

రిటెన్షన్ ఖర్చు రూ.75 కోట్లు

మరోవైపు రిటెన్షన్ ఆటగాళ్ల మొత్తానికి సంబంధించి కూడా బీసీసీఐ స్పష్టమైన నిబంధన విధించింది. దీని ప్రకారం తొలి రిటెన్షన్ ఆటగాడికి రూ.18 కోట్లు, రెండో ఆటగాడికి రూ.14 కోట్లు, మూడో ఆటగాడికి రూ.11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఏదైనా ఫ్రాంచైజీ మరో ఇద్దరిని కూడా కొనసాగించాలనుకుంటే మాత్రం.. నాలుగో ప్రాధాన్య ప్లేయర్‌కు కూడా రూ.18 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే ఐదో ఆటగాడికి రూ.14 కోట్లు ఇవ్వక తప్పదు. దీన్ని బట్టి రిటెన్షన్ పాలసీని పూర్తి స్థాయిలో వినియోగించుకున్న జట్టు రూ.75 కోట్లు వేలానికి ముందే ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇదంతా కూడా తమ సాలరీ క్యాప్ రూ.120 కోట్ల నుంచి వినియోగించుకోవాల్సి ఉంటుంది. అంటే.. మిగిలిన రూ.45 కోట్లతోనే ఆర్‌టీఎం, ఇతర 15 మంది ప్లేయర్లను కొనుగోలు చేయాలి. దీంతో స్టార్ ఆటగాళ్లతో కూడిన ఆయా ఫ్రాంచైజీలు ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఆటగాళ్లకు అదనపు ఆదాయం

ఐపీఎల్ ఆటగాళ్లకు బీసీసీఐ నుంచి మరో తీపికబురు అందింది. తొలిసారిగా ఈ లీగ్‌లో ఆడే ఆటగాళ్లకు కూడా మ్యాచ్ ఫీజు కింద ప్రతీ మ్యాచ్‌కు రూ.7.50 లక్షలు ఇవ్వనున్నట్టు బోర్డు కార్యదర్శి జైషా ప్రకటించాడు. ఇందు కోసం ప్రతీ ఫ్రాంచైజీకి రూ.12.60 కోట్లను కేటాయిస్తున్నట్టు తెలిపాడు. ఒకవేళ సీజన్‌లో ప్రతీ మ్యాచ్ ఆడిన ప్లేయర్‌కు కోటి 5 లక్షల రూపాయలు అందుకుంటాడు. ఇది తన ఫ్రాంచైజీ అందించే కాంట్రాక్ట్ మొత్తానికి అదనం కానుంది. మరోవైపు వేలంలో తక్కువ ధర పలికి.. మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శన కనబరిచే ఆటగాళ్లకు బోర్డు తాజా నిర్ణయం ఆర్థికంగా లబ్ధి చేకూర్చనుంది.

అన్‌క్యాప్డ్ ప్లేయర్ కూడా..

2021 తర్వాత అన్‌క్యాప్డ్ ప్లేయర్ రూల్‌ను కూడా అమలు చేయనున్నారు. గత ఐదేళ్ల కాలంలో అంతర్జాతీయ క్రికెట్ ఆడని స్వదేశీ ఆటగాడిని ఈ రూల్ కింద పరిగణించవచ్చని పేర్కొంది. అలాగే బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్ కూడా ఉండకూడదు. ఈ రూల్ ప్రకారం ఎంఎస్ ధోనీని సీఎస్‌కే అన్‌క్యాప్డ్ ప్లేయర్ కింద జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. అతడికి కేవలం రూ.4 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది.

ఒక్క బంతీ పడలేదు..



రెండో రోజూ వర్షార్పణం
బంగ్లాతో భారత్ రెండో టెస్టు

కాన్పూర్: తొలిరోజు 35 ఓవర్ల ఆటకు అనుమతించిన వరుణుడు రెండోరోజు శనివారం ఆ కాస్త అవకాశాన్ని కూడా ఇవ్వలేదు. ఉదయం నుంచి కురిసిన వర్షంతో గ్రీన్‌పార్క్ మైదానం చిత్తడిగా మారింది. దీంతో ఒక్క బంతీ పడకుండానే ఆట రద్దయ్యింది. మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి చూసినా గ్రౌండ్ ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. భారత్‌లో 2015 బెంగళూరు టెస్టు తర్వాత ఓ రోజు ఆట పూర్తిగా రద్దు కావడం ఇదే తొలిసారి. ఉదయం పది గంటలకు వర్షం ఆగినా మరో గంట తర్వాత మళ్లీ కురవడంతో కవర్లను అలాగే ఉంచాల్సి వచ్చింది. మధ్యలో సూపర్‌సాపర్లతో నీటిని తోడేసే ప్రయత్నం జరిగినా ఫలితం లేకపోయింది. మధ్యాహ్నం మరోసారి చిరుజల్లులు కురియడంతో 2 గంటలకు అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మూడో రోజు ఆదివారం కూడా వర్షం ఇబ్బంది కలిగించవచ్చు. ఇక ఈ మ్యాచ్‌లో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 107/3 పరుగులతో కొనసాగుతోంది.

నిరంకుశ ఉష!



- ఐఓఏ సభ్యుల ఆరోపణ
- జోక్యం చేసుకోవాలని ఐఓసీకి లేఖ

న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) చీఫ్ పీటీ ఉష, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల మధ్య నడుస్తున్న యుద్ధం కొత్త మలుపు తీసుకుంది. ఐఓఏ వ్యవహారాల్లో పీటీ ఉష నిరంకుశంగా వ్యవహరిస్తోందని 12 మంది ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) సభ్యులు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సీనియర్ అధికారి జెరోమ్ పోయివేకి శుక్రవారం లేఖ రాయడం సంచలనం రేపింది. ఐఓఏను ప్రజాస్వామ్యయుతంగా నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆ సభ్యులు జెరోమ్‌కు రాసిన లేఖలో కోరారు. ఐఓఏ సీఈవో పదవి నుంచి రఘురామ్ అయ్యర్‌ను తొలగించాలని ఈసీ సభ్యులు పట్టుబడుతుండగా..ఉష అందుకు నిరాకరిస్తోంది. ఇదే ఇప్పుడు ఉషపై సభ్యుల తిరుగుబాటుకు ప్రధాన కారణమైంది. ఐఓఏ రాజ్యాంగం ప్రకారమే అయ్యర్‌ను నియమించినట్టు ఉష స్పష్టంజేస్తోంది. అంతేకాదు..అయ్యర్ నియామకానికి ఆమోదం తెలుపుతామని గతంలో జెరోమ్‌కు ఆ 12 మంది ఈసీ సభ్యులు హామీ ఇచ్చిన విషయాన్ని కూడా ఉష గుర్తు చేసింది. ఉషను వ్యతిరేకిస్తున్న వారిలో ఐఓఏ సీనియర్ ఉపాధ్యక్షుడు అజయ్ పటేల్, ఉపాధ్యక్షులు రాజ్యలక్ష్మి దేవ్, గగన్ నారంగ్‌తోపాటు సభ్యులు రోహిత్ రాజ్‌పాల్, డోలా బెనర్జీ, యోగేశ్వర్ దత్ తదితరులున్నారు.

కారు బోల్తా.. క్రికెటర్ ముషీర్‌కు గాయం



- నిలకడగానే ఆరోగ్యం
- మూడు నెలలు ఆటకు దూరం?

లఖ్‌నవూ: ముంబై దేశవాళీ క్రికెటర్, భారత బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సోదరుడు ముషీర్ ఖాన్ (19) రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డాడు. అయితే, ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మంగళవారం నుంచి జరిగే ఇరానీ కప్ మ్యాచ్ కోసం తన తండ్రి నౌషాద్ ఖాన్‌తో కలసి ముషీర్.. ఆజమ్‌ఘర్ నుంచి కారులో బయల్దేరాడు. అయితే, వారు ప్రయాణిస్తున్న వాహనం లఖ్‌నవూ శివార్లలో డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ముషీర్‌కు పెద్దగా గాయాలు కాకపోయినా.. మెడ భాగంలో ఫ్రాక్చరైనట్టు అతనికి చికిత్స అందిస్తున్న మేదాంత ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కోలుకోవడానికి మూడు నెలలు పడుతుందని వెల్లడించాయి. ఫ్రాక్చర్ కావడంతో ఇరానీ కప్‌తోపాటు రంజీ ట్రోఫీ కొన్ని మ్యాచ్‌లకు ముషీర్ దూరం కానున్నాడు. ముషీర్ తండ్రి నౌషాద్ కూడా చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు.

గాయత్రి జోడీకి కాంస్యం



మకావు: తెలుగమ్మాయి పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ జోడీకి మకావు ఓపెన్ సూపర్ 300 టోర్నీలో కాంస్య పతకం సాధించింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో గాయత్రి ద్వయం 17-21, 21-16, 10-21తో చైనీస్ తైపీ జోడీ హిస్సీ షాన్-హంగ్ ఎన్ జు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలై కంచు పతకంతో సరిపెట్టుకుంది.

'శాఫ్' ఫైనల్లో భారత్

థింపూ (భూటాన్): దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 చాంపియన్‌షిప్‌లో భారత్ ఫైనల్ చేరింది. శనివారం జరిగిన సెమీస్‌లో భారత్ 4-2తో నేపాల్‌ను ఓడించింది.

పరాజయం అంచున కివీస్

గాలె: శ్రీలంకతో రెండో టెస్టులో ఫాలోఆన్ ఆడుతున్న న్యూజిలాండ్ ఓటమి దిశగా పయనిస్తోంది. ప్రభాత్ జయసూర్య (6/42) మరోసారి అద్భుత బౌలింగ్‌తో కివీస్ వెన్నువిరిచాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 88 రన్స్‌కే కుప్పకూలింది. ఇక కివీస్ 514 రన్స్ వెనుకంజలో ఉండడంతో లంక జట్టు ప్రత్యర్థిని ఫాలోఆన్ ఆడించింది. మూడోరోజు శనివారం వెలుతురులేమితో ఆట ముగిసేసరికి కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 199/5 స్కోరుతో ఉంది. కివీస్ విజయానికి 315 పరుగుల దూరంలో ఉంది. లంక తొలి ఇన్నింగ్స్‌ను 602/5 వద్ద డిక్లేర్ చేసింది.

నాలుగో వన్డేలో ఆసీస్ చిత్తు

లార్డ్స్: కెప్టెన్ హ్యారీ బ్రూక్ (87), లివింగ్‌స్టోన్ (62 నాటౌట్) మెరుపు అర్ధ శతకాలతో చెలరేగడంతో నాలుగో వన్డేలో ఇంగ్లండ్ 186 పరుగులతో ఆస్ట్రేలియాను చిత్తు చేసింది. వర్షంతో మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. మొదట ఇంగ్లండ్ 312/5తో భారీ స్కోరు చేసింది. ఛేదనలో ఆసీస్ 24.4 ఓవర్లలో 126 రన్స్‌కే కుప్పకూలింది. మాథ్యూ పాట్స్ 4, బ్రైడన్ కార్స్ 3, ఆర్చర్ 2 వికెట్లు తీశారు. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు 2-2తో సమంగా నిలిచాయి.


గాంధీ ఆస్పత్రి మార్చురీ వద్ద హరీశ్, సబిత, కృష్ణారావు

హైడ్రోజన్ బాంబులా హైడ్రా

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులో ఉంటుందని భరోసానిచ్చారు. కాగా, పైసా.. పైసా కూడ బెట్టి ఇళ్లు కొన్నామని.. కూల్చివేతల విషయం తెలిసినప్పటి నుంచి గొంతులో ముద్ద దిగడం లేదని బాధితులు హరీశ్ ముందు గోడు వెళ్లబోసుకుని కన్నీరు పెట్టగా.. హరీశ్ కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. మరోవైపు.. హైడ్రా అధికారుల వేధింపుల కారణంగానే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుందని హరీశ్ రావు ఆరోపించారు. ఇది ఆత్మహత్య కాదని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని ధ్వజమెత్తారు. కూకట్‌పల్లిలో ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ మృతదేహం గాంధీ మార్చురీలో ఉందని తెలుసుకున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, మాధవరపు కృష్ణారావులు ఆస్పత్రికి చేరుకున్నారు. బుచ్చమ్మ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ తన ఇల్లును ఎక్కడ కూల్చివేస్తారనో భయంతోనే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. హైడ్రా భయంతో ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇంకా ఎంత మందిని చంపదలుచుకున్నారని ఆయన ప్రశ్నించారు.

హైడ్రా భయంతోనే బుచ్చమ్మ ఆత్మహత్య: ఈటల



హైదర్‌నగర్/మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): హైడ్రా భయంతో బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకుందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. శనివారం కూకట్‌పల్లి యాదవ బస్తీలోని బుచ్చమ్మ ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులు అర్పించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. బుచ్చమ్మది ఆత్మహత్య కాదని, ముమ్మాటికి రేవంత్ రెడ్డి సర్కార్ చేసిన చర్యల వల్లనే ఆమె చనిపోయిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజలను ఏడిపించి వారి కన్నీళ్లు చూసిసంతోష పడుతున్నారని మండిపడుతున్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో 50 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లను ఖాళీ చేయాలంటూ అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. కాగా, ఇటీవల హైదరాబాద్ శివారు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి నారాయణ చెరువును హైడ్రా బృందం పరిశీలించింది. ఈ నేపథ్యంలో ఆ చెరువును శనివారం ఈటల సందర్శించి.. పరిసరాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడు కోల్పోయిన నిరుపేదల కన్నీళ్లతో సీఎం రేవంత్‌రెడ్డి సైకో ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలపై నుంచి ప్రజల దృష్టిని మళ్లించటానికి హైడ్రా డ్రామాను ప్రారంభించారన్నారు.



ముందుగా పునరావాసం కల్పించాలి

- నిర్వాసితులతో కలిసి ప్రజాభవన్ ఎదుట సీపీఎం ధర్నా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితులకు పునరావాసం కల్పించిన తర్వాతే ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేపట్టాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ నిర్ణయంతో మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు, జీవనాధారం కోల్పోతున్న వారితో కలిసి సీపీఎం నేతలు ప్రజాభవన్ ఎదుట శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ మూసీ ఇరువైపులా 50 మీటర్ల దూరం నుంచి ఉన్న ఇండ్లను కూల్చివేస్తామంటూ నోటీసులివ్వడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పునరావాసం కల్పించకుండా పేదల ఇళ్లను కూల్చివేస్తే ఊరుకోమని ప్రభుత్వానికి స్పష్టం చేశారు. సీపీఎం సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు జీ.విఠల్, ఎం.మీనా మాట్లాడుతూ పేద ప్రజలకు పక్కా ఇల్లు కట్టించి వారికి పని కల్పించిన తర్వాతే మూసీ నది సుందరీకరణ చేపట్టాలని అన్నారు.

ఏళ్లుగా ఎక్కడి వాళ్లు అక్కడే !

- తెలంగాణ ఏర్పాటు నుంచి సచివాలయ ఉద్యోగులకు జరగని బదిలీలు
- గత ప్రభుత్వంలో అమలు కానీ సర్వీసు నిబంధనలు
- కాంగ్రెస్ అధికారం చేపట్టినా మారని పరిస్థితి
- తీవ్ర అసంతృప్తిలో ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు బదిలీలు జరగలేదు. చాలామంది ఉద్యోగులు ఏళ్లుగా ఒకే స్థానానికి పరిమితమైపోయారు. గత పదేళ్లలో తమ మొర ఆలకించిన వారే లేరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ నిబంధనలు, సర్వీస్ రూల్స్ అమలు చేస్తారని ఆశించినా నిరాశే మిగిలిందని ఉద్యోగులు వాపోతున్నారు. అంతేకాక, తమ సమస్యలను విన్నవించుకుందామంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమయం ఇవ్వడం లేదని సహాయ కార్యదర్శి స్థాయి అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అమల్లో ఉన్న సచివాలయ నిబంధనల ప్రకారం ఓ ఉద్యోగి ఒక సెక్షన్‌లో మూడేళ్లకు మించి పని చేయకూడదు. అలాగే ఓ శాఖ పరిధిలో ఆరేళ్లకు మించి ఉంచకుండా బదిలీ చెయ్యాలి. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరగలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఒకట్రెండు సార్లు ఉద్యోగుల వివరాలు సేకరించినా బదిలీలు చేపట్టలేదు. ఇలా నిబంధనలు అమలు చేయకపోవడంతో 25 ఏళ్లుగా ఒకే శాఖలో కొనసాగుతున్న ఉద్యోగులు కూడా ఉన్నారు. ప్రాధాన్యం కలిగిన రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక, వైద్యం, విద్య వంటి శాఖల్లో పని చేసే ఉద్యోగులు ఆయా శాఖల్లో పాతుకుపోయారు. మరికొందరు అప్రాధాన్య శాఖల్లోనే ఉండిపోయారు. ఫోకల్, నాన్‌ఫోకల్ పోస్టుల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించి దీర్ఘకాలంగా నాన్ ఫోకల్‌లో ఉన్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. సమర్థులైన అధికారులు సచివాలయంలోనే ఉన్నా కొందరు ఉన్నతాధికారులు బయటి నుంచి అధికారులను తెచ్చి కీలక బాధ్యతలు అప్పగిస్తుండడంపైనా ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగిని కాలుష్య నియంత్రణ మండలిలో సభ్యుడిగా నియమించి అతన్ని డిప్యుటేషన్‌పై సెక్రటేరియట్‌కు తెచ్చి జీఏడీలో కీలక బాధ్యతలు అప్పగించడంపై ఉద్యోగుల్లో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

ఎవరినీ బలవంతంగా తరలించం

(మొదటిపేజీ తరువాయి)


మీడియాతో మాట్లాడుతున్న దానకిశోర్, రంగనాథ్

కేటాయింపులో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. హైడ్రా అక్రమ కట్టడాలను కూల్చివేస్తుంది తప్ప.. నిరుపేదల ఇళ్లను కాదన్నారు. నగరంలో విపత్తుల నిర్వహణ, ఆస్తుల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాపై సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వ్యతిరేక ప్రచారం జరుగుతుండడం దురదృష్టకరంగా పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితుల తరలింపు, పునరావాసంపై గందరగోళం నెలకొన్న తరుణంలో ప్రభుత్వ ఉద్దేశం, చేపడుతున్న చర్యలపై దాన కిశోర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి సచివాలయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. "10,600 ఇళ్లు నదీ గర్భంలో ఉన్నట్లు గుర్తించాం. వీరికి రూ.30 లక్షల విలువ చేసే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయిస్తున్నాం. అదనపు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.700 కోట్లు మంజూరు చేస్తుంది. నిర్వాసితుల సంక్షేమం, ఉపాధి, వారి పిల్లల చదువులు, ఇతర అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకున్నాం. పట్టా భూములు ఉన్నవారికి భూ సేకరణ చట్టం ప్రకారం చెల్లింపులు చేస్తాం. 3 జిల్లాల కలెక్టర్లు, పురపాలక శాఖ యంత్రాంగం నిర్వాసితుల తరలింపునకు పనిచేస్తున్నారు. 32 ఎన్జీవోలతో కలిసి అధ్యయనం చేస్తున్నాం. మూసీ అభివృద్ధి పనులు 2 నెలల్లో మొదలు పెడతాం. అంతర్జాతీయంగా ఉన్న ప్రముఖ నదుల అభివృద్ధిలో పాలుపంచుకున్న ఏజెన్సీల నుంచి డీపీఆర్‌లు సేకరిస్తున్నాం. వాటి ఆధారంగా టెండర్లు పిలుస్తాం. నిర్వాసితులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రూ.5 వేల కోట్లు ఖర్చు చేస్తాం. నెల రోజుల్లో దీనిపై కార్యాచరణ సిద్ధమవుతుంది. పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి రుణాలిస్తాం" అని దాన కిశోర్ వివరించారు.

ప్రజలు మురికి కూపంలో ఉండకూడదనే..

మూసీ మురికి కూపంలో ఉంటున్న ప్రజల జీవన స్థితిగతులను మార్చేందుకు ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతున్నదని దాన కిశోర్ చెప్పారు. 2026 నాటికి మూసీలో గోదావరి నీరు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మూసీ అభివృద్ధికి రూ.10 వేల కోట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. రూ.3,800 కోట్లతో 970 మిలియన్ లీటర్ల మురుగు నీటి శుభ్రత చేపడుతున్నామన్నారు. 116 ఏళ్ల క్రితం మూసీకి వరద వచ్చినప్పుడు పరివాహక ప్రాంతంలో నష్టపోయినవారి కోసం నిజాం చర్యలు చేపట్టారని గుర్తుచేశారు. మూసీని ప్రపంచ పర్యాటక కేంద్రం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ ప్రక్షాళన చేపడుతున్నారని వివరించారు. పరివాహకంలోని చారిత్రక ఆనవాళ్లను సంరక్షించడంతో పాటు, సంప్రదాయ వ్యాపారాలను ప్రోత్సహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు సంకల్పించారన్నారు. హైదరాబాద్ నగర జనాభా కోటికి పెరిగిందని, ఖైరతాబాద్‌లో 20 నిమిషాల్లో 9 సెం.మీ. వర్షం పడిందని, నగరం అంతా ఇదే స్థాయి వర్షం పడితే ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. మూసీ నదీ అభివృద్ధితో నగరం రూపురేఖలే మారిపోతాయన్నారు. పేదల ఆర్థిక పరిస్థితి మరింత మెరుగవుతుందని పేర్కొన్నారు. 50 కి.మీ మేర మూసీ అభివృద్ధికి ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో 23 ప్రదేశాల్లో ఉన్న ప్రజలను 14 చోట్లకు తరలిస్తున్నామని దాన కిశోర్ తెలిపారు.

నిర్మాణ అనుమతుల మంజూరుకు కొత్త టెక్నాలజీ

మున్సిపాలిటీల్లో నిర్మాణ అనుమతుల మంజూరుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు దాన కిశోర్ తెలిపారు. 3డీ సాంకేతిక పరిజ్ఞానంతో అనుమతులు పొందిన ఇంటిని.. బయటి నుంచే ఇచ్చిన కొలతల ప్రకారం ఉందా లేదా, ఉల్లంఘనలు జరిగాయా అని పరిశీలించే అవకాశం ఉందన్నారు. ఈ సాంకేతికతను రెరాకు ఇస్తున్నామన్నారు. ప్రతి వ్యవస్థలో తప్పులు ఉంటాయని, అలా చేసిన అధికారులను శిక్షిస్తున్నామని చెప్పారు. భవనాల అనుమతులను నిబంధనల ప్రకారమే మంజూరు చేస్తున్నారన్నారు. దుర్గం చెరువు బఫర్ జోన్ విషయంలో కొంత సందిగ్ధత ఉందని, నీటి పారుదల శాఖ అధికారులు నివేదిక రూపొందించి కోర్టుకు అఫిడవిట్ ఇస్తున్నట్లు చెప్పారు. ఉన్నత విద్యావంతులు కూడా ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన అన్ని మ్యాప్‌లను హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, హైడ్రా, రెరా వెబ్‌సైట్లలో పెడుతున్నామన్నారు. ఓఆర్ఆర్ ఆవల ఉన్న 565 చెరువుల్లో 563 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్, 133 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఓఆర్ఆర్ లోపల 2,693 చెరువులకు గాను 2,052 చెరువులకు ప్రిలిమినరీ, 138 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వివరాలన్నీ యాప్ రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. స్థలాలు, ఇళ్లు కొనేవారు ఆ యాప్ ద్వారా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలను తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

తప్పుడు ప్రచారంతోనే బుచ్చమ్మ ఆత్మహత్య

అనధికారిక నిర్మాణాలతో ప్రజలను మోసం చేసిన బిల్డర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు రంగనాథ్ తెలిపారు. ఇందుకు కారకులైన ఎవరినీ వదిలిపెట్టేది లేదన్నారు. కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే మహిళ ఆత్మహత్య బాధాకరంగా పేర్కొన్నారు. తప్పుడు ప్రచారంతో ఆమె భయాందోళనలకు గురై బలవన్మరణానికి పాల్పడిందన్నారు. జొన్వాడ్ ఫాం హౌస్ జీవో 111 పరిధిలో ఉందన్నారు. 111 జీవో హైడ్రా పరిధిలోకి రాదని రంగనాథ్ వివరించారు. అమీన్‌పూర్‌లో భారీగా భూములు అన్యాక్రాంతం అయినట్లు చెప్పారు. సున్నం చెరువులో వెంకటేష్ అనే వ్యక్తి ఆత్మహత్యా యత్నం చేశారని, ఆయన ట్యాంకర్ల వ్యాపారంతో రోజుకు రూ.లక్ష సంపాదిస్తున్నారన్నారు. పేదలను ముందు పెట్టి స్వప్రయోజనాల కోసమే అలా వ్యవహరించినట్లు రంగనాథ్ చెప్పారు. వెంకటేష్ ఇప్పుడు 20 ట్యాంకర్లతో ఇప్పుడు మళ్లీ వ్యాపారం చేస్తున్నాడని తెలిపారు.

హైడ్రా కమిషనర్‌పై ఎన్‌హెచ్‌ఆర్సీ కేసు..

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ)లో కేసు నమోదైంది. హైడ్రా తమ ఇళ్లు కూలుస్తుందన్న భయంతో హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో బుచ్చమ్మ అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. ఇదే విషయమై ఆమె కుటుంబ సభ్యులు ఎన్‌హెచ్‌ఆర్సీని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో 16063/ఐఎన్/224 కింద రంగనాథ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్సీ వెల్లడించింది. కాగా, బుచ్చమ్మ మరణానికి హైడ్రాకు ఎటువంటి సంబంధం లేదని.. ఎవరికీ తాము నోటీసులివ్వలేదని రంగనాథ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే..

అనుమతులున్న వాటిని కూల్చడం లేదు: రంగనాథ్

హెచ్‌ఎండీఏ, మున్సిపాలిటీ, పంచాయతీ నుంచి పక్కాగా అనుమతులున్న భవనాలను కూల్చడం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ కట్టడాల మీద వస్తున్న ఫిర్యాదులపైనే చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాము కూల్చిన భవనాలు వేటికీ అనుమతులు లేవని తెలిపారు. అనుమతులు ఉన్న ఏ భవనం జోలికీ వెళ్లలేదన్నారు. రాత్రికిరాత్రే వెళ్లి ఎవరి ఇంటిని కూల్చడం లేదని.. ముందస్తు సమాచారం ఇచ్చిన తరువాతనే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో అపోహలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. నిజమైన పేదలకు హైడ్రాతో అన్యాయం జరగదన్నారు. ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేసినా.. దాని పక్కన ఉన్న పేదల నివాసాల జోలికి వెళ్లని సంగతిని గుర్తుచేశారు.

విద్యా సంవత్సరం ముగిశాక కాలేజీలపై చర్యలు

ఒవైసీ, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన కళాశాలలపై ఫిర్యాదులు వచ్చాయని.. పిల్లలు విద్యా సంవత్సరం నష్టపోతారనే వాటిపైన చర్యలు తీసుకోలేదని రంగనాథ్ పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ముగిశాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు ప్రైవేటు సర్వే నంబరుతో అనుమతులు తీసుకుని నిర్మాణాలను మాత్రం ప్రభుత్వ సర్వే నంబర్లలో చేస్తున్నట్లు చెప్పారు. దుండిగల్‌లో పాత తేదీలతో పంచాయతీ కార్యదర్శి అనుమతులు పొందారని తెలిపారు. ఇలాంటి కేసుల్లో చర్యలు తీసుకుంటున్నామన్నారు. " అమీన్‌పూర్‌లో ఓ ఆస్పత్రిలో రోగులు ఉండగా కూల్చామని చెప్పడం అవాస్తవం. మూడుసార్లు హెచ్చరికలు చేసినా మళ్లీ మళ్లీ నిర్మాణాలు చేస్తుండడంతో హైడ్రా ఏర్పాటయ్యాక నేలమట్టం చేశాం. ఆ సమయంలో వీడియో తీశాం. అక్కడ రోగులు ఎవరూ లేరు. ఆస్పత్రి పేరుతో అక్రమ కట్టడం తప్ప ఆ భవనంలో ఆస్పత్రి లేదు. పేదలను ముందుపెట్టి కొందరు పెద్దలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని తెలిపారు. హైడ్రాను ఓ బూచీగా చూపి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని.. హైడ్రా భరోసా మాత్రమేనని తేల్చి చెప్పారు. వరదలు, విపత్తుల నుంచి హైదరాబాద్‌ను కాపాడి, భవిష్యత్తులో సమస్యలు లేకుండా చూసేందుకే హైడ్రా చర్యలు చేపట్టిందన్నారు. విపత్తుల నిర్వహణతో పాటు ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ చర్యలు చేపడుతుందే తప్ప పేదల నివాసాలను కూల్చేందుకు కాదన్నారు. అధిక శాతం మీడియా పూర్తి సహకారం అందిస్తున్నా.. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారంతో లేనిపోని అపోహలు కల్పిస్తున్నారని తెలిపారు.

ఇప్పుడు కాకుంటే మరెప్పటికీ కాపాడుకోలేం

ముందుగా సమాచారం ఇచ్చినా కొందరు ఖాళీ చేయడం లేదని.. తగిన సమయం ఇచ్చాకే ఆక్రమణలను నేలమట్టం చేస్తున్నట్లు రంగనాథ్ పేర్కొన్నారు. పేదలు మధ్య తరగతి వారు చెరువులను ఆక్రమించరని.. అక్రమ కట్టడాల వెనుక పెద్దలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాను తీసుకొచ్చారని.. చెరువులు, నాలాలను కబ్జా చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఇప్పుడు కాకుంటే వాటిని మరెప్పటికీ కాపాడుకోలేమని తేల్చి చెప్పారు. జొన్వాడ్ ఫాం హౌస్ జీవో 111 పరిధిలో ఉందన్నారు. 111 జీవో హైడ్రా పరిధిలోకి రాదని రంగనాథ్ వివరించారు.

భావితరాల భవిష్యత్తు కోసమే హైడ్రా

- రేవంత్‌కు పేరొస్తుందన్న భయంతోనే ప్రతిపక్షాల రాద్ధాంతం: ఎంపీ చామల

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తు కోసమే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేశారని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. హైడ్రా వల్ల రేవంత్‌కు మంచి పేరు వస్తుందన్న భయంతోనే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ భవిష్యత్తు గురించి ఆ పార్టీలు ఆలోచన చేయడం లేదన్నారు. గత పదేళ్లలో రాజకీయ అండదండలతో కబ్జాలు చేసిన నాయకులే హైడ్రాను వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా వరదలతో ఇబ్బందులు పడుతున్న హైదరాబాద్ ప్రజలకు పరిష్కారం చూపాలన్నదే సీఎం రేవంత్ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్‌లో నాలాల మీద, చెరువుల స్థలాల్లో 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని, వాటిని కూల్చేస్తే తప్ప హైదరాబాద్ మనుగడ సాగించలేదని, మీడియాతో పాటు ప్రజలు కూల్చివేతలకు సహకరించాలని.. నాడు సీఎం హోదాలో కేసీఆర్ మాట్లాడారని గుర్తు చేశారు. ఆ రోజు కేసీఆర్ చేయలేని పని నేడు సీఎం రేవంత్ చేస్తున్నారని తెలిపారు.

మూసీ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లా?

హైడ్రా బాధితులకు అండగా ఉంటాం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతుల తలరాతను మార్చిన కాళేశ్వరం ప్రాజెక్టుకు తమ ప్రభుత్వం రూ.80 వేల కోట్లు ఖర్చు చేస్తే గల్లీ నుంచి ఢిల్లీ దాకా కాంగ్రెస్ గగ్గోలు పెట్టిందని.. ఇప్పుడు మూసీ సుందరీకరణకు రూ.లక్షా 50 వేల కోట్లు ఎలా ఖర్చు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. "మూసీని అందంగా ముస్తాబు చేసేందుకు రూ.50 వేల కోట్లు అవుతుందని మొన్న ప్రకటించారు. నిన్న రూ.70 వేల కోట్లు వెచ్చిస్తామన్నారు. నేడు ఏకంగా రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని అంటున్నారు. ఇంతకీ మూసీ ప్రాజెక్టుతో మురిసే రైతులు ఎంత మంది? నిల్వ ఉంచే టీఎంసీలెన్ని? సాగులోకి వచ్చే ఎకరాలెన్ని? పెరిగే పంటల దిగుబడి ఎంత?" అని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హైడ్రా బాధితులకు అండగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేలు, పార్టీ న్యాయ విభాగం అండగా ఉంటుందని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా తెలిపారు.

రేవంత్ శాఖలో ఇసుక దొంగలు..

నకిలీ డాక్యుమెంట్లు, రసీదులు పుట్టించి తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.150 కోట్ల విలువ చేసే 1,50,000 టన్నుల ఇసుకను దోచేశారని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అవసరాల కోసమని తప్పుడు కాగితాలు సృష్టించి ఇంటి దొంగలు ఇసుకను దారి మళ్లించారని విమర్శించారు. సాక్షాత్తు రేవంత్ రెడ్డి శాఖలోనే జరిగిన ఈ కుంభకోణం ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా జరగదన్నారు. ఇసుక దొంగలెవరో దర్యాప్తు జరిపించి, కఠిన చర్యలు తీసుకోవాలని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా డిమాండ్ చేశారు.

మూసీలో మార్కింగ్ నిలిపివేత

- ఆందోళనల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు వెనక్కు
- కఠినంగా వ్యవహరించొద్దు: ప్రభుత్వం


మలక్‌పేట్ శంకర్‌పల్లిలో ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలు ఇస్తున్న రెవెన్యూ అధికారులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ఉంటున్న తమను ఒక్కసారిగా వెళ్లమనడంపై స్థానికులు నిలదీస్తుండడం, వాగ్వాదాలు, ఘర్షణలకు దిగుతుండడంతో మూసీ నదీ గర్భం (రివర్ బెడ్)లో రెవెన్యూ అధికారులు మార్కింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ చర్య తీసుకున్నారు. మరోవైపు శనివారం నిర్వాసితులతో చర్చలు జరిపారు. మూసీ పక్కన ఇబ్బందులు పడే కంటే.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ప్రశాంతంగా ఉండాలని సూచించారు. డబుల్ బెడ్ రూం ఇంటి విలువ రూ.30 లక్షలకు పైగానే ఉంటుందని చెబుతున్నారు. వీటి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తామని, ఇందుకోసం క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లను పంపిస్తున్నారు. సానుకూలత వ్యక్తం చేసినవారిని వెంటనే తరలించారు. కాగా, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి హిమాయత్‌నగర్ మండలం వినాయక వీధి (రసూల్‌పూర), శంకర్‌నగర్‌లో స్థానికులతో మాట్లాడారు. 151 కుటుంబాలను పిల్లి గుడిసెలు, జియాగూడకు తరలిస్తామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 55 కిలోమీటర్ల మేర మూసీ పరివాహకం ఉంది. నదీ గర్భంతో పాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో 12,184 అక్రమ కట్టడాలున్నట్లు గుర్తించారు. హైదరాబాద్ జిల్లాలో 1,595, మేడ్చల్‌లో 239, రంగారెడ్డిలో 332 నిర్మాణాలు నదీ గర్భంలో ఉన్నట్లు తేల్చారు. రెవెన్యూ అధికారులు గురు, శుక్రవారాల్లో హైదరాబాద్‌లో 1,485 నిర్మాణాలకు మార్కింగ్ చేశారు. జియాగూడ, నాంపల్లిలో 110 నివాసాలకు మార్కింగ్ చేయాల్సి ఉంది.

లాటరీ ద్వారా ఇళ్ల కేటాయింపు

నిర్వాసితులను మలక్‌పేట్ నియోజకవర్గం పిల్లి గుడిసెలు, జియాగూడ, జంగంమెట్, ప్రతాప్‌సింగారం, కొల్లూరు, ముషీరాబాద్ సాయిచరణ్ కాలనీ, జూబ్లీహిల్స్ కమలానగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తరలించాలని నిర్ణయించారు. 85 కుటుంబాలను పిల్లి గుడిసెలు, జియాగూడకు తీసుకెళ్లారు. అధికారులు లాటరీ వేసి ఇళ్లు కేటాయిస్తున్నారు. అక్కడికక్కడే ఇంటి ధ్రువపత్రంతో పాటు తాళం అందజేస్తున్నారు. కాగా, వినాయక్‌నగర్, శంకర్‌నగర్ ప్రాంతాల్లో సోమవారంలోగా ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పూర్తిగా ఖాళీ చేసిన చోట.. కూల్చివేతలు చేపట్టే అవకాశాలున్నాయి.

నచ్చచెప్పి.. బుజ్జగించి.. ఒప్పించాలి: ప్రభుత్వం

మూసీ అభివృద్ధి ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు నదీ గర్భం, బఫర్ జోన్‌లో ఉన్న ఇళ్లు, గోదాంలు, షెడ్లను తొలగించడమే కీలకం. దాదాపు 15 వేల కుటుంబాలను ఇళ్లు ఖాళీ చేసేలా బుజ్జగించి ఒప్పించాలని.. ఎట్టి పరిస్థితుల్లోనూ కఠినంగా వ్యవహరించొద్దని అధికారులు, పోలీసులకు ఉన్నత స్థాయిలో ఆదేశాలు అందాయి. నిర్వాసితులు దూషించినా లోనైనా ఆగ్రహావేశాలకు గురికావొద్దని చెప్పినట్లు తెలిసింది. కాగా, హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో అక్రమ నిర్మాణాల్లో 300కు పైగా భారీవని తేల్చారు. నదీ సరిహద్దు నుంచి రెండువైపులా 50 మీటర్లు వరకు ఉన్న నిర్మాణాలను బఫర్ జోన్ కింద గుర్తించారు. ఇవి 8 వేలపైగా (1,032 భారీ) ఉండగా, ఎఫ్‌టీఎల్‌లో 3,004 అక్రమ కట్టడాలున్నట్లు నిర్ధారించారు. నదీ గర్భంలోని 2,166 ఇళ్లను ఖాళీ చేయించాకే బఫర్ జోన్ జోలికి వెళ్లాలని నిర్ణయించారు. ఈ క్రమంలో వారిని ఒప్పించి, మెప్పించాకే ఖాళీ చేయించాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలిచ్చింది. సుదూర ప్రాంతాల్లో అయితే ఉపాధికి ఇబ్బందులు ఎదురవుతాయని భావించి డబుల్ బెడ్ రూం ఇళ్లను స్థానికంగానే ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. అర్హులైనవారికి సంక్షేమ పథకాలను అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. రేషన్ కార్డు లేకుంటే తొలి ప్రాధాన్యంగా దానిని మంజూరు చేయనున్నారు. నిర్వాసితులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్లకు అనుసంధానం చేయనున్నారు. ప్రతి కుటుంబం జీవనోపాధిపై సర్వే నిర్వహిస్తున్నారు. పిల్లలను ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో చేర్పించేందుకు నిర్ణయించారు.

హైడ్రా కొరివితో కాంగ్రెస్ తల గోక్కుంటోంది

- మూసీ ప్రక్షాళన, హైడ్రా, ఆరు గ్యారెంటీలే ఆ పార్టీ కొంపముంచుతాయి
- జగన్ అబ్దుల్ కలాం కంటే తోపా? రాష్ట్రపతి హోదాలోనే డిక్లరేషన్ ఇచ్చారు
- జగన్ తీరు చూస్తుంటే లడ్డూను కల్తీ చేసినట్టే ఉంది: బండి సంజయ్



నార్సింగ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైడ్రా అనే కొరివితో కాంగ్రెస్ పార్టీ తల గోక్కుంటోందని బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. హైడ్రా కూల్చివేతలతో ప్రజల కన్నీళ్లు, ఆర్తనాదాలు మీకు గుర్తుకు రావడం లేదా? ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో మళ్లీ పేదల ఇళ్లను కూల్చేందుకు సిద్ధమయ్యారా? అని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన పేరుతో ఇళ్లు కూల్చడం, ఆరు గ్యారెంటీలు అమలు చేయలేకపోవడం, మాజీ సర్పంచులకు బిల్లుల బకాయిలే కాంగ్రెస్ కొంపముంచుతాయన్నారు. కూల్చివేతలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం తీరుకు నిరసనగా త్వరలో చలో హైదరాబాద్ మార్చ్ నిర్వహిస్తామని ప్రకటించారు. బండ్లగూడ జాగీర్‌లో శ్రీ విద్యారణ్య నూతన భవన సముదాయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మూసీ సుందరీకరణ పేరుతో మూసీ చుట్టు పక్కల ఉన్న పేద హిందువుల ఇళ్లను కూల్చివేసేందుకు కాంగ్రెస్ సిద్ధమైందని ఆరోపించారు. మలక్‌పేట రేసు కోర్సు నుంచి ముసారాంబాగ్ వరకు మూసీ స్థలాలను ఓవైసీ అనుచరులు కబ్జాలు చేశారని, వాటిని టచ్ చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. కాగా తిరుమల డిక్లరేషన్ అంశంపై ఏపీ మాజీ సీఎం జగన్ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని బండి సంజయ్ ధ్వజమెత్తారు. హిందూయేతరులు తిరుమలకు వస్తే డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధన ఎప్పట్నుంచో అమల్లో ఉందని, కొత్తగా కనిపెట్టిందేమీ కాదన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం రాష్ట్రపతి హోదాలో తిరుమల వెంకన్న స్వామిని దర్శించుకునేందుకు వచ్చి డిక్లరేషన్ సమర్పించారని, అబ్దుల్ కలాం కంటే జగన్ ఎక్కువా? అని ప్రశ్నించారు. గతంలో జగన్ హిందువుల ఓట్ల కోసమే తిరుమల వెళ్లినట్లు అనిపిస్తోందన్నారు. జగన్ తీరు చూస్తుంటే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగినట్లు అనిపిస్తోందన్నారు. దళితులకు తిరుమలలో అన్యాయం జరుగుతోందని ఆయన చెప్పడం సిగ్గుచేటన్నారు. దళితులను అడ్డుపెట్టుకొని జగన్ రాజకీయాలు చేయాలని చూస్తున్నారని.. ఆయన తీరు ముమ్మాటికీ హిందూత్వపై జరుగుతున్న దాడిలో భాగమేనన్నారు.

హరీశ్‌రావు మల్లన్నసాగర్ ముంపు బాధితులనూ ఓదార్చు!

» త్వరలోనే టీపీసీసీ కార్యవర్గ విస్తరణ: మహేశ్ గౌడ్



హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితులను పరామర్శించిన హరీశ్‌రావు.. మల్లన్నసాగర్ ముంపు బాధితులనూ ఓదార్చాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సూచించారు. ఇన్నాళ్లుగా వారి బాధలు హరీశ్‌కు కనిపించడంలేదా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మల్లన్నసాగర్ నిర్వాసితులను కలిసేందుకు తాము వెళితే అప్పటి ప్రభుత్వం అరెస్టులు చేసిందని చెప్పారు. హైడ్రా కార్యకలాపాలు, మూసీ అభివృద్ధితో సామాన్యులకు కొంత ఇబ్బంది కలిగినా మొత్తంగా హైదరాబాద్‌కు లాభమే జరగుతుందని అన్నారు. మూసీ ప్రక్షాళన జరిగితే కింద ఉన్న రెండు జిల్లాలకు సాగునీరు పెరుగుతుందని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేల చేరికతో స్థానికంగా పార్టీ నేతలు ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమేనని, అయితే కొత్త, పాత నేతల మధ్య సమన్వయం తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే టీపీసీసీ కార్యవర్గ విస్తరణ ఉంటుందని, ముగ్గురి నుంచి ఐదుగురి వరకు కార్యనిర్వాహక అధ్యక్షులు ఉండే అవకాశం ఉందని అన్నారు. డీసీసీ అధ్యక్ష బాధ్యతలను ఎమ్మెల్యేలకు ఇవ్వాలన్న ప్రతిపాదనా ఉందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి బీసీలకు ఎక్కువ సీట్లు ఇస్తామని తెలిపారు. ఏఐసీసీ పెద్దలు ప్రస్తుతం 5 రాష్ట్రాల ఎన్నికల బిజీలో ఉన్నారని, త్వరలోనే వారిని వెళ్లి కలుస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు.

దసరాలోపు గురుకుల పీఈటీ పోస్టుల భర్తీ

తెలంగాణ గురుకుల నోటిఫికేషన్ -2017కు సంబంధించి 616 పీఈటీ పోస్టుల భర్తీని దసరాలోపు పూర్తయ్యేలా చూస్తానని అభ్యర్థులకు టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ హామీఇచ్చారు. గాంధీభవన్‌లో శనివారం మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన ఉద్యోగార్థులు.. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని కోరగా.. ఆయన ఈమేరకు హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్!

» మంత్రివర్గ ఉపసంఘం యోచన

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం యోచిస్తోంది. ఎస్సీ వర్గీకరణపై సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం శనివారం సమావేశమయింది. పంజాబ్, హరియాణా, తమిళనాడు రాష్ట్రాల్లో వర్గీకరణ అమలుకు ముందు ఏకసభ్య కమిషన్ ఏర్పాటు అయిన విషయంపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి ఏకసభ్య కమిషన్ అంశాన్ని నివేదించాలని యోచిస్తున్నట్లు సమాచారం. 2011 నాటి జనాభా లెక్కలను ప్రామాణికం చేసుకొని ఎస్సీ వర్గీకరణ చేయాలని సిఫారసు చేయనున్నట్లు తెలిసింది. ఇక 1999 నుంచి 2004 దాకా ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కాగా... ఆ కాలంలో ఏమేరకు ఉప కులాలకు లబ్ధి జరిగిందనే అంశంపై ఉపసంఘం చర్చించింది.

బియ్యం ఎగుమతులపై ఆంక్షల ఎత్తివేత హర్షణీయం: కిసాన్ కాంగ్రెస్

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : విదేశాలకు బియ్యం ఎగుమతులపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయడం పట్ల కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రతిపాదిస్తూ కాంగ్రెస్ పార్టీ కేంద్రానికి గతంలోనే వినతిపత్రాలు అందజేసిందన్నారు. రైతులు తొందర పడి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవద్దని, మంచి ధరలు వచ్చే వరకు వేచి చూడాలని సూచన చేశారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

వరద బాధితులకు చేయూతనిద్దాం

» తెలంగాణ, ఏపీలకు ఆర్థిక భరోసా కల్పిద్దాం

» ఎస్సీఏవోఆర్ఏ వెల్ఫేర్ మేనేజింగ్ ట్రస్టీ సిద్ధార్థ్ లూథ్రా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితులకు చేయూతనిద్దామని సుప్రీం కోర్టు అడ్వకేట్ ఆన్ రికార్డ్ అసోసియేషన్ (ఎస్సీఏవోఆర్ఏ) వెల్ఫేర్ మేనేజింగ్ ట్రస్టీ, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా సభ్యులను కోరారు. ఈ మేరకు శనివారం వారిని ఉద్దేశించి లేఖ రాశారు. తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు చేపడుతున్న సహాయక చర్యలకు మద్దతుగా నిలిచేందుకు సహకరించాలని ట్రస్టు సభ్యులకు పిలుపునిచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక మంది ఇళ్లు, జీవనోపాధి కోల్పోయారని పేర్కొన్నారు. ట్రస్టుకు లేదా రెండు రాష్ట్రాల సీఎం సహాయ నిధికి సభ్యులు ఆర్థిక సాయం చేయవచ్చని సిద్ధార్థ్ లూథ్రా స్పష్టం చేశారు.

డీఐజీ, నలుగురు రిజిస్ట్రార్ల బదిలీ

హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ఒక డీఐజీ, నలుగురు జిల్లా రిజిస్ట్రార్లను శనివారం బదిలీ చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. బదిలీల్లో అక్రమాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఘాటుగా స్పందించారు. ఈ నేపథ్యంలో ఆ శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్ తాజా బదిలీలు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రిజిస్ట్రార్ జీ స్థితప్రజ్ఞను కరీంనగర్ 'ఎంవీ అండ్ ఆడిట్‌'కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్‌ను నియమించారు. వరంగల్ ఎంవీ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ ఫణిధర్‌ను అదే జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. హైదరాబాద్ సౌత్ జిల్లా రిజిస్ట్రార్ రవీంద్రరావును ఆదిలాబాద్‌కు, వరంగల్ డీఐజీ సుభాషిణిని అదే జిల్లాలో ఎంవీ అండ్ ఆడిట్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు.

నిండుతున్న శ్రీశైలం!

» 84.61 %కి చేరిన నీటి నిల్వ

» జూరాలకు 1.33 లక్షల క్యూసెక్కుల రాక

» శ్రీపాద ఎల్లంపల్లికి 1.29 లక్షల ఇన్‌ఫ్లో



హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. కొన్ని రోజులుగా సాగు, జలవిద్యుత్ అవసరాలకు అడ్డదిడ్డంగా నీటిని ఇరు రాష్ట్రాలు తరలించడంతో రిజర్వాయర్‌లో నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. నాలుగు రోజులుగా ఎగువ నుంచి వరద క్రమంగా పెరుగుతుండటంతో జలాశయం పూర్తి స్థాయి సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా... ప్రస్తుతం 182.6 టీఎంసీలకు(84.61 శాతం) చేరింది. శనివారం జలాశయానికి 1.62 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరగా... జల విద్యుదుత్పాదనతో పాటు పోతిరెడ్డిపాడు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల ద్వారా 44వేల క్యూసెక్కులను వదిలిపెట్టారు. ఇక, నాగార్జున సాగర్‌కు 43వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... వచ్చింది వచ్చినట్లే జలవిద్యుత్ చేసి, దిగువకు వదులుతున్నారు. పులిచింతలకు 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... 26వేలను దిగువకు వదిలిపెట్టారు. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 42వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా...దిగువకు 40వేలను వదిలిపెట్టారు. నారాయణపూర్ జలాశయానికి 43వేల క్యూసెక్కులు వస్తుండగా...ఔట్‌ఫ్లో 42వేలుగా ఉంది. జూరాల జలాశయానికి 1.33లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా... 1.38 లక్షల ఔట్‌ఫ్లో రికార్డయింది. తుంగభద్ర జలాశయానికి 22 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... 14వేలను దిగువకు వదిలిపెట్టారు. ఇక, గోదావరి బేసిన్‌లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 1.29లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. 1.32లక్షలను దిగువకు వదిలిపెట్టారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 56వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... ఔట్‌ఫ్లో కూడా అంతే ఉంది.

ఫ్యామిలీ కార్డులో యజమానిగా మహిళ

(మొదటిపేజీ తరువాయి)

లేదన్నారు. కాగా, ఫ్యామిలీ డిజిటల్ కార్డులపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం ఇటీవలే రాజస్థాన్, హరియాణా, కర్ణాటక, మహారాష్ట్రలో పర్యటించింది. ఆయా రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై ఈ సందర్భంగా అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం డిజిటల్ కార్డుల రూపకల్పనపై అధికారులకు సీఎం పలు ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. కార్డుల్లో పొందుపరచాల్సిన వివరాలను నివేదిక రూపంలో ఆదివారం సాయంత్రంలోగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహతో కూడిన మంత్రివర్గ ఉపసంఘానికి అందజేయాలని ఆదేశించారు. ఉపసంఘం సూచనల మేరకు అందులో జత చేయాల్సిన, తొలగించాల్సిన అంశాలతో సమగ్ర జాబితా రూపొందించాలన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన..

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల అమలుకు రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలోనూ రెండు ప్రాంతాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఒక గ్రామీణ, ఒక పట్టణ ప్రాంతాన్ని ఎంపిక చేయాలని, పూర్తిగా గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లోనైతే రెండు గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పూర్తిగా నగర, పట్టణ ప్రాంతాలున్న నియోజకవర్గాల్లో రెండు వార్డులు, డివిజన్లను ఎంపిక చేయాలన్నారు. కుటుంబాల నిర్ధారణ, డిజిటల్ కార్డుల వివరాలకు సంబంధించి అందుబాటులో ఉన్న డేటా ఆధారంగా క్షేత్ర స్థాయి పరిశీలన చేయించాలని అధికారులను ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో అక్టోబరు 3నుంచి ఈ పరిశీలన చేయించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గానికీ ఆర్డీవో స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించాలని సూచించారు. నగర, పట్టణ ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలన్నారు. క్షేత్ర స్థాయి పరిశీలన కచ్చితత్వంతో చేపట్టాలని, ఎటువంటి లోపాలకు తావులేకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కేబీఆర్ చుట్టూ ట్రాఫిక్ ఫ్రీ!

పార్క్ చుట్టూ అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు.. సిగ్నళ్లు, యూటర్న్‌లు లేకుండా చర్యలు

» రూ.826 కోట్లతో ఆరు జంక్షన్ల అభివృద్ధి

» పాలనాపరమైన అనుమతులిచ్చిన సర్కార్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలోని కాసు బ్రహ్మానంద రెడ్డి (కేబీఆర్) పార్కు చుట్టూ ఉన్న జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలకు త్వరలో చెక్ పడనుంది. ఈ జంక్షన్లను సిగ్నల్ ఫ్రీగా మార్చేందుకు యూటర్న్‌లు కాకుండా.. అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణం ద్వారా సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేబీఆర్ పార్కు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు ఇకపై ఎలాంటి యూటర్న్‌లు లేకుండా రయ్యుమంటూ దూసుకెళ్లే విధంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనుంది. ఈ మేరకు పార్కు చుట్టూ ఉన్న ఆరు జంక్షన్లను రూ.826కోట్లతో అభివృద్ధి చేయనుంది. ఇందుకు సంబంధించి నిధులను సీఎం మంజూరు చేశారు. పాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. ఆరు జంక్షన్లను హెచ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించడంతోపాటు డిజైన్లను సైతం రూపొందించారు. త్వరలోనే జంక్షన్ల అభివృద్ధి పనులను పట్టాలెక్కించనున్నారు. ఆరు జంక్షన్లను 2దశల్లో చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

నగరం నడిబొడ్డుగా మారిన కేబీఆర్ పార్కు...

ఒకప్పుడు హైదరాబాద్ మహా నగరానికి సుదూరంగా.. కొండలు, గుట్టల మధ్యన ఉన్న కేబీఆర్ పార్కు ప్రస్తుతం నగర నడిబొడ్డుగా మారింది. నగరంలోని ముఖ్య ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ పార్కు నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్.. ఇలా ఆయా ప్రాంతాలను అనుసంధానం చేసే ముఖ్యమైన రోడ్లన్నీ కేబీఆర్ పార్కు నుంచే ఉన్నాయి. దాంతోపాటు కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, కృష్ణానగర్ తదితర ప్రాంతాలన్నీ వ్యాపార, వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందాయి. ఐటీ, సినీ, రాజకీయ వంటి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులంతా ఈ ప్రాంతంలోనే నివాసముంటారు. ఇలా అనేక ప్రాంతాలకు అనుసంధానమైన కేబీఆర్ పార్కు చుట్టురా రోడ్లు ఏ సమయంలోనైనా రద్దీగా ఉంటాయి. జంక్షన్లలో కిలోమీటర్ మేర వాహనాలు బారులు తీరుతాయి. దీంతో ఈ సమస్యకు పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



కేబీఆర్ పార్క్, ఫ్లై ఓవర్, ఫిలింనగర్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ డిజైన్

పార్కుకు ఇబ్బందుల్లేకుండా..

హైదరాబాద్ మహా నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటికే అనేక జంక్షన్లను సిగ్నల్ ఫ్రీగా మార్చారు. అయితే కేబీఆర్ పార్కును సిగ్నల్ ఫ్రీగా మార్చడం ఎంతో సవాళ్లతో కూడుకున్నదిగా మారింది. ఇందుకోసం గత ప్రభుత్వంలో కొన్ని డిజైన్లు రూపొందించగా.. అవి కేబీఆర్ పార్కును ధ్వంసం చేసేవిధంగా ఉన్నాయంటూ పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్‌ను కూడా ఆశ్రయించారు. ఈ పరిస్థితుల్లో కేబీఆర్ పార్కుకు ఇబ్బంది కలగకుండా ప్రస్తుతమున్న రోడ్లలోనే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేలా డిజైన్లు రూపొందించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ఎక్కడా సిగ్నల్ ఉండకుండా, ట్రాఫిక్ అంతరాయం లేకుండా డిజైన్ చేశారు. ప్రస్తుతమున్న ఆరు జంక్షన్లలో కుడి వైపు మార్గంలో(సవ్య దిశలో) అండర్‌పాస్‌లను నిర్మించనున్నారు. ఎడమ వైపు మార్గంలో (అపసవ్య దిశలో) ఫ్లైఓవర్లను నిర్మించనున్నారు. వర్షాకాలంలో అండర్‌పాస్‌లలోకి వర్షపునీరు వచ్చినా.. అవి లేకుండా చేసేలా నిర్మాణాల డిజైన్లను రూపొందించారు.

రూ.421 కోట్లతో ప్యాకేజీ-1లో..

జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్	1. రోడ్డు నెం.45 నుంచి కేబీఆర్ పార్కు, యూసఫ్‌గూడ వైపు వై ఆకారంలో అండర్‌పాస్ 2. కేబీఆర్ పార్కు ప్రవేశం నుంచి రోడ్డు నెం.36 వరకు నాలుగు లైన్ల ఫ్లైఓవర్ 3. యూసఫ్‌గూడ వైపు నుంచి రోడ్డు నెం.45 జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్
కేబీఆర్ ఎంట్రెన్స్ ముగ్ధ జంక్షన్	1. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ వరకు 2 లేన్ల అండర్‌పాస్ 2. పంజాగుట్ట వైపు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మూడు లేన్ల ఫ్లైఓవర్ 3. కేబీఆర్ ఎంట్రెన్స్ జంక్షన్ నుంచి పంజాగుట్ట వైపు మూడు లేన్ల అండర్ పాస్

రూ.40 5కోట్లతో ప్యాకేజీ-2లో..

రోడ్ నెం.45 జంక్షన్	1. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు వరకు అండర్ పాస్ 2. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్ నెంబర్-45 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్
ఫిలింనగర్ జంక్షన్	1. అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్ నెం.45 జంక్షన్ వరకు 2 లైన్ల అండర్‌పాస్ 2. ఫిలింనగర్ జంక్షన్ నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్
మహారాజా అగ్రసేన్ జంక్షన్	1. క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ నుంచి ఫిలింనగర్ జంక్షన్ వరకు అండర్ పాస్ 2. ఫిలింనగర్ జంక్షన్ నుంచి రోడ్ నెంబర్-12 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్
క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్	1. కేబీఆర్ పార్కు నుంచి అగ్రసేన్ జంక్షన్ వరకు రెండు లైన్ల అండర్ పాస్ 2. అగ్రసేన్ జంక్షన్ నుంచి రోడ్డు నెంబర్-10 వరకు రెండు లైన్ల ఫ్లైఓవర్

7 వాస్క్యులర్ కేంద్రాల ఏర్పాటుపై జీవో

» 18 డయాలసిస్ కేంద్రాలకు కూడా..

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏడు చోట్ల వాస్క్యులర్ కేంద్రాలు, 18 చోట్ల డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు వైద్యారోగ్యశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. డయాలసిస్ రోగుల కోసం వాస్క్యులర్ కేంద్రాలను సర్కారు ఏర్పాటు చేయబోతున్నట్లు గత నెల 20న ఆంధ్రజ్యోతి 'రక్తశుద్ధిపై చిత్తశుద్ధి' కథనాన్ని ప్రచురించింది. రెండు మూత్రపిండాలు దెబ్బతిన్న రోగులకు డయాలసిస్ తప్పనిసరి.. తొలిసారి డయాలసిస్ చేసేటప్పుడే రోగికి వాస్క్యులర్ సర్జరీ చేయాల్సి ఉంటుంది. అయితే జిల్లాల్లో ఆ సర్జరీ చేసే సదుపాయాలు లేకపోవడంతో బాధితులు హైదరాబాద్‌కు వచ్చి రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలోనే కొత్తగా ఖమ్మం జనరల్ ఆస్పత్రి, వరంగల్ ఎంజీఎం, మహబూబ్‌నగర్ జనరల్ హాస్పిటల్, ఆదిలాబాద్ రిమ్స్‌లో వాస్క్యులర్ కేంద్రాలను అందుబాటులోకి తెస్తున్నారు. అలాగే, హైదరాబాద్‌లో డయాలసిస్ కోసం ఏర్పాటు చేసిన మూడు హబ్ ఆస్పత్రులైన నిమ్స్, గాంధీ, ఉస్మానియాలలోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఏడు కేంద్రాల ఏర్పాటు కోసం రూ.32.7 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇటు డయాలసిస్ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 85 కేంద్రాలున్నప్పటికీ, అవి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో కొత్తగా 18 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుతో పాటు, ఇప్పటికే ఉన్న సెంటర్లలో అదనంగా 74 మెషీన్లు అందుబాటులోకి తెస్తున్నారు. దీనివల్ల ప్రస్తుతం ఉన్న కేంద్రాలపై భారం తగ్గడంతో పాటు, రోగులు ప్రయాణించాల్సిన దూరం తగ్గుతుంది.

సృజనాత్మక ఆలోచనలన్నీ ఒకే వేదికపైకి!

» ఫార్మా రంగంలో ఏఐ వినియోగంపై ఆలోచనలు పంచుకున్న దిగ్గజ సంస్థలు

» యాంపిల్‌లాజిక్ ఆధ్వర్యంలో ఐడియాథాన్

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఔషధాల ఉత్పత్తిలో సాంకేతికత వినియోగం, ఇతర అంశాలపై ఆలోచనలు పంచుకునేందుకు ఆ రంగ దిగ్గజాలంతా ఒకే వేదికపైకి వచ్చారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ యాంపిల్‌లాజిక్ శనివారం ఏఎల్ ఐడియాథాన్ పేరిట హైటెక్స్‌లో భారీ కార్యక్రమం నిర్వహించింది. పలు ప్రముఖ ఔషధ సంస్థల ప్రతినిధులు, ఆ రంగ నిపుణులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఫార్మా రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారులు మన రాష్ట్రంలో ఉన్నారు. యూరప్, అమెరికాకు కూడా మన దగ్గర నుంచి ఔషధాలు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి ఔషధ కంపెనీలు ఒక్కో విభాగంలో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. ఒక కంపెనీలో ఉత్పత్తి వ్యవస్థ మెరుగ్గా ఉంటే.. మరో కంపెనీ మానవ వనరుల విషయంలో ఇంకా మెరుగ్గా ఉండవచ్చు. ఆయా విభాగాల్లో మెరుగైన పనితీరు కనబరుస్తున్నవారు తమ ఆలోచనలను పంచుకునేందుకు వీలుగా యాంపిల్‌లాజిక్... ఐడియాథాన్ నిర్వహించింది. దీనికోసం ఆగస్టు మొదటి వారం నుంచి ఆ సంస్థ పనిచేస్తూ వచ్చింది. ఒక వెబ్‌సైట్ ప్రారంభించి, అందులో దిగ్గజ ఫార్మా కంపెనీలను నమోదు చేసుకోవాలని కోరింది. ఫార్మా రంగ అభివృద్ధికి సృజనాత్మక ఆలోచనలు ఇవ్వాలని కోరగా పలు సంస్థలు స్పందించాయి. మొత్తం 500 దాకా సృజనాత్మక ఆలోచనలు వచ్చాయి. వాటిని వడగట్టి 200 ఎంపిక చేశారు. ఆ తర్వాత 90కు కుదించారు. వాటిలో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసే బాధ్యతను ఫార్మా రంగంలో కనీసం 25-30 సంవత్సరాల అనుభవమున్న వారికి అప్పగించారు. ఆ జ్యూరీ కమిటీలోని సభ్యులు 12 అత్యుత్తమ ఆలోచలను ఎంపిక చేశారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లారస్ ల్యాబ్ వ్యవస్థాపక సీఈవో డాక్టర్ చావా సత్యనారాయణ హాజరయ్యారు. ఫార్మా రంగానికి చెందిన 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. యాంపిల్‌లాజిక్ వ్యవస్థాపక సీఈవో మన్నే వెంకట్‌చౌదరి మాట్లాడుతూ ఎక్కువ ఐడియాలు కృత్రిమ మేధపై వచ్చాయని తెలిపారు. ఏఐను ఫార్మా రంగంలో ఏవిధంగా వినియోగించుకోవాలనే అంశంపై చాలా ఆలోచనలు వచ్చాయన్నారు. విజేతకు రూ.3లక్షల పారితోషికం అందించామన్నారు. వచ్చే ఏడాది ఐడియాథాన్‌ను ముంబైలో నిర్వహిస్తామని చెప్పారు.

నల్సార్‌లో నేడు రెవెన్యూ సదస్సు

మేడ్చల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రెవెన్యూ సదస్సు మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీలో ఆదివారం జరగనుంది. ఈ సదస్సుకు మంత్రి పొంగులేటి హాజరుకానున్నారు. ఈ మేరకు శనివారం సమావేశం ఏర్పాట్లను అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పరిశీలించారు. రాష్ట్రంలోని రెవెన్యూ అంశాలపై అన్ని జిల్లాల రెవెన్యూ సిబ్బంది, తహసీల్దార్లతో మంత్రి సమావేశం కానున్నారు.

న్యాయవాదులు పారదర్శకంగా ఉండాలి

అట్టడుగు వర్గాలకు న్యాయం చేయాలి.. సంపన్నులతో పోలిస్తే నేటికీ న్యాయం పొందలేని పేదలు

» నల్సార్ న్యాయ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

» రాష్ట్రపతి నిలయంలో కళా మహోత్సవ్



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానం పలుకుతున్న సీఎం రేవంత్; రాష్ట్రపతి భవన్‌లో కళాకారులతో ముర్ము

మేడ్చల్/అల్వాల్/శామీర్‌పేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): న్యాయవాదులు సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. న్యాయవాద వృత్తిలో నిబద్ధత, పారదర్శకంగా పనిచేస్తే ఎంతో ఎత్తుకు ఎదగవచ్చన్నారు. సంపన్నులకు లభించే న్యాయం.. నిరుపేదలకు నేటికీ అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ తరం న్యాయనిపుణులు మార్గదర్శకులుగా నిలిచి ఈ విధానంలో మార్పు తీసుకురావాలని అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పరిధిలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో జరిగిన 21వ స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పీహెచ్‌డీ, ఎల్ఎల్ఎంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ.. నేడు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, న్యాయవ్యవస్థలో కూడా సాంకేతికతను ఉపయోగించుకుని బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంతోపాటు కేసుల సత్వర పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో నెట్‌వర్క్ ఉండాలని అభిప్రాయపడ్డారు. పూర్వ విద్యార్థులతోపాటు దేశవ్యాప్తంగా ఉన్న మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతోనూ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలన్నారు. నల్సార్‌లో జంతు న్యాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని, జంతు సంరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి అవసరమని పేర్కొన్నారు. నల్సార్‌లో ఏఐను ఒక అధ్యయనంగా గుర్తించడం సంతోషకరమని రాష్ట్రపతి ముర్ము అన్నారు. జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో న్యాయస్థానాలు, ప్రతీ పది గ్రామాలకు ముగ్గురు న్యాయాధికారులతో ధర్మాసనం అవసరమని చాణక్యుడు ఆనాడే తన అర్థశాస్త్రంలో పొందుపరిచారని గుర్తు చేశారు. కేసు విచారణ ముగిసేవరకు న్యాయమూర్తులు, కక్షిదారులు వ్యక్తిగతంగా కలిసేందుకు అనుమతించవద్దని, అప్పుడే నిష్పక్షపాత న్యాయ ప్రదానానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. నల్సార్‌లో ప్రతిభావంతులైన వారిలో విద్యార్థినులే ఎక్కువ మంది ఉండటం గర్వకారణమన్నారు. ఇక మన దేశంలో న్యాయ సంప్రదాయాలు ఎంతో ఉన్నతమైనవని, న్యాయం కోసం మహాత్మాగాంధీ కూడా పోరాటం చేశారని రాష్ట్రపతి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్సార్‌లో న్యాయ విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలని, విశ్వవిద్యాలయానికి, కుటుంబసభ్యులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున విశ్వవిద్యాలయానికి ఆర్థిక సహకారం అందజేస్తామని ప్రకటించారు. స్నాతకోత్సవంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ చాన్సలర్ జస్టిస్ అలోక్ అరాధే, వైస్ చాన్సలర్ శ్రీకృష్ణదేవరావు, మంత్రి సీతక్క పాల్గొన్నారు. అంతకుముందు ఉదయం 11గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతి ముర్ముకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం అనంతరం సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఈశాన్య ప్రాంతా అభివృద్ధి మంత్రిత్వశాఖ, సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న కళామహోత్సవ్‌ను రాష్ట్రపతి ప్రారంభించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు బేగంపేటకు చేరుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లారు.

15 రోజుల్లో

40 లక్షల సభ్యత్వాలే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో 50 లక్షల సభ్యత్వాల నమోదు లక్ష్యం కాగా ఇప్పటివరకు 10 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని మిగిలిన 40 లక్షలను 15 రోజుల్లోగా పూర్తి చేసేలా పని చేయాలని నేతలను కోరారు. ఈ ప్రక్రియలో ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో బీజేపీ అధికారం చేపట్టడమే లక్ష్యంగా నేతలు పని చేయాలని సూచించారు. యువతను ప్రోత్సహించి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. జమ్మూకశ్మీర్ ఎన్నికల పనుల్లో ఉన్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఈ సమీక్షకు గైర్హాజరవ్వగా.. పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్ర మంత్రి బండి సంజయ్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. కాగా, గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థుల్లో సగం కంటే ఎక్కువ మంది ఈ సమావేశానికి దూరంగా ఉండడం గమనార్హం. అంతకముందు శనివారం సాయంత్రం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న జేపీ నడ్డాను బండి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తదితరులు స్వాగతించారు.



ఎంపీలు, ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, బండి, లక్ష్మణ్

లడ్డూ వ్యవహారంపై కేంద్రం సీరియస్

» కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వ్యవహారంపై కేంద్రం సీరియస్‌గా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. తిరుమల లడ్డూ ప్రసాదం కోసం జంతువు కొవ్వు కలిసిన నెయ్యిని దిగుమతి చేసుకున్నారనేదని వాస్తవమని, ఈ మేరకు నివేదికలో తేలిందని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తోందని, అవసరమైతే దర్యాప్తులో కేంద్రం జోక్యం చేసుకుంటుందన్నారు. శనివారం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమల ప్రతిష్ఠను దిగజార్చారని ఆరోపించారు. రామతీర్థంలో రాముడి విగ్రహం నుంచి మొండెం వేరు చేసినప్పుడు, అంతర్వేదిలో రథం తగలబెట్టినప్పుడు దోషులను పట్టుకోలేదన్నారు. తిరుమలలో ఏం జరుగుతోందో బీజేపీ నేతలకు తెలుసో, తెలియదోనని జగన్ అంటున్నారని, కేంద్రం అన్నీ గమనిస్తూనే ఉందని వ్యాఖ్యానించారు.

నీటి నిల్వతోనే బ్యారేజీ కుంగింది

(మొదటి పేజీ తరువాయి)





సమర్పించాలని, అవసరమైతే మళ్లీ విచారణకు హాజరు కావడానికి సిద్ధంగా ఉండాలని స్పష్టం చేసింది. దాంతో, రికార్డులతో హాజరు కావడానికి అవకాశం ఇవ్వాలని నల్లా వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేయగా.. కమిషన్ అంగీకరించింది. సాంకేతిక అంశాల్లో తమకంటే ఎక్కువ పరిజ్ఞానం ఉందన్న కారణంతో కమిషన్‌ను గందరగోళంలోకి నెట్టే ప్రయత్నాలు వీడాలని హితవు పలికింది. ఒక దశలో బుక్‌లెట్ తెచ్చుకొని అందులో నుంచి సమాధానాలు చెబుతుండగా.. కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. కమిషన్‌కు సమర్పించిన పత్రాల్లోని వివరాల ఆధారంగానే జవాబు ఇవ్వాలని, ప్రత్యేకంగా పత్రాలు తెచ్చుకొని జవాబులు చెప్పడం కమిషన్‌ను పక్కదారి పట్టించడమే అవుతుందని ఆక్షేపించింది. రాఫ్ట్, పియర్, గేట్ల సైజుల విషయంలో డీవియేషన్స్ జరిగాయని, వ్యాప్కోస్ తన డీపీఆర్‌లో ఫ్లడ్ బ్యాంకుల ప్రస్తావన పెట్టలేదని, అందుకే అంచనాలను సవరించాల్సి వచ్చిందని తెలిపారు. డిజైన్లు, డ్రాయింగ్‌లకు ఐబీఎం కమిటీ తుది రూపుఇచ్చిందని చెప్పారు. విచారణ జరిగిన తీరు ఇలా..

షీట్ పైల్స్ బదులు సీకెంట్ పైల్స్ వాడేందుకు అనుమతి ఎవరిచ్చారు?

జియో టెక్నికల్ పరీక్షల కోసం బోర్లు వేస్తున్న సమయంలో ఆ ప్రదేశం షీట్ పైల్స్‌కు అనువుగా లేదని గుర్తించాం. డీపీఆర్‌లో ‌ ట్రైప్ షీట్ పైల్స్ వినియోగించాలని ఉంది. ఎన్ఐటీ వరంగల్, ఐఐటీ మద్రాసు మాజీ ప్రొఫెసర్లతో నివేదికలు తెప్పించుకొని సీఈ-సీడీవోకు ఇచ్చాం. టెక్నో ఎకనామికల్ కారణాలతో సీకెంట్ పైల్స్ వాడటానికి వీలుగా సీఈ సీడీవో రిపోర్టు ఇచ్చారు. మేడిగడ్డలో బ్లాక్-1, 2లలో సీకెంట్ పైల్స్, ఆర్‌సీసీ కటాఫ్‌లు వాడాలని; బ్లాక్-3 నుంచి 8 దాకా సీకెంట్ పైల్స్ వాడాలని సీఈ సీడీవో సిఫారసు చేశారు.

నిర్మాణంలో ఏ పైల్స్ వాడాలో సీఈ సీడీవో చెబుతుందా? ఆ నిర్ణయం నిర్మాణ బాధ్యతలు చూసే అధికారులదా?

జియో టెక్నికల్ నివేదికల ఆధారంగా 'తగిన పైల్స్' వాడాలని సీఈ-సీడీవో సిఫారసు చేశారు.

మీ వాదనకు ఆధారమేంటి? ప్రామాణిక రికార్డులను అందించగలరా?

జియో టెక్నికల్, జియో ఫిజికల్ నివేదికల ఆధారంగానే సీఈ సీడీవో ఆ సిఫారసు చేసింది.

తగిన రుజువులు, అధీకృత పత్రాలు లేకుండా తప్పుడు వివరాలు చెబుతారా? (కమిషన్ ఆగ్రహం)

జవాబులు ఇచ్చే విషయంలో ఇంగ్లీషుపై పట్టు లేకపోవడం వల్లే తప్పు జరిగింది

ఆంగ్లంపై పట్టు లేకున్నా మీరు చీఫ్ ఇంజనీర్‌గా పని చేశారా? కమిషన్ కన్నా మీకు సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువ ఉండొచ్చు. అలాగని, కమిషన్‌నే పక్కదోవ పట్టిస్తారా? (ఆగ్రహం)

కమిషన్‌ను తప్పుదోవ పట్టించలేదు. రెండు, మూడు రోజుల్లో తగిన పత్రాలు ఇస్తాను.

వెంట్ (నీళ్లు వెళ్లే ద్వారాలు)ల్లో మార్పులు జరిగాయా?

మేడిగడ్డ, అన్నారంలలో ఎన్ని వెంట్‌లు ఉండాలో సీఈ సీడీవో సిఫారసు చేశారు. సుందిళ్లలో 68 వెంట్‌లు ఉండాలని చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ ల్యాబొరేటరీ ఆధ్వర్యంలో 2డీ నమూనా అధ్యయనాల అనంతరం అదనంగా 6 వెంట్‌లను ప్రతిపాదించాం.

తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీని మార్చాలని నిర్ణయం తీసుకున్నదెవరు?

ప్రభుత్వాధినేత

వ్యాప్కోస్‌కు డీపీఆర్ తయారీ బాధ్యతలు ఎవరిచ్చారు? పత్రాలు ఉన్నాయా?

బెల్లంపల్లి ఎస్ఈ ఆదేశాలతో డీపీఆర్ తయారీకి వ్యాప్కోస్‌కు ఆదేశాలు ఇచ్చారు. 2016 జనవరి 17న సీఎం కేసీఆర్‌తో జరిగిన సమావేశంలో డీపీఆర్‌ను సమర్పించారు. బ్యారేజీని మార్చాలని వ్యాప్కోస్ సూచించింది. ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌పై ప్రభుత్వం హైపవర్ కమిటీని వేసింది. ఆ కమిటీ సిఫారసులతో కొత్త బ్యారేజీల నిర్మాణం నిర్ణయం తీసుకున్నారు.

ప్రభుత్వం నిర్దేశించకుండా వ్యాప్కోస్ నిర్ణయం తీసుకోదు. హైపవర్ కమిటీ బాధ్యతలేంటి?

ప్రాణహిత-చేవెళ్ల, కాంతనపల్లి ప్రాజెక్టులతో ముడిపడిన సమస్యలపై హై పవర్ కమిటీని ప్రభుత్వం వేసింది. ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్‌లో భాగంగానే హైపవర్ కమిటీ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సిఫారసు చేసింది. అటవీ భూమి సేకరణ తగ్గించడం, ముంపు సమస్యను తగ్గించడం, విద్యుత్తు వినియోగం కుదించడం వంటి అంశాల ఆధారంగా బ్యారేజీల స్థలాల మార్పుపై నిర్ణయం తీసుకున్నారు.

మార్పులకు వ్యాప్కోస్ ఆమోదం ఉందా?

హైపవర్ కమిటీ సమావేశానికి వ్యాప్కోస్ ప్రాజెక్టు డైరెక్టర్ శంభూ ఆజాద్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. రిజిస్టర్‌లో సంతకం చేసినా.. మినిట్స్‌లో చేయలేదు.

సిరిసిల్ల మగ్గంపై బంగారు చీర

- తయారు చేసిన సిరిసిల్ల నేత కళాకారుడు విజయ్
- 200 గ్రాముల బంగారం వినియోగం..18 లక్షల ఖర్చు



బంగారు చీరతో నల్ల విజయ్

సిరిసిల్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత మగ్గంపై మరో అద్భుతం ఆవిష్కృతమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ బంగారంతో చీరను నేసి అబ్బురపరిచాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ వ్యాపారవేత్త కూతురు వివాహం అక్టోబరు 17న ఉంది. తన కూతురు వివాహంలో ఓ ప్రత్యేక ఉండాలని భావించిన సదరు వ్యాపారవేత్త విజయ్‌తో బంగారు చీరను తయారు చేయించాలనుకున్నారు. 200 గ్రాముల పసిడిని వినియోగించి రూ.18 లక్షల వ్యయంతో చీరను నేయించారు. ఆరు నెలల క్రితమే చీరకు ఆర్డరు తీసుకున్న విజయ్.. బంగారాన్ని జరీ పోగులుగా తయారు చేయించారు. అనంతరం మగ్గంపై చీరను నేశారు. 12 రోజుల్లో నేసిన ఈ చీర 49 అంగుళాల వెడల్పు, 5.50 మీటర్ల పొడవు, 800 గ్రాముల బరువు ఉంది. విజయ్ పదేళ్లుగా చేనేత, మరమగ్గాలపై వినూత్న ప్రయోగాలు చేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

రెండు రేషన్ కార్డులపై ఇంటెలిజెన్స్ విచారణ

- 'ఆంధ్రజ్యోతి' విలేకరికి సదరు నేత నుంచి బెదిరింపు కాల్స్

నేలకొండపల్లి, సెప్టెంబరు 28 : ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం మూటాపురంలో ఓ నాయకుడు తనతో పాటు తన భార్య పేరిట రెండు రేషన్ కార్డులతో రుణమాఫీ పొందిన వ్యవహారంపై విచారణ ప్రారంభమైంది. రెండు రేషన్‌కార్డులతో భార్యాభర్తలు వేర్వేరుగా రుణమాఫీ పొందిన విషయంపై "వామ్మో మూటాపురం లీడరు" శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంపై ఇంటెలిజెన్స్ అధికారులు మూటాపురంలో విచారణ చేసినట్లు తెలుస్తోంది. స్థానిక సహకార సంఘం కార్యాలయంలో వివరాలను సేకరించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. వ్యవసాయాధికారులు సైతం ఆ నేత ఎవరని విచారణ ప్రారంభించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు లీడరు ఫోన్‌లో 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై బెదిరింపులకు దిగాడు. "అన్ని ఆధారాలతోనే వార్త రాశారా.. నా గురించి నీకు తెలుసా? ఫైటింగ్‌కు రెడీనా?" అంటూ సవాల్ విసిరాడు.

కోయంబత్తూరు నుంచి బంగారం అక్రమ రవాణా

- 3.71 కోట్ల బంగారం స్వాధీనం.. ముగ్గురి అరెస్టు

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రూ. 3.71 కోట్ల విలువైన విదేశీ బంగారాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విదేశాల నుంచి స్మగ్లింగ్ చేసిన బంగారం రోడ్డు మార్గంలో రవాణా అవుతుందన్న పక్కా సమాచారంతో రాయికల్ టోల్ ప్లాజా వద్ద డీఆర్ఐ అధికారులు శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ కారులో బయటకు కనిపించకుండా కారు హ్యాండ్ బ్రేక్ కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్సులో బంగారు బిస్కెట్లు దాచి రవాణా చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేశారు.

చూస్కోమని బాబును వదిలివెళ్తే కిడ్నాప్

కాజీపేట, సెప్టెంబరు 28 : భార్యభర్తలు గొడవ పడుతుండగా... అదే అదనుగా భావించిన ఓ జంట వారి కుమారుణ్ని తీసుకుని ఉడాయించిన ఘటన హనుమకొండ జిల్లా కాజీపేటలో జరిగింది. వరంగల్ రంగశాయిపేటకు చెందిన ఎస్కే మసూద్, కౌసర్ దంపతులకు అయాన్, ఇఫ్తార్ ఇద్దరు కుమారులు. జనగామకు వెళ్లేందుకు నలుగురు శుక్రవారం కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే అప్పటికే రైలు వెళ్లిపోవడంతో బస్‌లో వెళ్లేందుకు కాజీపేట చౌరస్తా వద్దకి వెళ్లారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. భార్య కౌసర్ చిన్న కుమారుడు ఇఫ్తార్‌ను తీసుకుని కాస్త ముందుకు వెళ్లింది. దీంతో మసూద్.. పెద్ద కుమారుడు అయాన్(5)ను వెంటనే వస్తానని చెప్పి అక్కడే ఉన్న ఓ జంట వద్ద వదిలి భార్యను వెనక్కి తీసుకురావడానికి వెళ్లాడు. అతను భార్యను తీసుకువచ్చేలోపు ఆ దంపతులు బాబును తీసుకుని ఉడాయించారు.

66.7% మహిళలపై భౌతిక హింస

- నల్లగొండ, మెదక్ జిల్లాల్లో స్వచ్ఛంద సంస్థల సర్వే

హైదరాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై హింస, దాడులు ఆగడం లేదు. ఇప్పటికీ భర్తల చేతుల్లో భార్యలు హింసకు గురువుతూనే ఉన్నారు. నల్లగొండ, మెదక్ జిల్లాల్లో 81.6% మంది మహిళలకు భర్తల తిట్లు తప్పడం లేదు. మహిళా కిసాన్ అధికార్ మంచ్(మకామ్), సొసైటీ ఫర్ ప్రమోటింగ్ పార్టిసిపేటివ్ ఎకోసిస్టం మేనేజ్‌మెంట్(ఎస్ఓపీపీఈసీఓఎం) అనే స్వచ్ఛంద సంస్థలు ఈ రెండు జిల్లాల్లో మహిళల పరిస్థితిపై సర్వే చేశాయి. ఈ సర్వే వివరాల ప్రకారం 66.7% మంది మహిళలు భర్తల చేతుల్లో భౌతిక హింసకు గురవుతున్నట్లు తేలింది. కుటుంబ సభ్యుల ద్వారా భౌతిక దాడులకు గురవుతున్న మహిళలు 7.1 శాతం వరకు ఉన్నారు. సంపాదించే డబ్బును ఇవ్వాలంటూ 9.9 శాతం మంది మహిళలను వేధిస్తున్నారు. కుటుంబానికి వచ్చే ఆదాయం మొత్తంలో 7.8 శాతం మంది మహిళలకు చిల్లి గవ్వ కూడా ఇవ్వడం లేదు. మద్యం కూడా కుటుంబాల్లో చిచ్చు పెడుతోంది. దీని ప్రభావంతో 34.8 శాతం మంది మహిళలు హింసకు గురవుతున్నారు. వరకట్న హింసకు గురవుతున్నవారి శాతం 7.8. భార్యకు విడాకులు ఇవ్వకుండానే పెళ్లిళ్లు చేసుకుంటున్న భర్తలు 3.8 శాతం మంది ఉన్నారు. కుటుంబ ఆస్తిలో 8.5 శాతం మంది మహిళలకు ఎలాంటి పంపకాలు చేయకుండా నిరాకరిస్తున్నారు. ఆస్తిలో వాటా కావాలని అడిగిన మహిళల్లో 7.1 శాతం మంది హింసకు గురవుతున్నారు.

కీచక హెచ్‌ఎంపై పోక్సో, అట్రాసిటీ కేసుల నమోదు

- ఖమ్మం జిల్లా పాలడుగులో విద్యార్థినులపై లైంగిక వేధింపులు

వైరా, సెప్టెంబరు 28: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో పోలీసులు అతడిపై పోక్సో, అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఖమ్మం జిల్లా వైరా మండలం పాలడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న చావా శ్రీనివాసరావు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నాడు. దీంతో శనివారం సదరు విద్యార్థినులతోపాటు వారి తల్లిదండ్రులు గ్రామస్థులతో కలిసి పాఠశాలకు వచ్చి ఆందోళనకు దిగారు. ఈ విషయం ముందుగానే తెలుసుకున్న హెచ్‌ఎం మధ్యాహ్న భోజనం తర్వాత పాఠశాల నుంచి జారుకున్నాడు. ఆందోళన గురించి తెలుసుకున్న ఎంఈవో వెంకటేశ్వర్లు పాఠశాలకు చేరుకొని తల్లిదండ్రులతో చర్చించారు. ఈ క్రమంలో ఆగ్రహించిన తల్లిదండ్రులు ఎంఈవోతోపాటు ఉపాధ్యాయులను గదిలో నిర్బంధించారు. ఖమ్మం కలెక్టర్ ముజిమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో ఖమ్మం డీఈవో సోమశేఖరశర్మ పాఠశాలకు చేరుకొని బాధిత విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చారు.

అన్నారంలో ఇసుక మేటలకు పరిష్కారం లేదా?

దాదాపు 15లక్షల క్యూబిక్ మీటర్ల మేర.. 7 మీటర్ల ఎత్తున పేరుకుపోయిన ఇసుక

- సిల్ట్ అరెస్టింగ్ స్ట్రక్చర్లతోనే పరిష్కారం
- అధ్యయనం జరగాలంటున్న నిపుణులు
- ఇప్పటికిప్పుడు పనులు చేపట్టినా.. ఇసుక తొలగింపునకు ఏడాది పట్టే అవకాశం



అన్నారం బ్యారేజీలో భారీగా పేరుకుపోయిన ఇసుక

భూపాలపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నారం (సరస్వతి) బ్యారేజీలో పేరుకుపోతున్న ఇసుక శాశ్వత నిరోధానికి చర్యలు చేపట్టడం సాధ్యమా? కాదా? అంటే.. బ్యారేజీలో నీటి నిల్వ సామర్థ్యంపై అ అంశం ఆధారపడి ఉంటుందని నీటి పారుదల శాఖ నిపుణులు అంటున్నారు. దేశంలో ఈ తరహాలో కోల్‌కత్తాలోని పరక్కా బ్యారేజీ కూడా ఇసుక సమస్య కారణంగా తన సామర్థ్యాన్ని కోల్పోయిందని వారు గుర్తు చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో గోదావరిపై నిర్మించిన అన్నారం బ్యారేజీలో వరదల కారణంగా భారీగా ఇసుక పేరుకుపోతోంది. గోదావరి నుంచి భారీగా ఇసుక కొట్టుకురావడంతో.. సుందిళ్ల బ్యారేజీ నుంచి అన్నారం బ్యారేజీ దాకా 31 కిలోమీటర్ల నిడివిలో దాదాపు 7 మీటర్ల ఎత్తున ఇసుక మేటలు వేశాయి. దీంతో ప్రస్తుతం బ్యారేజీ వద్ద గేట్లు మూసేందుకు కూడా వీలు లేకుండా పూడిక పేరుకుపోయినట్లు ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇసుక సమస్యను పరిగణనలోకి తీసుకోకుండా బ్యారేజీ నిర్మాణం చేపట్టడం వల్ల ప్రతి ఏటా ఇసుక మేటల సమస్య ఉత్పన్నమవుతోందన్న ఆరోపణలున్నాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు తర్వాత నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారుల సలహా మేరకు అన్నారం బ్యారేజీ 66 గేట్లను పూర్తిగా తెరిచి ఉంచడంతో భారీగా కొట్టుకొచ్చిన ఇసుక గేట్ల వద్ద పేరుకుపోయింది. బ్యారేజీలో ఉన్న లీకేజీల సమస్యను పరిష్కరించినప్పటికీ ఈ ఏడాది వరద సమయంలో గేట్లను మూసేందుకు ఇసుక అడ్డంకిగా మారింది.

గేట్లన్నీ తెరిచి ఉంచడం వల్లేనా?

ప్రస్తుతం అన్నారం బ్యారేజీలోని 66 గేట్లలో ఇసుక మేటలు వేయడం వల్ల ఇప్పటికిప్పుడు గేట్లను కిందికి దించే పరిస్థితి లేదు. ఇటీవల జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జరిపిన విచారణ సందర్భంగా ఇదే విషయాన్ని నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేసినట్లు తెలిసింది.అన్నారం బ్యారేజీలో ఉన్న మొత్తం గేట్లన్నింటిని మూసి కేవలం రెండు గేట్లను కొద్దిగా పైకి లేపి ఉంచడం వల్ల నీటి ప్రవాహ వేగంతో పాటు ఇసుక దిగువ భాగానికి కొట్టుకుపోయే పరిస్థితి ఉండేదని, ఎన్డీఎస్ఏ సూచనతో గేట్లను పూర్తిగా తెరిచిఉంచడం వల్ల ఇసుక పేరుకుపోతోందని అధికారులు వివరించినట్లు తెలుస్తోంది. బ్యారేజీ వద్ద ప్రస్తుతం అప్ స్ట్రీమ్ భాగంలో మూడు నుంచి నాలుగు మీటర్లు, డౌన్ స్ట్రీమ్‌లో 6 నుంచి 7మీటర్ల మేర ఇసుక మేటలు వేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇలా మొత్తం 31 కిలోమీటర్ల నిడివిలో దాదాపు 15లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక మేటలు వేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలుస్తోంది. ఇసుక మేటల కారణంగా బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 10.87 టీఎంసీలు కాగా, ప్రస్తుతం గణనీయంగా తగ్గిపోయిందని చెబుతున్నారు. శాస్త్రీయంగా సర్వే నిర్వహిస్తే తప్ప ఏ మేరకు పూడిక పేరుకుపోయిందనే విషయం తేలదని అధికారులు అంటున్నారు. బ్యారేజీలో ఇసుక మేటల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలంటే శాస్త్రీయంగా అధ్యయనం జరిపి నది అంతర్భాగంలో ఇసుక సాంద్రతను తగ్గించేందుకు సిల్ట్ అరెస్టింగ్ స్ట్రక్చర్లను నిర్మించాలని నీటిపారుదల శాఖ నిపుణులు చెబుతున్నారు. అప్పుడే సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యే అవకాశం ఉందంటున్నారు. బ్యారేజీలో పేరుకుపోయిన పూడికను తొలగించాలంటే ఇప్పటికిప్పుడు కార్యాచరణ ప్రారంభించినా.. పూర్తయ్యేందుకు ఏడాది పట్టే అవకాశం ఉందంటున్నారు. ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తొలగింపు ప్రక్రియ ప్రారంభించినా తక్కువలో తక్కువగా 8నెలల సమయం పడుతుందని చెబుతున్నారు. వచ్చే వర్షాకాలం సీజన్‌లోనూ బ్యారేజీ గేట్లను దించే పరిస్థితి ఉండకపోవచ్చని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇసుకను తొలగించాలని ప్రాజెక్టు అధికారులు ఇప్పటికే నీటిపారుదల శాఖ సీనియర్, చీఫ్ ఇంజనీర్‌లకు లేఖలు రాసినట్లు తెలుస్తోంది.

సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని.. ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య

ఆదిభట్ల/మంచాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పోలీస్ కానిస్టేబుల్ (ఏఆర్) ఉద్యోగాన్ని సాధించిన ఆ యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై.. ఆ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకొని అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. అవి తీర్చే దారీతెన్నూ కనిపించక సర్వీసు రివాల్వరుతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రానికి చెందిన దూసరి బాలకృష్ణ (28). 2018లో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. హెడ్‌క్వార్టర్స్ కేంద్రంగా వివిధ ప్రాంతాల్లో డ్యూటీ చేసి ఈనెల 1 నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చాడు. అయితే అతడికి ఆన్‌లైన్ గేమ్స్ ఆడే వ్యసనం ఉన్నట్లు తెలిసింది. బాలకృష్ణ గేమ్స్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలైనట్లు సమాచారం. అప్పులు ఎక్కువై మానసిక వేదనకు గురైనట్లు స్నేహితులు చెబుతున్నారు. ఎవ్వరితో సరిగా మాట్లాడకుండా.. ఎప్పుడు మూడీగా ఉండేవాడని తెలిసింది. శుక్రవారం ఉదయం 9 గంటలకు డ్యూటీకి వచ్చి శనివారం ఉదయం వెళ్లాల్సి ఉండగా.. శనివారం తెల్లవారు జామున 3.30 గంటల ప్రాంతంలో టాయిలెట్‌కు వెళ్తున్నట్లు అక్కడున్న సిబ్బందికి చెప్పి వెళ్లాడు. అక్కడ తన వద్ద ఉన్న తుపాకీతో గొంతు భాగంలో కాల్చుకొని మృతి చెందాడు. తుపాకి శబ్దం రావడంతో అక్కడున్న సిబ్బంది వెంటనే వెళ్లి చూడగా అప్పటికే మృతిచెందాడు. కాగా, బుల్లెట్ తలలో నుంచి దూసుకెళ్లి బిల్డింగ్ సీలింగ్‌కు తగిలి రంధ్రం ఏర్పడింది. బాలకృష్ణ గతంలోనూ ఓ సారి ఆత్మహత్యా ప్రయత్నం చేసినట్లు సమాచారం. మృతుడు బాలకృష్ణ బేబులో నుంచి ఓ సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిరుడు చెల్లి పెళ్లి జరగ్గా, ఈ ఏడాది అతడి పెళ్లికి ఏర్పాట్లు జరుగుతున్న తరుణంలో ఈ ఘటన కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తాను ముగ్గురు వ్యక్తులకు రూ.2.8 లక్షలు బాకీ ఉన్నట్లు చెబుతూ వారి పేర్లూ సూసైడ్ నోట్‌లో పొందుపర్చాడు

గత ఏడాది 406 మంది రైతుల ఆత్మహత్య

- కాంగ్రెస్ వచ్చిన 7 నెలల్లో 158 మంది
- 2018లో రైతు బీమా వచ్చిన తర్వాత ఎక్స్‌గ్రేషియా నిలిపివేసిన ప్రభుత్వం
- రైతు స్వరాజ్య వేదిక నివేదిక వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఎన్నిరకాల సహాయాలను అందించినా రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు ఆగడం లేదు. రైతు బంధు వంటి పథకాలను అమలు చేసినా బలవన్మరణాలు చోటుచేసుకుంటుండం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ఆత్మహత్యలు ఆగడం లేదు. ఒక్క 2023లోనే తెలంగాణలో 406 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబరు 7 నుంచి 158 మంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారని రైతు స్వరాజ్య వేదిక(ఆర్ఎస్‌వీ) రూపొందించిన నివేదిక వెల్లడించింది. ఈ ఏడు నెలల కాలంలో ఎక్కువగా ఆదిలాబాద్, జయశంకర్-భూపాలపల్లి, సిద్దిపేట, జనగామ్, మెదక్ జిల్లాల్లోనే ఆత్మహత్యలు నమోదయ్యాయి. 2023 సంవత్సరానికి సంబంధించి జాతీయ నేర గణాంక రికార్డుల సంస్థ(ఎన్‌సీఆర్‌బీ) ఇంకా వివరాలు వెల్లడించకపోయినా ఆర్‌సీవీ నివేదిక ప్రకారం 2014 నుంచి 2023 వరకు మొత్తం 7,064 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్‌సీఆర్‌బీ ప్రకారం 1995 నుంచి 2013 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 36,358మంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇందులో 60 శాతం తెలంగాణ ప్రాంతంలో చోటుచేసుకున్నవే. ఇందులో 6,974 మంది మహిళా రైతులు. ఇది మొత్తం ఆత్మహత్యల్లో 19.18 శాతం కాగా.. జాతీయ సగటు 15 శాతం కంటే ఇది ఎక్కువ. బీటీ కాటన్ మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత 2004 నుంచి 2006 వరకు ఈ ఆత్మహత్యలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి. తెలంగాణ వచ్చాక 2014 నుంచి 2022 వరకు 6,658 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో 756మంది(14.4 శాతం) మహిళా రైతులు. బవన్మరణాల్లో మహారాష్ట్ర తర్వాత తెలంగాణ 11 శాతంతో వరుసగా రెండేళ్లు (2014, 2015) దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. 2015లో దేశ వ్యాప్తంగా 441 మంది మహిళా రైతులు ఆత్మహత్య చేసుకుంటే.. అందులో తెలంగాణకు చెందినవారే 153 మంది ఉండడం ఆందోళనకరం. ఎన్‌సీఆర్‌బీ ప్రకారం 2019నుంచి రాష్ట్రంలో ఆత్మహత్యలు తగ్గినట్లు కనిపించినా.. ఆగలేదు. ప్రభుత్వం తప్పుడు వివరాలు అందజేయడంతోనే సంఖ్య తక్కువగా నమోదయ్యిందన్న ఆరోపణలున్నాయి.

సగటున 19.96% మందికే ఎక్స్‌గ్రేషియా

ఆత్మహత్య చేసుకున్న రైతుల్లో 19.96 శాతం మంది కుటుంబాలకే ఎక్స్‌గ్రేషియా అందింది. 2018 రైతు బీమా పథకం ప్రారంభించిన తర్వాత ఈ ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం కూడా నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము అందజేస్తుండడంతో ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదు. రైతుల ఆత్మహత్యల పూర్తి వివరాలను కూడా ఎన్‌సీఆర్‌బీకి ఇవ్వకుండా దాచి పెడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

గేట్- 2025

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● ఆదివారం 29 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

రూర్కీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఆర్)- దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) 2025 దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్ష నిర్వహణలో ఐఐటీ (బాంబే, ఢిల్లీ, గువహటి, కాన్పూర్, ఖరగ్‌పూర్, మద్రాస్), బెంగళూరు ఐఐఎస్సీ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ఐఐటీ, నిట్ సంస్థల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టోరల్ కోర్సులు చేసేందుకు అవకాశం కల్పిస్తారు. అంతేకాకుండా కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల ఎంపికకు గేట్ స్కోర్ తప్పనిసరి. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, సైన్స్, కామర్స్, ఆర్ట్స్ విభాగాలకు సంబంధించి మొత్తం 30 టెస్ట్ పేపర్లు ఉన్నాయి. అభ్యర్థులు ఒకటి/రెండు పేపర్లు రాయవచ్చు. గేట్ 2025 వ్యాలిడిటీ మూడేళ్లు.



టెస్ట్ పేపర్స్

ఏరోస్పేస్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కెమిస్ట్రీ, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్, జియోమాటిక్స్ ఇంజనీరింగ్, జియాలజీ అండ్ జియోఫిజిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్ అండ్ మెరైన్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, స్టాటిస్టిక్స్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ అండ్ ఫైబర్ సైన్స్, ఇంజనీరింగ్ సైన్సెస్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్.

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/సైన్స్/కామర్స్/ఆర్ట్స్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎగ్జామ్ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 15 మార్కులకు జనరల్ ఆప్టిట్యూడ్ నుంచి, 85 మార్కులకు అభ్యర్థి ఎంచుకొన్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు, మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు, న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు ఇస్తారు. కొన్ని ప్రశ్నలకు ఒక మార్కు, మరికొన్నింటికి రెండు మార్కులు కేటాయించారు. మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల్లో మాత్రమే తప్పుగా గుర్తించిన సమాధానానికి మూడోవంతు మార్కులు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం మూడు గంటలు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్

- గేట్ స్కోర్ ద్వారా ఎంటెక్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నెలకు రూ.12,400లు చొప్పున 22 నెలలు ఆర్థిక సహకారం అందిస్తారు.
- బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ పూర్తిచేసి నేరుగా పీహెచ్‌డీలో అడ్మిషన్ పొందినవారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; చివరి మూడేళ్లు నెలకు రూ.42,000 ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 3
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, మెదక్, నల్లగొండ, ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్, అనంతపురం, కర్నూలు, ఏలూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, చీరాల, చిత్తూరు, గూడూరు, గుంటూరు, కడప, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి
- **గేట్ 2025 తేదీలు:** 2025 ఫిబ్రవరి 1, 2, 15, 16
- **వెబ్‌సైట్:** gate2025.iitr.ac.in

మేనేజ్‌లో పీజీ డిప్లొమా

రాజేంద్రనగర్(హైదరాబాద్)లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)- పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. క్యాట్ 2024 స్కోర్, అకడమిక్ మెరిట్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, అనుభవం ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.



ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం ఏడు ట్రైమెస్టర్లు ఉంటాయి. వీటికి 112 క్రెడిట్స్ నిర్దేశించారు. మొదటి ట్రైమెస్టర్‌లో బిజినెస్ కమ్యూనికేషన్ అండ్ ప్రెజెంటేషన్ స్కిల్స్, ఐటీ ఫర్ మేనేజర్స్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, మైక్రో ఎకనామిక్స్, బిజినెస్ స్టాటిస్టిక్స్, ఫైనాన్షియల్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ అంశాలు ఉంటాయి. రెండో ట్రైమెస్టర్‌లో ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టయినబిలిటీ, మాక్రో ఎకనామిక్ థియరీ అండ్ పాలసీ, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్, అగ్రి ఇన్‌పుట్ మార్కెటింగ్, ఆపరేషన్స్ రీసెర్చ్, కార్పొరేట్ ఫైనాన్స్-1, కాంపిటేటివ్ టెక్నిక్స్ ఫర్ అగ్రి బిజినెస్, అగ్రికల్చరల్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ తదితరాలు ఉంటాయి. మూడో ట్రైమెస్టర్‌లో మార్కెటింగ్ స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ రీసెర్చ్, ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ అండ్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ ఫైనాన్స్-2, రూరల్ బ్యాంకింగ్, రూరల్ మార్కెటింగ్ అంశాలు బోధిస్తారు. నాలుగో ట్రైమెస్టర్‌లో భాగంగా సమ్మర్ ప్రాజెక్ట్ ఉంటుంది. ఐదో ట్రైమెస్టర్‌లో బిజినెస్ అనలిటిక్స్, సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్, కమాడిటీ డెరివేటివ్స్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ అగ్రి వేర్‌హౌసింగ్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చరల్ ఎక్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంటర్నేషనల్ ట్రేడ్, బ్రాండ్ అండ్ అగ్రి ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ వంటి సబ్జెక్టులు ఉంటాయి. ఆరో ట్రైమెస్టర్‌లో లాజిస్టిక్స్ అండ్ సప్లయి మేనేజ్‌మెంట్, రిటెయిల్ మేనేజ్‌మెంట్, అగ్రి ప్రెన్యూర్‌షిప్ అండ్ అగ్రి బిజినెస్ లీడర్‌షిప్, ఈ-కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్, కన్జూమర్ బిహేవియర్ గురించి నేర్పిస్తారు. ఏడో ట్రైమెస్టర్‌లో పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, లీగల్ యాస్పెక్ట్స్ ఆఫ్ బిజినెస్, ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్ మేనేజ్‌మెంట్, బిజినెస్ ఎథిక్స్, విలేజ్ ఇమ్మర్షన్ ప్రోగామ్ అంశాలు ఉంటాయి. ఎలక్టివ్ సబ్జెక్ట్ కింద అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ ఫర్ అగ్రి బిజినెస్, అడ్వర్టైజింగ్ అండ్ సేల్స్ ప్రమోషన్, సీఎస్ఆర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ మార్కెటింగ్, మైక్రో ఫైనాన్స్‌ల నుంచి ఒకదాన్ని ఎంపిక చేసుకోవాలి.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో అగ్రికల్చర్ అండ్ అలైడ్ సైన్సెస్(అగ్రికల్చర్/అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్/అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కమర్షియల్ అగ్రికల్చర్/డెయిరీ టెక్నాలజీ/ఫిషరీస్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెసింగ్ ఇంజనీరింగ్/ఫారెస్ట్రీ/హార్టికల్చర్/సెరికల్చర్/వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్‌బెండ్రీ) విభాగంలో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు వచ్చి ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2025 ఆగస్టు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి. క్యాట్-2024 స్కోర్ తప్పనిసరి.

ఎంపిక ప్రక్రియ: క్యాట్ 2024 స్కోర్‌కు 55 శాతం, ఎస్సే రైటింగ్‌కు 5 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 12 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కు 17 శాతం, అనుభవానికి 5 శాతం, అకడమిక్ మెరిట్‌కు 6 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 ఫిబ్రవరి 10
- **చిరునామా:** ప్రిన్సిపాల్ కో ఆర్డినేటర్-పీజీడీఎం(ఏబీఎం), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్), రాజేంద్రనగర్, హైదరాబాద్-500030
- **వెబ్‌సైట్:** www.manage.gov.in

జాబ్ కార్నర్

బెల్‌లో ఇంజనీర్లు

ఖాళీలు 13

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్)... ఫిక్స్‌డ్ టర్మ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ అసిస్టెంట్ ఇంజనీర్: **12 పోస్టులు**
2. సీనియర్ అసిస్టెంట్ ఫెసిలిటీ ఆఫీసర్: **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(ఎలక్ట్రానిక్స్/మెకానికల్/ఎలక్ట్రికల్), డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 2024 సెప్టెంబరు 1 నాటికి 50 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
జీతం: నెలకు రూ.40,000 - రూ.1,20,000
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 15
వెబ్‌సైట్: https://bel-india.in/

నాబార్డ్‌లో ఆఫీస్ అటెండెంట్ ఉద్యోగాలు

ఖాళీలు 108

ముంబయిలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
జీతం: నెలకు రూ.35,000
వయోపరిమితి: 18-30 ఏళ్లు మించరాదు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 21
వెబ్‌సైట్: https://www.nabard.org/

ఎన్ఆర్‌సీబీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 11

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐకార్)కు చెందిన తమిళనాడు, తిరుచిరాపల్లిలోని నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ బనానా(ఎన్ఆర్‌సీబీ)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అగ్రికల్చర్, హార్టికల్చర్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ(బీఎస్సీ/బీసీఏ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
శిక్షణ కాలం: ఒక సంవత్సరం
స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9000; టెక్నీషియన్ అప్రెంటిస్‌లకు రూ.8000
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7
వెబ్‌సైట్: https://nrcb.icar.gov.in/



ఐటీబీపీలో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 819

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: కానిస్టేబుల్(కిచెన్ సర్వీసెస్)
ఖాళీలు: 819(యూఆర్-458, ఎస్సీ-48, ఎస్టీ-70, ఓబీసీ-162, ఈడబ్ల్యూఎస్-81). పురుషులకు 697, మహిళలకు 122 ఖాళీలు ఉన్నాయి.
శారీరక ప్రమాణాలు: పురుషులకు ఎత్తు 165 సెం.మీ., మహిళల ఎత్తు 155 సెం.మీ. పురుషుల ఛాతీ 75 సెం.మీ. నుంచి 80 సెం.మీ. మధ్య ఉండాలి.
వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
పే స్కేల్: నెలకు రూ.21,700- రూ.69,100
ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రాత పరీక్ష, డిటైల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్, రివ్యూ మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 1
వెబ్‌సైట్: https://itbpolice.nic.in/

ఎగ్జిమ్ బ్యాంకులో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 50

ముంబయిలోని ఎక్స్‌పోర్ట్- ఇంపోర్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎగ్జిమ్ బ్యాంకు)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ(బ్యాంకింగ్ ఆపరేషన్స్)
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఫైనాన్స్/ఇంటర్నేషనల్ బిజినెస్/ఫారిన్ ట్రేడ్ లేదా చార్టర్డ్ అకౌంటెంట్‌లో స్పెషలైజేషన్‌తో పీజీ(ఎంబీఏ/పీజీడీబీఏ/పీజీడీబీఎం/ఎంఎంఎస్)ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
జీతభత్యాలు: నెలకు రూ.48,480 నుంచి రూ.85,920
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా
దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఈడబ్ల్యూఎస్/మహిళా అభ్యర్థులకు రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7
వెబ్‌సైట్: www.eximbankindia.in/

బీఐఎస్‌లో వివిధ ఖాళీలు

ఖాళీలు 345

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్), డైరెక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

గ్రూప్-ఎ పోస్టులు
- అసిస్టెంట్ డైరెక్టర్: **3 పోస్టులు**

గ్రూప్-బి పోస్టులు
- పర్సనల్ అసిస్టెంట్: **27**
- అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్: **43 పోస్టులు**
- అసిస్టెంట్: **1 పోస్టు**
- టెక్నికల్ అసిస్టెంట్: **27 పోస్టులు**

గ్రూప్-సి పోస్టులు
- స్టెనోగ్రాఫర్: **19 పోస్టులు**
- సీనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **128 పోస్టులు**
- జూనియర్ సెక్రటేరియల్ అసిస్టెంట్: **78 పోస్టులు**
- సీనియర్ టెక్నీషియన్: **18**
- టెక్నీషియన్: **1 పోస్టు**

విభాగాలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక: ప్రాక్టికల్ అసెస్‌మెంట్, రాత పరీక్ష, టెక్నికల్ నాలెడ్జ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30
వెబ్‌సైట్: www.bis.gov.in/

లిటిల్స్

మొదటికే మోసం

ఒక ఊరిలో రంగయ్యలనే హోటల్ యజమాని దగ్గర రాము, రాజు అనే ఇద్దరు కుర్రాళ్లు పని చేస్తూ ఉండేవారు. రంగయ్య వద్ద ఒక కోడి పుంజు ఉండేది.అది అలవాటుగా రోజూ తెల్లవారు ఝామునే లేచి, కూసి, రంగయ్యను నిద్ర లేపుతూ ఉండేది. దాని కూతతో మేలుకున్న

రంగయ్య ఆ వెంటనే ఇద్దరు పనివారిని నిద్రలేపి, హోటల్లో పని చేయడానికి పంపించే వాడు, రాము రాజు ఇద్దరూ మంచి పనివారే కానీ వారిద్దరికీ అంత ఉదయాన్నే చీకటితో నిద్రలేవడం అసలు నచ్చేది కాదు. తమను త్వరగా లేపడానికి కారణమైన కోడి పుంజును బాగా తిట్టుకునే వారు. రోజూ ఇలాగే జరుగుతుండటంతో చిరాకుపడిన ఆ ఇద్దరూ ఒక రోజు తమ యజమానికి తెలియకుండా ఆ కోడిపుంజును తీసుకెళ్లి, పక్క ఊరిలో అమ్మేసారు. యజమానిఅడిగితే అది కనిపించకుండా పోయిందని చెప్పారు. ఆ మర్నాడు కోడిపుంజు లేకపోవడంతో రంగయ్య బారెడు పొద్దెక్కాక, ఆలస్యంగా నిద్ర లేచాడు. అతనే ఆలస్యంగా మేలుకోవడంతో, పనివారిని కూడా పంపడం కుదరలేదు. ఇద్దరు పనివారికి ఆ రోజు హాయిగా బోలెడు విశ్రాంతి దొరికింది అని చాలా ఆనందించారు కానీ రంగయ్య మాత్రం ఆ రోజు వ్యాపారం దెబ్బ తిన్నదని చాలా బాధ పడ్డాడు. ఆ రోజుఅలా జరగడంతో, సరిగా నిద్రపట్టని రంగయ్య అర్ధరాత్రి ఏదో సమయానికి మెలకువ వచ్చి, ఇద్దరు పనివారిని కూడా అదే సమయంలో నిద్రలేపి, పనికిపంపించాడు ఇలా రెండు రోజులు గడిచాక ఇద్దరు పనివారు రంగయ్యతోఇలా అన్నారు.అయ్యా.మనకు వేళకు నిద్ర లేవడం కష్టంగా ఉంది కాబట్టి.ఒక కొత్త కోడిపుంజును కొనుక్కుందాం' అన్నారు. దానికి రంగయ్య 'ఎందుకు ఇపుడు అనవసరపు ఖర్చు? నాకు బాగానే మెలకువ వస్తోందిగా.రోజూ నేనే నిద్ర లేచి, అదే సమయానికి మీ ఇద్దరినీ నిద్రలేపుతాను' అన్నాడు. ఆ మాటలు విన్న ఇద్దరికీ ప్రాణాలు పైనే పోయాయి. ఇంతకు ముందు దొరికిన ఆ మాత్రం విశ్రాంతి కూడా దొరక్కపోవడం చూసి, అనవసరంగా కోడిపుంజును మాయం చేసినందుకు బాధ పడ్డారు రాము, రాజు.



6 తేడాలను కనిపెట్టండి





సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 422

7			1					2
1								
	2			3		7		6
5	3				9	6		
	6		7		1		9	
		4	2				5	8
6		5		7			3	
								4
2					4			5

సుడోకు - 421 సమాధానం

6	3	8	1	2	5	4	9	7
1	4	2	6	7	9	3	5	8
7	9	5	4	3	8	6	2	1
4	5	7	9	6	1	8	3	2
9	8	3	7	4	2	1	6	5
2	6	1	8	5	3	7	4	9
3	1	9	5	8	4	2	7	6
8	7	4	2	9	6	5	1	3
5	2	6	3	1	7	9	8	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.